


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

అనుక్షణం
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 05 ఆదివారం | జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 110
Navabhoomi daily fallows..




# ఎకరానికి రూ.12వేలు

**26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు జారీ**

- ఇందిరమ్మ భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా
- భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ
- ఆత్మీయ భరోసా పథకం కింద రూ. 12 వేలు ఇస్తాం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు శుభవార్త చెప్పారు. తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం శనివారం రాత్రి సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ నిర్ణయాలను ఆయన వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తామన చెప్పారు. ఇందిరమ్మ భరోసా కింద రైతులకు ప్రతి ఎకరానికి ఏడాదికి రూ. 12 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 12 వేల రూపాయలను ఇవ్వడం జరుగుతుందన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. సాగులో లేని భూములకు రైతుభరోసా ఇవ్వమని స్పష్టం చేశారు. రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్లకు, పరిశ్రమలకు రైతు భరోసా ఇవ్వడం జరగదని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. ప్రభుత్వ ఆదాయం పెంచడం.. పేద ప్రజలకు పంచడం తమ ప్రభుత్వ విధానమని అన్నారు. రైతు భరోసాకు ఆమోద ముద్రతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, బీసీ రిజర్వేషన్లు, నూతన మండలాల ఏర్పాటు, రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీతోపాటు 22 అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్రమంత్రి



## తల్లిదండ్రులను సరిగ్గా చూడకుంటే..

# గిఫ్ట్‌డీడ్ ఆస్తుల రద్దు

- ఆస్తులు రాసిచ్చిన తల్లితండ్రుల బాగోగులు చూడకపోతే ఆస్తులు తిరిగి పొందే హక్కు
- తల్లిదండ్రులు, వృద్ధుల నిర్వహణ(పోషణ), సంక్షేమ చట్టం ఆ అధికారాన్ని ఇస్తుంది
- నెలలోగా ఆస్తి బదలాయింపు..తేల్చి చెప్పిన సుప్రీం కోర్టు ధర్మాసనం
- సుప్రీం గడప ఎక్కిన మధ్యప్రదేశ్‌లోని చిత్తార్‌పూర్‌కు చెందిన వృద్ధ దంపతులు..



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** గిఫ్ట్‌డీడ్ కింద ఆస్తులను రాసిచ్చాక.. తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించి, వారి బాగోగులు చూడని బిడ్డల నుంచి ఆ ఆస్తులను తిరిగి పొందే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తల్లిదండ్రులు, వృద్ధుల నిర్వహణ(పోషణ), సంక్షేమ చట్టం ఆ అధికారాన్ని ఇస్తుందని జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని చిత్తార్‌పూర్‌కు చెందిన వృద్ధ దంపతులు.. తమ కొడుక్కి కొంత ఆస్తిని గిఫ్ట్‌డీడ్ రూపంలో బదిలీ చేశారు. వారి బాగుగోలు చూసుకోని ఆ కొడుకు, మిగతా ఆస్తిని కూడా రాసివ్వాలంటూ దాడులు మొదలు పెట్టాడు. దీంతో ఆ వృద్ధ మహిళ తొలుత సబ్-డివిజనల్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించి, న్యాయం పొందారు. మెజిస్ట్రేట్ ఆ గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి, ఆస్తిపై వృద్ధ దంపతుల హక్కులను పునరుద్ధరించారు. కొడుకు హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లగా.. సింగిల్ బెంచ్ వద్ద వృద్ధ దంపతులకు న్యాయం జరిగినా.. డివిజన్ బెంచ్ మాత్రం గిఫ్ట్‌డీడ్ రద్దు సాధ్యం కాదని తేల్చిచెప్పింది. దీంతో బాధిత మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం.. వృద్ధుల బాగోగులను పట్టించుకోని పిల్లలకు ఇచ్చిన గిఫ్ట్‌డీడ్ దానంతట అదే(డీమ్డ్ టు బి) రద్దవుతుందని స్పష్టం చేసింది. గిఫ్ట్‌డీడ్ ద్వారా ఆ వృద్ధ దంపతులు తమ కుమారుడికి ఇచ్చిన ఆస్తిని, తిరిగి వారి పేరిట పునరుద్ధరించింది. వచ్చే నెలాఖరులోగా ఆస్తి బదలాయింపు జరగాలని ఆదేశాలు జారీ చేసింది.

# ఏపీ ప్రాజెక్టులపై అధ్యయనం

- పోలవరం సహా ఏపీ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- పోలవరం,కొత్త ప్రాజెక్టులతో తెలంగాణపై పడే ప్రభావాన్ని అధ్యయనం
- ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం.సమన్వయానికి ప్రత్యేక అధికారి
- భద్రాచలం ఆలయానికి ముప్పు అవకాశాలపై ఈ బృందం అధ్యయనం
- బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంపై ఏపీసీఎస్‌కు అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మిస్తున్న, నిర్మించతల పెట్టిన నీటి ప్రాజెక్టులపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శనివారం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలన్నారు. భద్రాచలం ఆలయానికి ముప్పు ఏర్పడే అవకాశాలపై ఈ బృందం అధ్యయనం చేయనుంది. 2022లో వచ్చిన వరదల వల్ల భద్రాచలం ముంపునకు గురైందని, 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని అధికారులు ఈ సందర్భంగా సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా బనకచర్ల ప్రాజెక్టు చేపడుతోందని.. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏపీ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందన్నారు. వరద జలాల ఆధారంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. తెలంగాణ అభ్యంతరాలను ఏపీ సీఎస్‌కు తెలపాలని, అవసరమైతే గోదావరి బోర్డ్, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# ఏపీలో ఇక ఏటా టీచర్ల బదిలీలు

- అసెంబ్లీలో ఓ చట్టం చేసేందుకు ప్రభుత్వం సిద్ధం
- బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందాక
- ఇక ఏటా వేసవిలో టీచర్లను బదిలీ
- ప్రస్తుతం ఉన్న బదిలీల నిబంధనలే వర్తింపు
- విద్యాసంస్థల్ని గాడిన పెట్టేందుకు పలు సంస్కరణలు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:**ఏపీలో టీచర్లకు కూటమి సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో టీచర్ల బదిలీల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల నేపథ్యంలో శాశ్వత పరిష్కారం దిశగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా త్వరలో అసెంబ్లీలో ఓ చట్టం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందాక ఇక ఏటా వేసవిలో టీచర్లను బదిలీ చేస్తారు. అయితే ఇందుకు ప్రస్తుతం ఉన్న బదిలీల నిబంధనలే వర్తింపచేస్తారు. రాష్ట్రంలో విద్యాసంస్థల్ని గాడిన పెట్టేందుకు పలు సంస్కరణలు అమలు చేస్తున్న

# సినిమా టికెట్లు పెరిగితే సర్కార్‌కేగా ఆదాయం

- సినిమా టికెట్ల ధరల పెంపుపై నెగెటివ్ ప్రచారం
- టికెట్ల పెంపు వల్ల సర్కార్‌కు 18శాతం ఆదాయం
- బ్లాక్‌లో టికెట్లు అమ్మితే..వేరే వ్యక్తికి లాభం
- సినిమా రంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం
- గేమ్ ఛేంజర్ ఈవెంట్‌లో డిప్యూటీ సీఎం పవన్



**రాజమండ్రి-నవభూమిబ్యూరో:** రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' ఈవెంట‌్‌లో పవన్ కళ్యాణ్ హాట్ కామెంట్స్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన గేమ్ ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ రాజమహేంద్రవరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సినిమా టికెట్ల రేట్ల పెంపు, రాజకీయ అంశాలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా టికెట్ ధరల పెంపుపై.. సినిమా టికెట్ ధరల పెంపు

# గిన్నిస్‌బుక్ ఎక్కిన సూర్యాపేట వాసి



2

- నాలుకతో నిమిషంలో 57 ఫ్యాన్ బ్లేడ్లను ఆపి... గిన్నిస్‌బుక్‌లో నమోదు
- గిన్నిస్ వరల్డ్ రికార్డుకెక్కిన సూర్యాపేట వాసి క్రాంతి కుమార్
- సాహసోపేత ప్రదర్శన వీడియోను షేర్ చేసిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ
- వీడియోపై తమదైన శైలిలో స్పందిస్తున్న నెటిజన్లు

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
అసాధ్యం అనుకునే పనిని సుసాధ్యం చేస్తూ, అందులోనూ తక్కువ సమయంలో అలాంటి పనులు చేసే వారికే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కుతుంది. తాజాగా తెలంగాణకు చెందిన క్రాంతి కుమార్ పనికెర అనే వ్యక్తి కూడా ఒక సాహసోపేత పనితో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కెక్కాడు. సూర్యాపేట వాసి క్రాంతి కుమార్ ఒక్క నిమిషంలో 57 ఎలక్ట్రిక్ ఫ్యాన్ బ్లేడ్‌లను నాలుకతో ఆపేసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు.
మనోడి ఈ సాహసోపేత ప్రదర్శన తాలూకు వీడియోను గిన్నిస్ బుక్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకుంది. వీడియోలో వేగంగా తిరుగుతున్న ఫ్యాన్ బ్లేడ్లను క్రాంతి కుమార్ తన నాలుకతో ఆపడం కనిపించింది. కొన్ని ఫ్యాన్లను ఆపిన తర్వాత అతని నాలుకకు గాయమై రక్తం కారడం కూడా వీడియోలో ఉంది.
అయినా అతడు వెనుకడుగు వేయకుండా అలాగే ముందుకు సాగాడు. చివరికి ఒక్క నిమిషంలో 57 ఎలక్ట్రిక్ ఫ్యాన్ బ్లేడ్‌లను నాలుకతో ఆపి వరల్డ్ రికార్డు సృష్టించాడు. దీంతో క్రాంతి కుమార్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ సర్టిఫికెట్ అందజేసింది.
"57 ఎలక్ట్రిక్ ఫ్యాన్ బ్లేడ్‌లు క్రాంతి కుమార్ ఒక్క నిమిషంలో నాలుకను ఉపయోగించి ఆపేశారు" అని గిన్నిస్ బుక్ రాసుకొచ్చింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు తమదైనశైలిలో స్పందిస్తున్నారు.

# అడవిలో దారి తప్పి..

- ఆరుగురు బీటెక్ విద్యార్థుల విహారయాత్ర విషాదం
- జలపాతం సుడిగుండంలో చిక్కి ఒకరు మృతి
- విద్యార్థి మృతదేహాన్ని తీసుకొని అడవిలో దారి తప్పారు..
- అడవుల్లో మొబైల్ సిగ్నల్ అందగానే పోలీసులకు సమాచారం
- అర్ధరాత్రి వేళ అడవుల్లోకి వెళ్లి రక్షించిన అటవీశాఖ,పోలీసులు

2



**తిరుపతి-నవభూమిబ్యూరో**
తిరుపతి జిల్లాలోని శేషాచలం అడవులకు వెళ్లిన ఆరుగురు బీటెక్ విద్యార్థుల విహార యాత్ర విషాదంగా ముగిసింది. అడవిలో వాటర్ ఫాల్స్ అందాలను చూసేందుకు వెళ్లిన వారిలో ఒకరు చనిపోగా.. మిగిలిన వారు అర్ధరాత్రి తప్పిపోయారు. నానా కష్టాలు పడ్డాక చివరికి పోలీసులు వారిని కాపాడారు. దీంతో హమ్మయ్య అనుకుంటూ వారు ఇళ్లకు చేరుకున్నారు. రాష్ట్రంలో కలకలం రేపిన ఈ ఘటన వివరాలు ఓసారి చూద్దాం.. శ్రీకాహళహస్తికి చెందిన ఆరుగురు బీటెక్ విద్యార్థులు శేషాచలం అడవుల్లో ఉన్న వాటర్ ఫాల్స్ ను చూద్దామని నిన్న ఉదయం వెళ్లారు. వాటర్ ఫాల్స్ లోకి దిగి కాసేపు ఉల్లాసంగా గడిపారు. అయితే అంతలోనే అక్కడ ఉన్న సుడిగుండంలో పడి సాయిదత్త అనే విద్యార్థి చనిపోయారు. దీంతో భయ భ్రాంతులైన మిగతా ఐదుగురు అడవుల్లోకి వెళ్లారు. అక్కడ వీరు దారి తప్పిపోయారు. ఓవైపు రాత్రి కావడం, దారి తెలియకపోవడంతో అర్ధరాత్రంతా అక్కడే తిరుగుతూ ఉండిపోయారు. ఎటువెళ్లాలో తెలియదు, ఫోన్ సిగ్నల్స్ పనిచేయడం లేదు, ఇలాంటి పరిస్థితుల్లో బీటెక్ విద్యార్థులకు చివరిగా ఓ దారి దొరికింది. అడవుల్లోనే కాస్త

# 116 ఏళ్ల బామ్మ మృతి

- ప్రపంచంలో అత్యంత వృద్ధురాలిగా గుర్తింపు
- జపాన్ ఒసాకాలో 1908లో జననం
- గత ఏడాది డిసెంబర్ 29న కన్నుమూత
- గత ఏడాది ఆగస్టులో 117 ఏళ్ల స్పెయిన్ దేశస్థురాలు బ్రన్యాస్ మొరేరా మృతితో ఇటూకాకు గుర్తింపు



**టోక్యో-నవభూమిబ్యూరో**
ఈ ఫొటోలో కనిపిస్తున్న బామ్మ పేరు టొమికో ఇటూకా. జపాన్‌కు చెందిన ఈమె ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా పేరుగాంచారు. 116 ఏళ్ల వయసున్న ఈమె డిసెంబరు 29న కన్నుమూసినట్టు శనివారం ప్రకటించారు. 1908 మే 23న ఈమె.. అషియా సిటీకి సమీపంలోని ఒసాకాలో జన్మించారు. గత ఏడాది ఆగస్టులో 117 ఏళ్ల స్పెయిన్ దేశస్థురాలు బ్రన్యాస్ మొరేరా మృతి చెందడంతో ఇటూకాను ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళగా గుర్తించారు. ఇదిలా ఉండగా.. సెప్టెంబరు నాటికి జపాన్‌లో వందేళ్లు అంతకన్నా ఎక్కువ వయసున్న వారి సంఖ్య 95వేలకు పైగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో 88 శాతం మంది మహిళలేనట.

## పాలమూరు పాలిటెక్నిక్ కాలేజీలో


# గలీజ్ గాడు!

- మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కాలేజీలో దారుణం..
- అమ్మాయిల వాష్‌రూంలో వీడియో రికార్డింగ్..
- వీడియోలు రికార్డు చేస్తున్నట్లు గుర్తించిన విద్యార్థినులు కాలేజీ ఎదుట ఆందోళన
- అదే కాలేజీ విద్యార్థిగా పోలీసులు గుర్తింపు
- వాష్‌రూంలో మొబైల్ పెట్టినట్లుగా అంగీకారం

2



# గేమ్ ఛేంజర్ టికెట్ రేట్లను పెంపునకు అనుమతి



- గేమ్ ఛేంజర్‌కు ఏపీ గుడ్ న్యూస్-టికెట్లకు స్పెషల్ రేట్లు ఇవే..!
- రాత్రి ఒంటిగంట బెనిఫిట్ షో టికెట్ ధర 600 రూపాయలు
- 10 నుంచి 23 వరకు రోజుకు 5 షోలకు అనుమతి
- మల్టిప్లెక్స్‌లలో టికెట్‌పై అదనంగా రూ.175 పెంచుకోవచ్చు
- సింగిల్ స్క్రీన్స్‌లో టికెట్‌పై అదనంగా రూ.135 పెంచుకోవచ్చు



**అమరావతి-నవభూమిబ్యూరో**
గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీ ఈ సంక్రాంతికి విడుదల అయ్యేందుకు సిద్ధమవుతోంది. ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ రెండు పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ సినిమాకు టికెట్ రేట్ల పెంపు కోసం నిర్మాతలు చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు ఇవాళ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం బెనిఫిట్ షోలకు నిరాకరించిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మాత్రం అనుమతి ఇవ్వడం విశేషం. ఏపీలో రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ చిత్రం బెనిఫిట్ షోకు కూటమి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు గేమ్ ఛేంజర్ టికెట్ రేట్లను పెంపుకు అనుమతి ఇస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం రాత్రి ఒంటిగంట బెనిఫిట్ షో టికెట్ ధర 600 రూపాయలుగా నిర్ణయించారు. జనవరి 10 నుంచి జనవరి 23 వరకు రోజుకు ఐదు షోల చొప్పున వేసుకునేందుకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఆ మేరకు వీటి టికెట్ రేట్లను కూడా ఖరారు చేసింది. బెనిఫిట్ షో కాకుండా మిగతా రోజుల్లో ఈ టికెట్ రేట్లు వర్తిస్తాయి. గేమ్ ఛేంజర్ చిత్రాన్ని ప్రదర్శించే మల్టిప్లెక్స్‌లలో టికెట్‌పై అదనంగా రూ.175 పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే సింగిల్ స్క్రీన్స్‌లో టికెట్ పై అదనంగా రూ.135 పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాగే బెనిఫిట్ షోతో పాటు మిగతా రోజుల్లో టికెట్లకు కూడా జీఎస్టీతో కలిపి ఈ రేట్లను వసూలు చేసుకోవాల్సి ఉంటుంది.

# కొంతమంది తెలుగు భాషను చిన్నచూపు చూస్తున్నారు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి..





**హైదరాబాద్-నవభూమి:** హెచ్ఐసీసీ వేదికగా ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలు రెండో రోజూ అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహాసభలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించగా.. తెలుగు ప్రముఖులు, సినిమా కళాకారులు, సాహితీవేత్తలు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకూ హైదరాబాద్ వేదికగా మహాసభలు జరగనున్నాయి. నేడు జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రపంచ తెలుగు సమాఖ్య సందర్భంగా వచ్చిన తెలుగువారి అందరికీ శుభాకాంక్షలు. తెలుగు భాష అత్యంత ప్రాచీన భాష. ఈ భాష గొప్పతనం ప్రపంచ దేశాలకు తెలిసేలా తేటతేట తెలుగులా.. తెల్లవారి వెలుగులా అని పాడుతాం. తెలుగులో ప్రతి పదానికి ఒక అర్థం ఉంటుంది. ప్రపంచంలో అత్యంత మధురమైన భాష తెలుగు. దేశ భాషలందు తెలుగు లెస్సా అని కృష్ణ దేవరాయలు ఊరికే అనలేదు. ప్రాచీన తెలుగు సాహిత్యానికి కేంద్రం ఎనలేని గౌరవం ఇచ్చింది. తెలుగు భాషను ఎంతో మంది మహానుభావులు కొంతపుంతలు తొక్కించారు. నిజాం కాలంలో మన భాష అణగదొక్కబడింది. అప్పట్లో ఆంధ్ర మహాసభలు నిర్వహించి నిర్బంధాలను దాటారు. కొంతమంది తెలుగు భాషను చిన్న చూపు చూస్తున్నారని" అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని సంఘటితం చేసి తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు, సంప్రదాయ విలువలు, తెలుగు జాతి వారసత్వ సంపదను పరిపుష్టి చేయడమే ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల ముఖ్య ఉద్దేశం.

## ప్రియురాలి కోసం యువకుల మధ్య ఘర్షణ.. చివరికి ఏమైందంటే..




**మేడ్చల్-నవభూమి:**మేడిపల్లి బాయ్స్ హాస్టల్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. వివాహేతర సంబంధం నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఓ మహిళ కోసం ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణాలు పోవడానికి కారణం అయ్యింది. ప్రియురాలు తనకే దక్కాలని భావించిన ఓ యువకుడు అతి దారుణంగా కత్తితో పొడిచి మరో యువకుడిని హత్య చేశాడు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి మల్లికార్జున నగర్‌లోని ఓ బాయ్స్ హాస్టల్లో మహేందర్ రెడ్డి(38) దారుణ హత్యకు గురయ్యాడు. అదే హాస్టల్‌లో ఉంటున్న కిరణ్ రెడ్డి అనే వ్యక్తి మహేందర్ రెడ్డిని అతి కిరాతంగా చంపేశాడు. వంట సామగ్రితో దాడి చేసి అనంతరం కత్తితో పొడిచి హతమార్చాడు. జనగామకు చెందిన మహేందర్ రెడ్డి గతంలో ఇదే హాస్టల్లో ఉండేవాడు. హాస్టల్ నిర్వాహకురాలితో ఇతను సన్నిహితంగా ఉండేవాడు. మహేందర్ రెడ్డి ప్రస్తుతం జనగామలో నివాసం ఉంటున్నాడు. అప్పుడప్పుడు హాస్టల్‌కి వచ్చి వెళ్తుండేవాడు. అయితే కొంతకాలంగా హాస్టల్ నిర్వాహకురాలు కిరణ్ రెడ్డితో సన్నిహితంగా ఉంటూ వస్తోంది.శుక్రవారం అర్ధరాత్రి జనగామ నుంచి మహేందర్ రెడ్డి హాస్టల్‌కు రాగా.. ఇదే విషయమై కిరణ్, మహేందర్ మధ్య వివాదం చెలరేగింది. ఇది కాస్త ఘర్షణకు దారితీయడంతో రెచ్చిపోయిన కిరణ్ వంట సామగ్రితో మహేందర్ రెడ్డిపై దాడి చేశాడు. అనంతరం అక్కడే ఉన్న కత్తితో పొడిచి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు కిరణ్ రెడ్డి, హాస్టల్ నిర్వహకురాలిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే కావాలనే పిలిపించి పక్కా పథకం ప్రకారం హత్య చేశారా? లేక ఇద్దరి మధ్య గొడవతో క్షణికావేశంలో హత్య జరిగిందా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అదృశ్యమైన ముగ్గురు బాలికలు.. ఆపై ఉచిత ఆర్టీసీ బస్సు ఎక్కి.. బాబోయ్..




**నిజామాబాద్-నవభూమి:** అదృశ్యమైన నవీ పేట బాలికల ఉన్నత పాఠశా లకు చెందిన ముగ్గురు విద్యార్థినుల ఆచూకీ ఎట్టకేలకు లభించింది. ఉచిత ప్రయాణం కావడంతో ఆర్టీసీ బస్సు ఎక్కిన బాలికలు నిజామా బాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్ ప్రాంతాల్లో చక్కర్లు కొట్టారు. ఓ విద్యార్థిని వద్ద ఉన్న సెల్ ఫోన్ ఆధారంగా వారిని ట్రాక్ చేసిన పోలీ సులు ఎట్టకేలకు కేసును ఛేదించారు. వారిని సురక్షితంగా కాపాడి తల్లి దండ్రులకు అప్పగించారు. బాలికలు తప్పిపోవడం రాష్ట్రవ్యాప్తంగా సం చలనం సృష్టించింది. కేసును సవాల్‌గా తీసుకున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్ చాకచక్యంగా పరిష్కరించారు.

**అసలేం జరిగిందంటే..**నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థినిలు స్థానికంగా ఉన్న బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. నూతన సంవత్సరం కావ డంతో పలు ప్రాంతాలకు వెళ్లి చూసొద్దామని ఆ ముగ్గురు స్నేహితురాళు ప్లాన్ చేశారు. అనుకున్నదే తడవుగా ఈనెల 2న(గురువారం) ఉదయం పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి ఇంట్లో నుంచి వచ్చేశారు. ఆ తర్వాత పాఠశాలకు వెళ్లకుండా బోధన్ బస్సు ఎక్కి వెళ్లిపోయారు. అయితే స్కూల్‌కి రాకపోవడంతో పాఠశాల సిబ్బంది బాలికల తల్లిదం డ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఉదయాన్నే బయలుదేరి పాఠశాలకు వచ్చారని తల్లిదండ్రులు చెప్పగా.. ఇక్కడికి రాలేదంటూ వారు సమాధానం ఇచ్చారు.ఈ మేరకు బాలికల కోసం వారివారి తల్లిదండ్రులు తీవ్రంగా గాలించారు. గురువారం సాయంత్రం వరకూ వారి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. దీంతో అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు బాలికల కోసం తీవ్ర గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు విద్యార్థులు పలు ప్రాంతాలను చుట్టేసేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వాడుకున్నారు. ముందుగా వారు నవీపేట నుంచి బోధన్ వెళ్లారు. అనంతరం బోధన్ నుంచి నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్ ప్రాంతాలకు వెళ్లారు. అదే రోజు సాయంత్రం నవీపేటకు చేరుకున్నారు. అయితే మళ్లీ వాళ్లు ఆటోలో నిజామాబాద్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఓ బాలిక మాత్రం తాను రానని చెప్పి ఇంటికి వెళ్లిపోయింది. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఆ విద్యార్థిని తన స్నేహితురాళ్లకు ఫోన్ చేసింది. తాము నిజామాబాద్‌లో ఉన్నట్లు చెప్పగా తిరిగి అక్కడికి వెళ్లిపోయింది.అయితే బాలిక అక్కడికి వెళ్లే సరికి మిగతా ఇద్దరూ అక్కడ లేరు. దీంతో విద్యార్థిని నిజామాబాద్ బస్టాండ్‌లోనే ఉండిపోయింది. అప్పటికే వీరి కోసం గాలిస్తున్న పోలీసుల కు ఈ చిన్నారి కనిపించింది. వెంటనే ఆమెను రక్షించి అసలేం జరిగిం దంటూ ఆరా తీశారు. దీంతో జరిగిన విషయం మ్నెత్తం పోలీసులకు చెప్పింది. బాలిక ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగతా ఇద్దరి కోసం పోలీసులు గాలించారు. ఓ విద్యార్థిని వద్ద సెల్ ఫోన్ ఉన్నట్లు తెలుసుకుని దాన్ని ట్రాక్ చేశారు. దీంతో వారు కరీంనగర్ నుంచి నిజా మాబాద్ వస్తున్నట్లు తెలుసుకున్నారు. శుక్రవారం సాయంత్రం వారు బస్టాండ్‌కు రాగానే అదుపులోకి తీసుకున్నారు. అయితే తాము గురువారం రాత్రంతా కరీంనగర్ బస్టాండ్‌లో ఉన్నట్లు విద్యార్థినిలు చెప్పారు. అనంతరం ముగ్గురికీ కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు.. తల్లిదండ్రుల వద్ద వారిని చేర్చారు. దీంతో కథ సుఖాంతం అయ్యింది.

## అడవిలో దారి తప్పి..


**(1వపేజీ తరువాయి)**సిగ్నల్ వచ్చే ప్రాంతానికి వెళ్లి అక్కడి నుంచి పోలీసులకు కాల్ చేసి సంప్రదించారు. దీంతో పోలీసులు కూడా షాకయ్యారు. చివరికి విద్యార్థులు అడవిలో తాము ఉన్న లొకేషన్ ను పోలీసులకు షేర్ చేశారు. దీంతో రైల్వే కోడూరు పోలీసులు, స్థానిక అటవీ అధికారులతో కలిసి వారిని చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ అడవిలోకి వెళ్లి మరీ వారిని కాపాడారు. ఉదయానికి బీటెక్ విద్యార్థుల్ని తీసుకుని అడవిలో నుంచి బయటికి వచ్చారు. రైల్వే కోడూరు పీఎస్ కు తీసుకొచ్చి వారి తల్లి తండ్రులకు అప్పగించారు. దీంతో కథ సుఖాంతమైంది.

## పాలిటెక్నిక్ కాలేజీ గర్ల్స్ బాత్రూంలో కెమెరాలు.. మరో గలీజ్‌గాడు



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లోని సీఎంఆర్ కాలేజీలోని గర్ల్స్ హాస్టళ్లలోని బాత్రూంలలో కెమెరాలు పెట్టి సీక్రెట్ వీడియోలు తీశారన్న ఆరోపణలు రాష్ట్రమంతా ఉలిక్కిపడేలా చేసింది. ఆ ఘటన పూర్తిగా తేలక ముందే.. అచ్చం అలాంటి ఘటనే మరొకటి వెలుగు చూసింది. మహబూబ్‌నగర్‌లో పాలిటెక్నిక్ కాలేజీలోని గర్ల్స్ బాత్రూంలో కెమెరాలు పెట్టి సీక్రెట్‌గా వీడియోలు తీస్తున్నట్టు విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో.. రంగంలోకి దిగిన పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ శివారులోని మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన సీఎంఆర్ ఇంజనీరింగ్ క్యాంపస్‌లో.. గర్ల్స్ హాస్టల్ వాష్ రూంలో కెమెరాలు పెట్టి సీక్రెట్‌గా వీడియోలు తీశారంటూ విద్యార్థులు చేసిన ఆందోళనలు ఇంకా సద్దుమణగనే లేదు.. అచ్చం అలాంటి ఘటనే మరొకటి వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో.. గర్ల్స్ బాత్రూంలో మొబైల్ కెమెరాలు పెట్టి సీక్రెట్‌గా వీడియోలు తీస్తున్న ఘటన కలకలం సృష్టించింది. ఈ ఘటనపై కాలేజీ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని విద్యార్థినులు ఆందోళనకు దిగారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుని దగ్గరున్న మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇతనొక్కడే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడా.. గ్యాంగ్ ఏమైనా ఉందా.. విద్యార్థినిల వీడియోలు వేరే ఎవరికైనా పంపించాడా.. సోషల్ మీడియాల్లో ఏమైనా అప్‌లోడ్ చేశాడా.. ఇలాంటి పని ఎందుకు చేస్తున్నాడు.. ఇలా అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.
ఇప్పటికే సీఎంఆర్ కాలేజీ ఘటన వెలుగులోకి రావటంతో.. రాష్ట్రమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అందులోనూ.. ఏకంగా 300 వీడియోలు తీశారంటూ ప్రచారం కావటంతో మరింత సంచలనంగా మారింది. ఈ ఘటనతో.. రాష్ట్రంలో విద్యార్థినులంతా భయపడాల్సిన పరిస్థితి ఎదురైంది. పాఠశాలలు, కాలేజీలు, హాస్టళ్లలోని బాత్రూంలలో సీక్రెట్‌గా కెమెరాలు పెడుతున్నారంటూ తరచూ వస్తున్న వార్తలతో.. అటు అమ్మాయిలే కాదు.. వారి తల్లిదండ్రులు కూడా భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. అమ్మాయిలను హాస్టళ్లకు పంపించాలంటేనే జంకుతున్నారు.ఇతెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్న సమయంలో.. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ.. కొందరు ఆకతాయిల్లో మాత్రం మార్పు రావటం లేదు. పవిత్రమైన విద్యాలయాల్లో మలినమైన ఆలోచనలతో ఇలాంటి చెత్త పనులకు పాల్పడుతుండటం శోచనీయం. మరి ఈ వరుస ఘటనల నేపథ్యంలో.. ప్రభుత్వం ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## యాదగిరిగుట్ట: ఫ్యాక్టరీలో భారీ పేలుడు.. ఒకరు మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు



**హైదరాబాద్-నవభూమి:** యాదగిరి గుట్ట మండలంలోని ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఓ కార్మికుడు మృతి చెందగా.. మరో ఏడుగురు కార్మికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

**యాదగిరిగుట్టలో ప్రమాదం**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు శివారులోని ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ కంపెనీలో ఇవాళ ఉదయం భారీ పేలుడు సంభవింవింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన వ్యక్తి జనగాం జిల్లా బచ్చన్నపేట గ్రామానికి చెందిన మార్క కనకయ్య(54)గా గుర్తించారు. గాయపడిన ఏడుగుర్ని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కిమ్స్, యశోదా ఆసుపత్రులకు తరలించారు.
కార్మికులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కంపెనీలో ఇవాళ ఉదయం 9:45 గంటల ప్రాంతంలో పీఆర్డీసీ బిల్డింగ్-3 లో పెల్లెట్ ఫార్ములా తయారు చేస్తుండగా ప్రమాదం జరిగింది. ఆకస్మాత్తుగా పేలుడు సంభవించిందని కంపెనీ డైరెక్టర్ దుర్గా ప్రసాద్ వెల్లడించారు. పేలుడు సమయంలో బిల్డింగ్‌లో మొత్తం 8 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో కనకయ్య మృతి చెందగా.. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం టిఫిన్ టైం కావటంతో కార్మికులంతా బయటకు రాగా.. 8 మంది మాత్రమే బిల్డింగ్‌లో ఉన్నారని దుర్గా ప్రసాద్ తెలిపారు. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో కార్మికులు బయటకు పరుగులు పెట్టారు. యాజమాన్యం ఎమర్జెన్సీ సైరన్‌తో కార్మికులను అప్రమత్తం చేసింది. గ్యాస్ ఎనర్జీ కావడంతో బ్లాస్ట్ జరిగి ఉంటుందని అన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.
రెండు ఆటోలను ఢీకొట్టిన కారు ఇక సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. కారు డ్రైవరు అజాగ్రత్త, మితిమీరిన వేగం నలుగురి ప్రాణాలను బలితీసుకుంది. కారు రెండు ఆటోలను ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మృతి చెందారు. హైదరాబాద్-మెదక్ రాష్ట్ర రహదారి(765(డీ))పై శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుల్లో నర్సాపూర్ పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈగా పనిచేస్తున్న మెదక్ మండలం పేరూర్ గ్రామానికి చెందిన మనీషా, రుస్తుంపేటకు చెందిన ఐశ్వర్యలక్ష్మి(20), ఎల్లారెడ్డిగూడకు చెందిన మాలోత్ ప్రవీణ్(30), కౌడిపల్లి మండలానికి చెందిన అనసూయ(62) ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## సినిమా టికెట్లు పెరిగితే సర్కార్‌కేగా ఆదాయం

**(1వపేజీ తరువాయి)**విషయంలో నెగెటివ్ ప్రచారం జరుగుతోందన్నా రు. సినిమా టికెట్ ధరలను ప్రభుత్వం ఊరికే పెంచడం లేదని.. దాని వల్ల జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి 18 శాతం ఆదాయం వస్తుంది పవన్ కళ్యాణ్ చెప్పారు. టికెట్ ధరల పెంపు అనేది డిమాండ్ సప్లై ఆధారంగా ఉంటుందన్నారు. బ్లాక్‌లో టికెట్లు కొంటే ఆ డబ్బు వేరే వాళ్లకు వెళు తుందని.. అదే ప్రభుత్వం టికెట్ ధరలు పెంచడం వల్ల జీఎస్టీ రూపంలో ఆదాయం వస్తుందన్నారు. తన సినిమాలకు టికెట్ ధరలు పెంచలేదన్నారు. గత ప్రభుత్వం బీమ్లానాయక్ సినిమా టికెట్ ధరలు పెంచకపోగా.. తగ్గించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి సినీనటులు అందరూ మద్దతు తెలపలేదు. అయినప్పటికీ తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. సినీ పరిశ్రమకు రాజకీయ రంగు పులమడం కూటి ప్రభుత్వానికి ఇష్టం లేదనిపవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. హీరోలతో నమస్కారాల పెట్టించుకునేవాళ్లం కాదు.. సినిమా పరిశ్రమ గురించి మాట్లాడా లంటే సినిమాలు తీసే వాళ్లే మాట్లాడాలని పవన్ కళ్యాణ్ అన్నారు. సినిమాలు తీసే వాళ్లతోనే తాము మాట్లాడుతామని, సినిమా టికెట్ ధరల విషయంలో హీరోలతో పనేంటి? అని ప్రశ్నించారు. నిర్మాతలు రావాలి లేదా ట్రేడ్ యూనియన్ బాడీలు రావాలన్నారు. హీరోలు వచ్చి నమస్కారాలు పెట్టాలనేంత కిందిస్థాయి వ్యక్తులం కాదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పాటించిన ఔన్నత్యాన్ని తాము కొనసాగిస్తామని చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఆయన తోటి నటులను గౌరవించేవారన్నారు. సినీ పరిశ్రమపై తమ కూటమి ప్రభుత్వానికి గౌరవం ఉందన్నారు పవన్ కళ్యాణ్. సీఎం చంద్రబాబు నాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారని.. ఆయన ఎప్పుడూ సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తూనే ఉన్నారని పవన్ తెలిపారు. నిజ జీవితంలో జరగని సంఘనలు సినిమా ప్రపంచంలో స్ఫూర్తినిస్తాయన్నారు. సినిమా మంచి, చెడు రెండింటినీ చూపిస్తుందనీ.. ఏది తీసుకోవాలో ప్రేక్షకుల ఇష్టమన్నారు. మంచి తీసుకుంటే బాగుపడతారన్నారు. సినిమాను సినిమాగానే చూడాలన్నారు. రామ్‌చరణ్ మా బంగారం హీరో రామ్‌చరణ్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండేతత్వం రామ్‌చరణ్‌ది అని అన్నారు పవన్ కళ్యాణ్. రామ్‌చరణ్ పుట్టినప్పుడు తాను ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు. రాముడి చరణాల వద్ద ఉండే వ్యక్తి ఆంజనేయుడు. ఎంత ఎదిగినా, శక్తిమంతుడైనా, ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలని తన తండ్రి రామ్‌చరణ్ పేరు పెట్టారని పవన్ కళ్యాణ్ చెప్పారు. అన్నయ్య చిరంజీవి తనకు తండ్రి లాంటివారని, చరణ్ తనకు తమ్ముడి లాంటివాడన్నారు. చిన్నప్పుడు బాగా ఏడిపించేవాడినని అన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన రామ్‌చరణ్ బంగారమని పవన్ కళ్యాణ్ అన్నారు. ఏడేళ్ల వయస్సులోనే రామ్‌చరణ్ హార్స్ రైడింగ్ నేర్చుకున్నాడని పవన్ చెప్పారు. ఇంత ప్రతిభ, సమర్థత ఉందని, ఎవరికీ తెలియదన్నారు. సుకుమార్ తీసిని రంగస్థలంలో రామ్‌చరణ్ నటన చూసి బెస్ట్ యాక్టర్ అవార్డు వస్తుందనుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తప్పకుండా రావాలన్నారు. గోదావరి జిల్లాల ప్రభావం అసలే లేని చరణ్ ఆ పాత్రలో ఒదిగిపోయాడన్నారు. చిరంజీవి వారసుడు అలా కాకపోతే ఎలా ఉంటాడు. తండ్రి మెగాస్టార్ అయితే.. కొడుకు గ్లోబల్ స్టార్ అవుతాడని అన్నారు పవన్. చిరంజీవి సినిమా తొలినాళ్లలో ఎంత కష్టపడ్డారని అన్నారు. ఇప్పటిలా సేఫ్టీ సౌకర్యాలు లేకపోవడంతో తరచూ గాయపడేవారన్నారు.

## "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం" పథకాన్ని ప్రారంభించిన మంత్రి

**అమరావతి-నవభూమి:** విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో "డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం" పథకాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ముందుగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన మంత్రి లోకేశ్.. తరగతి గదులు, కెమిస్ట్రీ ల్యాబ్ పరిశీలించారు. అనంతరం క్లాస్ రూముల్లో విద్యార్థినిలతో కాసేపు ముచ్చటించారు. రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న 1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజనం అందించాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు నేటి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ కళాశాలల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. %అయితే డొక్కా సీతక్క మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలతో మంత్రి లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో కీలకమైన దశ. మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు ఇప్పటి నుంచే దూరంగా ఉండటం అలవాటు చేసుకోవాలి. డ్రగ్స్ వాతావరణం మీ పరిసరాల్లో ఎక్కడ కనిపించినా వెంటనే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయండి. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నాం. మీరంతా బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలి. రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా కృషి చేస్తున్నాం. మీలో ఒక్కడిగా నన్నూ భావించి ఏం చేస్తే బాగుంటుందో సలహాలు సూచనలు ఇవ్వండి. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని" చెప్పారు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేడు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని కోసం ఈ ఏడాదికి రూ. 29.39 కోట్లు విడుదల చేయగా.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మరో రూ. 85.84 కోట్ల నిధులు కేటాయించారు. విద్యార్థులను చదువు వైపు మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు భోజనం అందించింది.

## ఎకరానికి రూ.12వేలు

**(1వపేజీ తరువాయి)**జైపాల్ రెడ్డి పేరు పెట్టాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. సింగూరు ప్రాజెక్టుకు మంత్రి దామోదర రాజనర్సింహ తండ్రి, దివంగత మంత్రి రాజనర్సింహ పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ2 వ్యయం 1784 కోట్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పాలమూరు-రంగారెడ్డిలో భాగంగా ఎదుల-డిండికి 1800 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్‌మెంట్‌లో 588 కారుణ్య నియామకాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 56 గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనంకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ఏపీలో ఇక ఏటా టీచర్ల బదిలీలు

**(1వపేజీ తరువాయి)**కూటమి సర్కార్ ఇందులో అత్యంత కీలకమైన టీచర్ల బదిలీల వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకుంటోంది. ఇప్పటివరకూ టీచర్ల బదిలీలు ఎప్పుడు జరుగుతాయో తెలియక గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వాలు హఠాత్తుగా టీచర్ల బదిలీలు చేపట్టడం లేదా పూర్తిగా వదిలేయడం చేయడం వల్ల స్కూళ్లలో విద్యాబోధన దెబ్బతింటోంది. దీంతో టీచర్ల బదిలీలకు ఓ చట్టం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.
రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న టీచర్ల బదిలీలతో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా ఇకపై వేసవిలోనే ఈ బదిలీలు ఉండేలా చేసేందుకు ప్రత్యేక చట్టం చేయబోతున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాలతో విద్యామంత్రి నారా లోకేష్ ఇప్పటికే పలు దఫాలుగా చర్చించారు. అనంతరం వారం రోజుల్లో ముసాయిదా చట్టం తీసుకురావాలని నిర్ణయించారు. ఇది వచ్చాక దీనిపై తిరిగి టీచర్లతో పాటు భాగస్వాములందరి నుంచి అభిప్రాయాలు తీసుకుంటారు. అనంతరం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఇకపై ఏటా వేసవిలో మాత్రమే బదిలీలు జరుగుతాయి. అలాగే తప్పనిసరి బదిలీలకు టీచర్లకు 8 ఏళ్లు, ప్రధానోపాధ్యాయులకు 5 ఏళ్ల సర్వీసును ప్రామాణికంగా తీసుకుంటారు. ఏటా మే 31వ తేదీని కటాఫ్ తేదీగా పరిగణించి సర్వీసును లెక్కిస్తారు. అయితే ఈ బదిలీలకు విద్యా సంవత్సరాలను బదిలీలకు ప్రామాణికంగా తీసుకోవాలని టీచర్లు కోరుతున్నారు. కానీ ప్రభుత్వం సాధారణ సంవత్సరాన్నే ప్రామాణికంగా తీసుకుంటామని చెబుతోంది. అలాగే జీరో సర్వీసు బదిలీలు ఉండాలని టీచర్లు కోరుతున్నారు. దీనిపై ముసాయిదా బిల్లులో స్పష్టత ఇచ్చే అవకాశముంది.

## తెలంగాణలో షేక్ హ్యాండ్స్ వద్దు: రేవంత్ సర్కార్ హైఅలర్ట్

**హైదరాబాద్-నవభూమి:**చైనాలో మెటాన్యుమోవైరస్ శరవేగంగా విస్తోరిస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా శరవేగంగా నిర్ణయాలను తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ప్రజారోగ్యం- కటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ బీ రవీందర్ నాయక్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క హెచ్ఎంపీవీ కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. దీని బారిన పడకుండా ఉండటానికి పలు సూచనలు ఇచ్చారు. హెచ్ఎంపీవీ మరో రెస్పిరేటరీ వైరస్ అని, చలికాలంలో జలుబు, ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ప్రత్యేకించి- చిన్నపిల్లలు, వయోధిక వృద్ధులు దీని బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొన్ని సూచనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని కోరారు. చేయాల్సినవి- చేయకూడని వివరాలను ఈ ప్రకటనలో పొందుపరిచారు. చేయాల్సినవి.. 1. దగ్గు, తుమ్ముతున్నప్పుడు నోటికి లేదా ముక్కుకు హ్యాండ్ కర్చీఫ్ లేదా టిష్యూ పేపర్‌ను అడ్డు పెట్టుకోవాలి. 2. సబ్బు లేదా అల్కహాల్‌తో కూడిన శానిటైజర్‌తో తరచూ చేతులను శుభ్రపర్చుకోవాలి. 3. గుంపుగా ఉండే ప్రదేశాలకు వెళ్లకూడదు. అలాంటి ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్లూతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి. 4. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాలకు వెళ్లకూడదు. గుంపులో తిరగకూడదు.

## వెలుగులోకి వైసీపీ భూ అక్రమాలు..

### మంత్రి గొట్టిపాటి స్ట్రాంగ్ వార్నింగ్

**అమరావతి-నవభూమి:** వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తులో భూ అక్రమాలు జరిగాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై మంత్రి గొట్టపాటి సంచలన ఆరోపణలు చేశారు. సంతమాగులూరు తహసీల్దార్ ఆఫీసులో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ప్రజల నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినతులు స్వీకరించారు. ఎక్కువగా భూసమస్యలనే మంత్రి దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలపై న్యాయం చేయాలంటూ మంత్రి గొట్టిపాటిని అర్జీదారులు కోరారు. స్థానిక అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష నిర్వహించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రజావేదికలో అందిన ప్రతి అర్జీని రికార్డ్ చేసి పరిష్కరించాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. వైసీపీ భూ ఆక్రమణలపై కఠినంగా ఉండాలని హెచ్చరించారు. వైసీపీ నేతల భూ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

### వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలైంది: మంత్రి

**ఏలూరు-నవభూమి:** వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. శనివారం ఆగిరిపల్లిలో మంత్రి పార్థసారథి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి మంత్రి పార్థసారథి అర్జీలు స్వీకరించి బాధితుల సమస్యలను విన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు.

### వైసీపీ నేతల లక్ష్యమిదే: నాదెండ్ల బ్రహ్మం చౌదరి

**అమరావతి-నవభూమి:** పేదవాళ్ల భూములు లాక్కోవడం, కబ్జా చేయడం వైసీపీ నేతల లక్ష్యమని తెలుగుదేశం పార్టీ యువనేత నాదెండ్ల బ్రహ్మం చౌదరి ఆరోపించారు. 22ఏ నిషేధ జాబితా నుంచి 1.88 కోట్ల ఎకరాల భూములకు విముక్తి లభించిందని అన్నారు. 22ఏ జాబితా నుంచి విముక్తి కల్పించడంతో పేదల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు భూమి మీద హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వైసీపీ పాలనలో 13లక్షల ఎకరాలు కబ్జా చేశారని ఆరోపించారు. విశాఖలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి అడ్డగోలుగా భూములను దోచేశారని ఆరోపణలు చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ ఆదివారం 05 । జనవరి । 2025



# ఎయిర్‌పోర్ట్ టాయిలెట్‌లో కాల్చుకుని.. సీఐఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్య




**న్యూఢిల్లీ-నవభూమి:** ఎయిర్‌పోర్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టాయిలెట్‌లోకి వెళ్లి సర్వీస్ గన్‌తో కాల్చుకుని మరణించాడు. ఆ జవాన్ ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడో అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుజరాత్‌లోని సూరత్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ సంఘటన జరిగింది. జైపూర్‌కు చెందిన 32 ఏళ్ల కిషన్ సింగ్ సీఐఎస్ఎఫ్ జవాన్‌గా అక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎయిర్‌పోర్ట్‌లోని టాయిలెట్‌కు వెళ్లాడు. సర్వీస్ రైఫిల్‌తో పొట్టలో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కాగా, గమనించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది, కిషన్ సింగ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ జవాన్ అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. కిషన్ సింగ్ ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడో అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ విషయం తెలిసి ఎయిర్‌పోర్ట్‌లోని సిబ్బంది భయాందోళన చెందారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్.. తర్వాత ఏం జరిగిందంటే?





**లక్నో: -నవభూమి:**మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్ ఒక బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైకర్ కారు బానెట్, బంపర్ మధ్య చిక్కుకున్నాడు. అయితే కారు నిలుపని డ్రైవర్ అతడ్ని కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. చివరకు మెడికల్ షాపు ముందున్న బైక్‌తోపాటు పేవ్‌మెంట్‌ను ఢీకొట్టాడు. ఇది చూసి స్థానికులు షాక్ అయ్యారు. మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్‌ను చితకబాదారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం రద్దీ రోడ్డులో ఒక కారు వేగంగా దూసుకొచ్చింది. ఒక బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తి కారు బానెట్‌పై పడ్డాడు. అయినప్పటికీ కారును డ్రైవర్ ఆపలేదు. బానెట్, బంపర్ మధ్య చిక్కుకున్న బైకర్‌ను కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. చివరకు ఒక మెడికల్ షాపు ముందున్న బైక్‌తోపాటు పేవ్‌మెంట్‌ను ఢీకొట్టడంతో ఆ కారు ఆగింది.కాగా, ఇది చూసి అక్కడున్న వారు షాక్ అయ్యారు. కొంత మంది తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్‌ను స్థానికులు కొట్టారు. కారు బానెట్‌పై పడిన బైకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది.మరోవైపు ఈ విషయం తెలిసిన పోలీసులు మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మెడికల్ షాపు వద్ద ఉన్న సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ఐఐటీ బాంబే కంప్యూటర్ ల్యాబ్‌కు నిప్పు.. కంప్యూటర్లు, ఏసీలు, ప్రొజెక్టర్ ధ్వంసం




**ముంబై-నవభూమి:** మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక ఐఐటీ బాంబేలోని కంప్యూటర్ ల్యాబ్‌కు గుర్తుతెలియని వ్యక్తి నిప్పుపెట్టాడు. ఈ నేపథ్యంలో అందులోని కంప్యూటర్లు, ఏసీలు, ప్రొజెక్టర్, కుర్చీలు కాలిపోయాయి. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. న్యూ ఇయర్ ఈవ్ అయిన డిసెంబర్ 31న ఈ సంఘటన జరిగింది. ఆ రోజు రాత్రి 7 గంటల సమయంలో పొవాయ్‌లోని ఐఐటీ బాంబేలో కంప్యూటర్ ల్యాబ్‌లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడు. కిరోసిన్ పోసి ల్యాబ్‌కు నిప్పంటించి పారిపోయాడు.కాగా, పొగలు, మంటలు గమనించిన సెక్యూరిటీ గార్డు వెంటనే ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు ఫోన్ చేశాడు. దీంతో ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రొఫెసర్ త్యాగరాజన్, కంప్యూటర్ ల్యాబ్ హెడ్ ఏహెచ్ ప్రదీప్ కూడా అక్కడకు చేరుకున్నారు. ల్యాబ్‌లోకి వెళ్లి పరిశీలించారు.మరోవైపు గుర్తు తెలియని వ్యక్తి ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ సంఘటనలో ఆరు కంప్యూటర్లు, రెండు ఏసీలు, ఒక ప్రొజెక్టర్, స్క్రీన్, నాలుగు కుర్చీలు కాలి ధ్వంసమైనట్లు గమనించారు. సుమారు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. దీని గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు.

# ఢిల్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయి.. ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించండి : కేజ్రీవాల్



**ముంబై - నవభూమి:** బీజేపీ కాంగ్రెస్ పార్టీలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రెండు పార్టీలూ కుమ్మక్కయ్యాయని వ్యాఖ్యానించారు.పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందంటూ ఆ రాష్ట్రానికి చెందిన కొందరు మహిళలు శనివారం కేజ్రీవాల్ నివాసం వద్ద ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ప్లకార్డులను ప్రదర్శిస్తూ కేజ్రీ, పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలపై స్పందించిన కేజ్రీవాల్.. కాంగ్రెస్, బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. రెండు పార్టీలూ కావాలనే కూటమిగా ఏర్పడి తమపై దాడి చేస్తున్నాయని ఆరోపించారు.'నా నివాసం వద్ద ఆందోళన చేసిన మహిళలు పంజాబ్ రాష్ట్రానికి చెందిన వారు కాదు. ఆ రెండు పార్టీలకూ (బీజేపీ, కాంగ్రెస్) చెందిన వారే. పంజాబ్ ప్రజల మద్దతు మాకే ఉంది. మాపై వారికి పూర్తి విశ్వాసం ఉంది. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌పై కలిసి పోటీ చేస్తున్నట్లు కాంగ్రెస్-బీజేపీ అధికారికంగా ప్రకటించాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా కాంగ్రెస్ పార్టీని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

# 144 ఏళ్లకోసారి నిర్వహించే మహా కుంభమేళా ప్రత్యేకత ఏంటి.. ప్రయాగ్‌రాజ్‌లోనే ఎందుకు?



**న్యూఢిల్లీ-నవభూమి:** మరికొన్ని రోజుల్లోనే మహా కుంభమేళా ప్రారంభం కానుంది. 45 రోజుల పాటు జరగనున్న ఈ మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి భక్తులు, నాగ సాధువులు సహా అనేక మంది విచ్చేస్తూ ఉంటారు. అయితే అసలు మహా కుంభమేళా అంటే ఏంటి. దాన్ని ఎందుకు 144 ఏళ్లకు ఒకసారి మాత్రమే నిర్వహిస్తారు. అసలు ఈ మహా కుంభమేళాను ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోనే నిర్వహిస్తారు. కుంభమేళా, అర్ధ కుంభమేళా, మహా కుంభమేళాల మధ్య తేడాలు ఏంటి. ఈసారి మహా కుంభమేళా విశేషాలు.. అక్కడ ఏమేం ఏర్పాటు చేస్తున్నారు అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13వ తేదీ నుంచి మహా కుంభమేళా ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 26వ తేదీన ఈ మహా కుంభమేళా ముగియనుండగా.. మొత్తం 45 రోజుల పాటు జరగనుంది. అయితే ఇప్పుడు జరగనున్న కుంభమేళా మహా కుంభమేళా అని.. ఇది 144 ఏళ్లకు ఒకసారి వస్తుందని చెబుతున్నారు. సాధారణంగా 6 ఏళ్లకు ఒకసారి అర్ధ కుంభమేళాను.. 12 ఏళ్లకు ఒకసారి కుంభమేళాను నిర్వహిస్తే.. ఈ మహా కుంభమేళాను మాత్రం 144 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తూ ఉంటారు. అయితే సాధారణంగా మన దేశంలో కుంభమేళాలను కేవలం 4 ప్రాంతాల్లో మాత్రమే నిర్వహిస్తూ ఉంటారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్.. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్.. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ.. మహారాష్ట్రలోని నాసిక్‌లో కుంభమేళాలు ఏర్పాటు చేస్తూ ఉంటారు. అయితే 144 ఏళ్లకు ఒకసారి జరిగే మహా కుంభమేళాను మాత్రం కేవలం ప్రయాగ్‌రాజ్‌లోనే నిర్వహిస్తారు.సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించినప్పుడు.. మహా కుంభమేళ ప్రారంభం అవుతుంది. హిందూ గ్రంథాల ప్రకారం.. భూమిపైన ఒక ఏడాది అయితే దేవతలకు ఒకరోజుతో సమానం. దీని ప్రకారం.. దేవతలు, రాక్షసుల మధ్య 12 ఏళ్ల పాటు యుద్ధం జరిగింది. అందుకే 12 ఏళ్లకు ఒకసారి పూర్ణ కుంభమేళా నిర్వహిస్తారు. దేవతలకు 12 సంవత్సరాలైతే.. భూమిపైన 144 సంవత్సరాలకు సమానం. అందుకే ఈ 144 ఏళ్లకు ఒకసారి మహా కుంభమేళాను నిర్వహిస్తారు. ఇప్పుడు నిర్వహించేది ఈ మహా కుంభమేళానే. ఇక ఈ మహా కుంభమేళాను కేవలం ప్రయాగ్‌రాజ్‌లోనే నిర్వహిస్తారు. ఎందుకంటే ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం కావడంతో ఈ మహా కుంభమేళాను అక్కడే నిర్వహిస్తారు.ప్రయాగ్‌రాజ్ కాకుండా హరిద్వార్‌లోని గంగానది, నాసిక్‌లోని గోదావరి నది, ఉజ్జయినీలోని శిప్రా నదిలో కుంభమేళా నిర్వహిస్తుంటారు. కుంభమేళా సమయంలో ఈ నదుల్లో పుణ్యస్నానం ఆచరిస్తే.. మోక్షం లభిస్తుందని హిందువులు విశ్వసిస్తారు. పురాణాల ప్రకారం అమృతం కోసం.. దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగర మథనం చేశారు. ఆ సమయంలో.. బయటికి వచ్చిన అమృతం కోసం.. దేవతలు, రాక్షసుల మధ్య 12 రోజుల పాటు భీకర యుద్ధం జరిగింది. అప్పుడు ఆ అమృత భాండం నుంచి కొన్ని చుక్కలు భూమిపై పడ్డాయని నమ్ముతారు. ఆ పడిన ప్రాంతాల్లో ప్రయాగ్‌రాజ్, ఉజ్జయినీ, హరిద్వార్, నాసిక్ అని విశ్వసించి.. ఆ ప్రాంతాల్లోనే కుంభమేళా నిర్వహిస్తారు.

**రాచస్నానాల తేదీలు**

మహా కుంభమేళా సమయంలో.. భక్తులు ఆచరించే రాచ స్నానాలకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. 2025 మహా కుంభమేళాలో రాచస్నానాలు ఆచరించేందుకు కొన్ని ముఖ్యమైన తేదీలను ప్రకటించారు. జనవరి 13వ తేదీన పుష్య పౌర్ణమి రోజున మొదటి రాచ స్నానం ఆచరిస్తారు. జనవరి 14న మకర సంక్రాంతి రోజున రెండో రాచ స్నానం చేస్తారు. ఇక మూడో రాచ స్నానం జనవరి 29వ తేదీన.. మౌని అమావాస్య రోజున ఆచరిస్తారు. నాలుగో రాచ స్నానం ఫిబ్రవరి 3వ తేదీన వసంత పంచమి రోజున నిర్వహిస్తారు. ఐదో రాచ స్నానం ఫిబ్రవరి 12వ తేదీన మాఘ పూర్ణిమ రోజున ఆచరిస్తారు. ఇక చివరిదైన ఆరో రాచ స్నానం మహా కుంభమేళా ముగిసే రోజు అంటే ఫిబ్రవరి 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన చేస్తారు. మహా కుంభమేళా సమయంలో పవిత్ర నదుల్లో స్నానం చేస్తే.. సమస్త పాపాలు నశించి, మోక్షం లభిస్తుందని హిందువులు బలంగా విశ్వసిస్తారు.భారతదేశ చరిత్రలో కుంభమేళాకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఇక ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించనున్న ఈ మహా కుంభమేళా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ భక్తులకు, సాధువులకు ఒక పెద్ద ఆధ్యాత్మిక సదస్సుగా నిలుస్తుంది. ఈ మహా కుంభమేళాకు 850 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతుంటారు. ఈ మహా కుంభమేళాను ఆదిశంకరాచార్యులు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

**కుంభమేళాలు తేదీలు ఎలా నిర్ణయిస్తారు?**

ఖగోళ శాస్త్రం ప్రకారం కుంభం అనేది ఒక రాశిని సూచిస్తుంది. ఈ రాశిలోనే కుంభమేళాను నిర్వహిస్తారు. సూర్యుడు, బృహస్పతి సంచారం ఆధారంగా ఈ కుంభమేళా తేదీలు నిర్ణయిస్తారు. సూర్యుడు, బృహస్పతి.. సింహరాశిలో ఉన్నప్పుడు.. నాసిక్ త్రయంబకేశ్వర్‌లో కుంభమేళా నిర్వహిస్తారు. ఇక సూర్యుడు మేష రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్‌లో నిర్వహిస్తారు. అలాగే గురుడు వృషభ రాశిలో.. సూర్యుడు మకర రాశిలో ఉన్నప్పుడు.. ప్రయాగ్‌రాజ్‌లో కుంభ మేళా నిర్వహిస్తారు. బృహస్పతి, సూర్యుడు వృశ్చిక రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయినిలో కుంభమేళా ఏర్పాటు చేస్తారు.

**కుంభమేళా రకాలు**

కుంభమేళాలు మొత్తం 3 రకాలు ఉంటాయి. అర్ధ కుంభమేళా, పూర్ణ కుంభమేళా, మహా కుంభమేళా. ప్రతీ 6 ఏళ్లకు ఒకసారి నిర్వహించేది అర్ధ కుంభమేళా. చివరిసారిగా అర్ధ కుంభమేళాను 2019లో నిర్వహించారు. ఇక ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించేదాన్ని పూర్ణ కుంభమేళాగా పిలుస్తారు. చివరిసారిగా పూర్ణ కుంభమేళాను 2013లో ఏర్పాటు చేశారు. ఇక 12 పూర్ణ కుంభమేళాలు పూర్తయిన తర్వాత.. 144 ఏళ్లకు ఒకసారి వచ్చేదే మహా కుంభమేళా. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లో జరిగేది ఈ 144 ఏళ్లకరు ఒకసారి వచ్చే మహా కుంభమేళా కావడం గమనార్హం. మహా కుంభమేళా చూసే అదృష్టం.. ప్రతి 3 తరాల్లో ఒక తరం వారికి మాత్రమే దక్కుతుందని చెబుతారు.

**మహా కుంభమేళాలో ఇంకేం ఉంటాయి?**

మహా కుంభమేళాలో పవిత్ర స్నానాలే కాకుండా.. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుపుతారు. కుంభమేళా సమయంలో నదుల ఒడ్డున భక్తులు వివిధ పూజలు, ఆచారాలు, అగ్ని వేడుకలు జరుపుకుంటారు. పవిత్ర నదుల్ని గౌరవించేందుకు.. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో హారతి ఇస్తారు. భక్తి గీతాలను ఆలపిస్తారు. అంతేకాకుండా.. మతపరమైన ఆచారాలతో పాటు, సంప్రదాయ సంగీతం, నృత్యాలు, నాటకాలు సహా వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. స్థానిక హస్తకళలు, ఆహారం, ధార్మిక సామాగ్రిని విక్రయించే స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. భక్తి గీతాలు, ఆధ్యాత్మిక సాధనలో నిమగ్నమైన భక్తులతో కుంభమేళా జరిగే ప్రాంతం మొత్తం ఉత్సాహభరితంగా ఉంటుంది.ఇక 2013లో జరిగిన కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు, సాధువులు కలిసి మొత్తం 20 కోట్ల మంది వచ్చారని అంచనా. అయితే ఇప్పుడు 144 ఏళ్ల తర్వాత జరుగుతున్న మహా కుంభమేళాకు దాదాపు 45 కోట్ల మంది హాజరవుతారని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఇప్పుడు ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రూ.2100 కోట్ల స్పెషల్ గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఇందులో భాగంగా మొదట రూ.1050 కోట్ల నిధులను విడుదల చేశారు.

**ఈసారి మహా కుంభమేళా విశేషాలు**

ప్రయాగ్‌రాజ్‌లో జరిగే ఈ మహా కుంభమేళాను.. స్వచ్ఛంగా, ఆరోగ్యంగా, సురక్షితంగా.. డిజిటల్ కార్యక్రమంగా మార్చేందుకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అన్ని ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ కుంభమేళాను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లో దాదాపు 3 లక్షల మొక్కలు నాటారు. కుంభమేళా పూర్తి అయిన తర్వాత కూడా ఆ మొక్కలను పరిరక్షిస్తామని యూపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాగ్‌రాజ్‌లో పర్యటించి.. రూ.5,500 కోట్ల విలువైన 167 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

మహా కుంభమేళాకు వచ్చే భక్తులకు ఆరోగ్య సేవలు అందించేందుకు అక్కడ అనేక ఆస్పత్రుల ఏర్పాటు చేశారు. 100 పడకల ఆస్పత్రి ఒకటి, రెండు 20 పడకల ఆస్పత్రులు.. 8 పడకలతో చిన్న చిన్న ఆస్పత్రులను ఏర్పాటు చేశారు. ఇండియన్ ఆర్మీ.. 10 పడకలతో ఒక ఐసీయూను కూడా ఏర్పాటు చేసింది. యాత్రికులకు వైద్యం అందించేందుకు దాదాపు 300 మంది డాక్టర్లు, వైద్య నిపుణులు, 90 మంది ఆయుర్వేద, యునానీ నిపుణులు, 200 మంది నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఇక ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద.. 35 శాశ్వత ఘాట్‌లతో పాటు కొత్తగా మరో 8 ఘాట్‌లను నిర్మిస్తున్నారు. మహా కుంభమేళాలో తొలిసారి భక్తుల కోసం తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సహా దేశంలోని 11 భాషల్లో ఏఐ చాట్‌బాట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మహాకుంభమేళా విశేషాలతో పాటు చరిత్ర, పూజలు, ప్రయాణం, విడిది సౌకర్యాల వివరాలను ఉచితంగా తెలుసుకునేందుకు ఈ ఏఐ చాట్‌బాట్‌ను ఏర్పాటు చేశారు.సన్యాసులు, సాధువులకు ప్రత్యేక ఏర్పాట్లు ఇక ఈ మహా కుంభమేళాలో లక్షలాది మంది సాధువులు, సన్యాసులు హాజరు కానున్నారు. ఇప్పటికే 20 వేలకు పైగా సన్యాసులు, సంస్థలకు స్థలాలను ప్రయాగ్‌రాజ్‌లో కేటాయించారు. 13 అఖాడాలు, దండివాడ, ఆచార్య వాడతో పాటు ప్రయాగవాల్ సభ, ఖాక్ చౌక్‌లకు స్థలాలను యూపీ సర్కార్ ఇచ్చింది.

**భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

ఈ మహా కుంభమేళా కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తొలిసారి డోమ్ సిటీని ఏర్పాటు చేసింది. అరైల్ ప్రాంతంలో 3.25 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ డోమ్ సిటీని రూ.51 కోట్లతో చేపట్టారు. ఈ డోమ్ కాటేజీలో 360 డిగ్రీల్లో అన్ని వైపుల నుంచి చూసేందుకు వీలుంటుంది. 32 అడుగుల పరిమాణంతో మొత్తం 44 డోమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. బుల్లెట్ ప్రూఫ్, ఫైర్ ప్రూఫ్‌గా ఉండేలా వీటిని పాలికార్బొనేట్ షీట్లతో నిర్మిస్తున్నారు. 15 నుంచి 18 అడుగుల ఎత్తులో ఉన్న ఈ డోమ్స్.. భక్తులకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు రక్షణగానూ ఉంటాయి. ఈ డోమ్ సిటీలో అన్ని లగ్జరీ సౌకర్యాలతో 176 కాటేజీలను కూడా నిర్మిస్తున్నారు. ఇక మహా కుంభమేళాలో ఒక్క డోమ్ కాటేజీ రేటు రూ.1.10 లక్షలుగా నిర్ణయించారు. సాధారణ రోజుల్లో రూ.81 వేలు ఉంటుంది.

ఇక ఈసారి మహా కుంభమేళాలో 5.5 కోట్ల రుద్రాక్షలతో 12 జ్యోతిర్లింగాలను సిద్ధం చేస్తున్నారు. అంతేకాకుండా 11 వేల త్రిశూలాలను కూడా ఉపయోగిస్తున్నారు. మొదటి స్నానానికి ముందు మొత్తం 12 జ్యోతిర్లింగాలను సిద్ధం చేశారు. అమేథీలోని మహాకుంభ సెక్టార్ 6 లోని సంత్ పరమహంస ఆశ్రమం శిబిరంలో ఈ ప్రత్యేకమైన జ్యోతిర్లింగాన్ని నిర్మిస్తున్నారు. ఈ శిబిరం నాగవాసుకి ఆలయం ముందు ఏర్పాటు చేశారు. దీనికోసం నేపాల్, మలేషియా నుంచి రుద్రాక్షలను దిగుమతి చేశారు. ప్రతీ జ్యోతిర్లింగం 9 అడుగుల వెడల్పు.. 11 అడుగుల ఎత్తు ఉంటుంది. ఇందులో ఉపయోగించిన 11 వేల త్రిశూలాలకు తెలుపు, నలుపు, పసుపు, ఎరుపు రంగులు వేస్తారు. జనవరి 12వ తేదీ నాటికి 12 జ్యోతిర్లింగాల నిర్మాణ పనులు పూర్తి అవుతాయని.. జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు భక్తులను దర్శనానికి, పూజలకు అనుమతించనున్నట్లు అధికారులు తెలిపారు.

# క్లాస్‌మేట్‌తో గొడవ.. స్కూల్ బయట విద్యార్థిపై కత్తితో దాడి, మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక విద్యార్థి, అతడి క్లాస్‌మేట్ మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో స్కూల్ ముగిసిన తర్వాత క్లాస్‌మేట్ మరికొందరితో కలిసి కత్తితో అతడిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థి మరణించాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం షకర్‌పూర్ ప్రాంతంలోని రాజకీయ సర్వోదయ బాల విద్యాలయంలో క్లాసులు ముగిసిన తర్వాత కొందరు విద్యార్థులకు ఎక్స్‌ట్రా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా 14 ఏళ్ల ఇషు గుప్తా మరో విద్యార్థి కృష్ణతో తీవ్ర వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో క్లాస్ ముగిసిన తర్వాత కృష్ణ మరో ముగ్గురు స్టూడెంట్స్‌తో కలిసి స్కూల్ బయట ఇషు గుప్తాపై దాడి చేశాడు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి కత్తితో అతడ్ని పొడిచాడు.కాగా, తీవ్రంగా కత్తి గాయమైన ఇషు గుప్తాకు స్కూల్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ స్టూడెంట్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.మరోవైపు ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్యకు గురైన విద్యార్థి ఇషు గుప్తా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఐదుగురు మైనర్ బాలురు, 19, 31 ఏళ్ల వయస్సున్న మరో ఇద్దరు వ్యక్తులతో సహా ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డేటింగ్ యాప్‌తో 700 మంది మహిళల్ని మోసం చేసిన ఢిల్లీ వ్యక్తి



**న్యూఢిల్లీ-నవభూమి:**యూపీలోని నోయిడాకు చెందిన ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న తుషార్ సింగ్ బిస్త్ అనే 23 వ్యక్తి డేటింగ్ యాప్( ద్వారా సుమారు 700 మంది మహిళలను మోసం చేశాడు. మోడల్ అని చెప్పుకుంటూ అతను ఆ మోసాలకు తెగించాడు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తి చేసిన అతను.. గత మూడేళ్ల నుంచి ఓ కంపెనీలో టెక్నికల్ రిక్రూటర్‌గా చేస్తున్నాడు. అతని తండ్రి ఓ డ్రైవర్. తల్లి ఇంటికే పరిమితం. సోదరి గురుగ్రామ్‌లో పనిచేస్తుంది. తుషార్‌కు ఉద్యోగం ఉన్నా.. డబ్బు, మహిళల మీద మోజుతో సైబర్ నేరాలకు పాల్పడ్డాడు.ఓ యాప్ ద్వారా విపిన్ మొబైల్ నెంబర్ తీసుకున్న అతను, పాపులర్ డేటింగ్ యాప్‌ల్లో ఫేక్ ప్రొఫైల్‌ను క్రియేట్ చేశాడు. బంబ్లీ, స్నాప్‌చాట్ లాంటి మీడియాల్లో అతను ఆ ప్రొఫైల్‌ను పెట్టాడు. ఇండియాకు విజిట్ చేస్తున్న అమెరికా ఫ్రీలాన్స్ మోడల్‌గా అతను ఐడీ క్రియేట్ చేశాడు. ఓ బ్రెజిల్ మోడల్ నుంచి చోరీ చేసిన ఫోటోలు, స్టోరీలతో అతను ఫేక్ ఐడీ సృష్టించాడు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య మహిళల్ని అతను టార్గెట్ చేసేవాడు. తొలుత ఆ అమ్మాయిలను స్నేహితులుగా మార్చుకుని .. మోసాలకు పాల్పడ్డాడు.అమ్మాయిల నుంచి నమ్మకం గెలిచిన తర్వాత వారి ఫోన్ నెంబర్లు తీసుకునేవాడు. ఆ తర్వాత ఫ్రెండ్‌షిప్ పేరుతో రహస్య ఫోటోలు, వీడియోలను అడిగేవాడు. ఆ తర్వాత ఆ విజువల్స్‌ను అతను తన ఫోన్‌లో సేవ్ చేశాడు. తొలుత వ్యక్తిగత సంతోషం కోసం చేసినా.. ఆ తర్వాత అతను బెదిరింపులకు పాల్పడ్డాడు. తన వద్ద ఉన్న వీడియోలను చూపించి డబ్బు కోసం బెదిరించేవాడు. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఇవ్వనని బెదిరిస్తే, అప్పుడు అతను ఫోటోలు, వీడియోలను అప్‌లోడ్ చేస్తానని బెదిరించేవాడు.బంబ్లీ డేటింగ్ యాప్‌లో 500 మంది , స్నాప్‌చాట్‌లో 200 మంది అమ్మాయిలతో చాటింగ్ చేసేవాడు. అయితే ఢిల్లీ వర్సిటీ సెకండ్ ఇయర్ అమ్మాయిని సైబర్ మోసం చేసిన కేసులో అతను చిక్కాడు. బంబ్లీలో అతను అమెరికా మోడల్‌గా పరిచయం చేసుకున్నాడు. ఫ్రెండ్‌షిప్ చేసి ఆ తర్వాత వాట్సాప్, స్నాప్‌చాట్‌లో ప్రైవేట్ చాటింగ్ చేశాడు. బాధితురాలు వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు షేర్ చేసింది. వ్యక్తిగతంగా కలుసుకునేందుకు అతను ఇష్టపడలేదు. ఆ తర్వాత ప్రైవేటు వీడియోను పంపి డబ్బుల కోసం బెదిరించాడు. ఒకవేళ డబ్బులు ఇవ్వకుంటే లీక్ చేస్తానని హెచ్చరించాడు. బెదిరింపులు ఎక్కువ కావడంతో ఆమె తన పేరెంట్స్‌కు చెప్పింది. దీంతో వాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఏసీపీ అరవింద్ యాదవ్ పర్యవేక్షణలో సైబర్ పోలీసులు ఓ బృందంగా మారి.. ఇంటెలిజెన్స్ ద్వారా తుషార్ కార్యకలాపాలను గుర్తించాడు. షాకార్‌పుర్‌లో రెయిడ్ చేసి అతన్ని అరెస్టు చేశారు. పోలీసులు తమ ఆపరేషన్‌లో ఓ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాంట్లో విపిన్‌తో లింకున్న డేటాను సేకరించారు. 13 క్రెడిట్ కార్డులు కూడా ఉన్నాయి. ఢిల్లీకి చెందిన 60 మంది మహిళలతో జరిపిన వాట్సాప్ సంభాషణలను కూడా రికవరీ చేశారు. తుషార్‌కు చెందిన రెండు అకౌంట్లను సీజ్ చేశారు. ఒకదాంట్లో పేమెంట్స్ ఉన్నాయి.

# నిరాహార దీక్షలో ప్రశాంత్ కిషోర్.. కోట్ల ఖరీదైన ఆయన లగ్జరీ వ్యాన్ ఫొటో వైరల్



**న్యూఢిల్లీ-నవభూమి:** రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ నిరాహార దీక్ష చేస్తున్నారు. బీహార్ పబ్లిక్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థులకు సంఘీభావంగా ఈ దీక్ష చేపట్టారు. జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడైన ప్రశాంత్ కిషోర్ పాట్నాలోని గాంధీ మైదాన్‌లో గాంధీ విగ్రహం వద్ద జనవరి 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. పేపర్ లీక్ అయ్యిందన్న ఆరోపణల నేపథ్యంలో అభ్యర్థుల నిరసనకు ఈ మేరకు మద్దతు తెలిపారు.కాగా, ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఖరీదైన లగ్జరీ వ్యానిటీ వ్యాన్ నిరసన ప్రాంతం సమీపంలో పార్క్ చేసి ఉంది. కోట్ల విలువైన ఈ వాహనంలో ఇంటికి సంబంధించిన కిచెన్, బెడ్ రూమ్, ఏసీతో సహా అన్ని సౌకర్యాలున్నాయి. ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిషోర్‌కు చెందిన లగ్జరీ వాహనం నిరసన ప్రాంతం వద్ద ఉండటంపై అనుమానాలతోపాటు విమర్శలు వెల్లువెత్తాయి.మరోవైపు జన్ సూరజ్ పార్టీ అధికార ప్రతినిధి వివేక్ ఈ వివాదంపై స్పందించారు. 'ఇది సమస్య కాదు. అభ్యర్థుల భవిష్యత్తు సమస్య. నిరాహార దీక్ష చేస్తున్న ప్రశాంత్ కిషోర్ పరువు తీసేందుకు రాజకీయ ప్రత్యర్థులు వ్యానిటీ వ్యాన్‌ను ఉపయోగించుకుంటున్నారు. విద్యార్థులకు న్యాయం కోసం వారి డిమాండ్లపై దృష్టి సారించాలి' అని అన్నారు.

## లోయలో పడిన ఆర్మీ వాహనం.. నలుగురు జవాన్లు మృతి

**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్ము కశ్మీర్ లో ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మీ వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు గాయపడ్డట్లు అధికారులు తెలిపారు.బందిపూర్ జిల్లాలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని సదర్ కూట్ పాయెన్ సమీపంలోని ఓ వంపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. అప్రత్తమైన భద్రతా బలగాలు, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ జవాన్లను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.కశ్మీర్ లోయలో ఇలా ఆర్మీ వాహనాలు ప్రమాదానికి గురి కావడం ఇదేమీ తొలిసారి కాదు. గతేడాది డిసెంబర్ 24వ తేదీన పూంచ్ జిల్లాలో ఆర్మీ వాహనం అదుపుతప్పి 350 అడుగుల లోయలోకి పడిపోయింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
ఆదివారం
05 । జనవరి । 2025



## ఢిల్లీ ఎన్నికలకు బీజేపీ తొలిజాబితా రిలీజ్.. కేజ్రీవాల్‌పై మాజీ ఎంపీ పోటీ



ముంబై - నవభూమి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితాను విడుదల చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే 29 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ మేరకు ఫస్ట్ లిస్ట్‌ను శనివారం రిలీజ్ చేసింది.న్యూ ఢిల్లీలో ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు పోటీగా మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ ను బరిలోకి దింపింది. ఇక ఇటీవలే ఆప్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఢిల్లీ మాజీ మంత్రి కైలాశ్ గెహ్లాట్ కు తొలి జాబితాలో చోటు దక్కింది. ఆయన్ని బిజ్వాసన్ స్థానం నుంచి పోటీకి దింపింది. కరోల్‌బాగ్ నుంచి దుశ్యంత్ చౌటాలా, రాజౌరీ గార్డెన్ నుంచి మాజిందర్ సింగ్, గాంధీ నగర్ నుంచి అరవిందర్ సింగ్ లవ్లీ పోటీ చేయబోతున్నారు. పూర్తి లిస్ట్ ఈ కింది ట్వీట్‌లో ఉంది.

## మన రాజ్యాంగంలో భారతీయత...!

భారత రాజ్యాంగంలోని భారతీయత ఏమిటి? భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభలలో మన సంవిధానంపై జరిగిన చర్చ ఆ ఆసక్తికరమైన ప్రశ్నను పూర్తిగా ఉపేక్షించింది. పాలక పక్షానికే కాకుండా ప్రతిపక్షానికీ అది ఒక ఇబ్బందికరమైన ప్రశ్నే. లోక్‌సభ ఎన్నికలలో సొంత మెజారిటీని సాధించుకోలేకపోయిన నేపథ్యంలో ప్రస్తుత దశలో ఆ ప్రశ్నను లేవనెత్తడం అంత వివేకవంతమైన పనికాదని పాలక పక్షం తప్పక భావించి ఉంటుంది. ఈ కారణంగా భారతీయ జనతా పార్టీ తన భావజాల పరమైన ఉత్సాహాన్ని నియంత్రించుకుని రాజ్యాంగాన్ని ప్రశ్నించే పనిని పార్లమెంటు వెలుపల తన మేధో మద్దతుదారులు, సహ ప్రయాణీకులకు వదిలివేసిందిబీ పార్లమెంటులో ప్రధానమంత్రి భారత రాజ్యాంగ పరిరక్షణకు తన నిబద్ధతను నొక్కి చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తిని పాటించడంలో తమ ప్రభుత్వం అద్వితీయంగా వ్యవహరిస్తోందని ఆయన వివరించిన తీరు ఒక నిరర్థక హాస్య సన్నివేశంగా పరిగణించాలి. ప్రతిపక్షాలకు ఆ ప్రశ్న సైద్ధాంతికంగా ఒక జటిల సమస్యగా, సాంస్కృతికంగా చమత్కారపూరితమైనదిగా అనిపించి ఉండవచ్చు. కనుకనే అవి ఆ ప్రశ్నను నిర్లక్ష్యం చేశాయి. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో సావర్కార్ గురించి ప్రస్తావించినప్పుడు ఆ ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు ఉద్యుక్తుడు అయినట్టు కనిపించాడు కానీ ఆయన దానిపై మనసు పెట్టలేదు. అలా ప్రస్తావించి ఇలా వదిలివేశారు. ఆ చర్చ యథావిధిగా రాజకీయ వాదోపవాదాలుగా, పరస్పరం బురదజల్లుకోవడంగా దిగజారింది.

పాలక ప్రతిపక్షాలు పట్టించుకోనంత మాత్రాన ఆ ప్రశ్న ప్రాధాన్యం కోల్పోతుందా? రాజ్యాంగం పట్ల భారతీయ జనతా పార్టీ కొత్త శ్రద్ధాసక్తులు, ప్రేమానురాగాలను చూసి మనం మోసపోకూడదు సుమా! మన రాజ్యాంగబద్ధ గణతంత్ర రాజ్యంపై కనిపించీ కనిపించకుండా జరుగుతున్న ఒక దాడి మధ్యలో మనం ఉన్నాం. మరి ఈ దాడికి రాజ్యాంగం న్యాయబద్ధతను ప్రశ్నించడం ఒక అనివార్యత. ఆ సంవిధాన భారతీయతను ప్రశ్నించడమనేది రాజ్యాంగంపై దాడి చేస్తున్న వారి బలమైన ప్రధాన భావజాల అస్త్రం. సందేహం లేదు, అదొక ఆలోచనాత్మకమైన ప్రశ్న. నిబద్ధతతో దానిని తర్కించవలసి ఉంది. మన రాజ్యాంగాన్ని చాలవరకు మన వలసపాలకుల భాషలో ఆలోచించి రాయడం జరిగింది. ఆధునిక పాశ్చాత్య రాజ్యాంగవాద ఆలోచనాస్రవంతి నుంచి గ్రహించిన అంశాలతో భారత రాజ్యాంగ రచనా నిర్మాణం జరిగింది. ఆ రాజ్యాంగం 'భారతీయ సంప్రదాయానికి 'విరుద్ధమైనది'., 'విదేశీయమైనది' అని రాజ్యాంగ సభలోనే పలువురు సభ్యులు ఆక్షేపించారు. దాని 'భారతీయత' గురించి పలు ప్రశ్నలు అప్పుడే లేవనెత్తడం జరిగిందనే విషయాన్ని మనం మరువ కూడదు.ఆధునికతావాద, విశ్వజనీన దృక్కోణం ఈ ప్రశ్నకు సబబైన సమాధానం కాబోదనే వాస్తవాన్ని కూడా అంగీకరిద్దాం. 'ఆధునిక భారత రాజ్యాంగం విధిగా భారతీయమైనదిగా ఎందుకు ఉండాలి?' అని ప్రశ్నించవచ్చు. అయితే ఇది ఆ ప్రశ్నకు మాటకు మాటమాత్రమే అవుతుంది. ఇటువంటి అనుచిత ప్రతినిందతో ప్రయోజనముండదు. ప్రతి రాజ్యాంగమూ తన సొంత సందర్భంలో సాంస్కృతిక వాస్తవికత అనే పరీక్షలో నిలబడాలి. ఈ ఆధునికతా ప్రతిస్పందన కూడా ప్రతికూలంగా పరిణమించవచ్చునే వాస్తవాన్ని విస్మరించకూడదు. ఆధునిక రాజ్యాంగ నిర్మాతలు గతం నుంచి పూర్తిగా వేరుపడడానికి తీవ్ర ఆసక్తి చూపారు. ఈ కారణంగానే అది భారతీయత నుంచి వేరుపడిందని, మన నాగరికతా విలువలకు పరాయిదిగా ఉన్నదనే భావన చాలా మందిలో ఏర్పడేందుకు దారితీసింది.అసలు భారతీయత అంటే ఏమి కాదో మొదట చూద్దాం. భారత రాజ్యాంగం భారతదేశ గతం నుంచి ప్రభవించిందికాదు. రాజ్యాంగ నిర్మాతలు దానిని అలా ఉద్దేశించలేదు. 'విదేశీ'మైనది ఏదీ అంటకూడదు, సోకకూడదు అని కూడా వారు భావించలేదు దానితో ప్రభవించింది కానేకాదు. ఒక లిఖిత రాజ్యంగం అవసరమైన ఆధునిక రాజ్య వ్యవస్థ సందర్భాన్ని వారు విస్మరించలేదు. ఈ రీత్యా భారత రాజ్యాంగం అనేది ఒక విరోధాభాస. అనూ చానంగా వస్తున్న మన జీవనస్రవంతికి సంబంధించిన ఏదో ఒక లక్షణం ఉన్నంత మాత్రాన అది భారతీయమైనదని చెప్పడానికి వీలులేదు. రాజ్యాంగ లిఖిత ప్రతిపై భారతీయ ఇతిహాసాలు, పురాణ గాథలను చిత్రించిన బొమ్మలు దాన్ని భారతీయమైనది చేయలేదు. భారత శిక్షా స్మృతికి భారతీయ న్యాయసంహితగా పునః నామకరణం దాన్ని భారతీయమైనది చేయలేదు.భారత రాజ్యాంగంలో భారతీయతకు అన్వేషణ రెండు రూపాలను తీసుకుంటుది. ఒకటి మరో దానికంటే మరింత ఎక్కువగా మౌలికమైనది. అభ్యుదయ ఆకాంక్షాభరిత అవతారంలో ప్రామాణికతకు ఒక కొత్త నవీనత అవసరం.భారతీయ తరహా రాజ్యాంగం అంటే పాశ్చాత్య దేశాల నుంచి స్వీకరించిన రాజనీతి చింతనను పూర్తిగా వదిలివేయవలసి ఉంటుంది. మన నాగరికతా వారసత్వం ప్రాతిపదికన రాజ్యాంగ సంస్థలను పూర్తిగా సరికొత్త రీతుల్లో నిర్మించుకోవలసి ఉంటుంది. గాంధీ తన 'హింద్ స్వరాజ్'లో కోరింది ఇదే. కనుకనే శ్రీమన్ నారాయణ్ లాంటి గాంధేయవాదులు భారత రాజ్యాంగం భారతీయ మేధాశక్తికి న్యాయం చేయలేదని వాపోవడానికి కారణమయింది. గత శతాబ్దిలో అమలులోకివచ్చిన ఏ కొత్త రాజ్యాంగమూ (ఇరాన్, బొలీవియాని మినహాయిస్తే) ఈ ప్రామాణికత పరీక్షకు నిలబడలేవు. ప్రత్యామ్నాయ రాజ్యాంగం కోసం అన్వేషణ సహేతుకమైన ఆకాంక్షే కావచ్చుగానీ, అటువంటి రాజ్యాంగానికి సుసంబంధమైన ముసాయిదా అనేది ఏదీ ఎవరి వద్దా లేదు. ఈ దృష్ట్యా సంవిధానపరమైన భారతీయత అనేది ఇంకా రూపుదిద్దుకుంటున్న గుణమే.మరింత సాధ్యమైన వివరణ రచనాపరమైన మౌలికత. స్వీకరించి అంశాల పునర్ రూపకల్పనలో నవ్యదనం. భారత రాజ్యాంగ భారతీయతను ఈ దృష్ట్యా వివిధ గీటురాళ్లతో పరీక్షించవచ్చు: పాశ్చాత్య రాజ్యాంగ నిర్మాణ సంప్రదాయం నుంచి గ్రహించిన అనేక అంశాలను భారతీయ సందర్భానికి అనుగుణంగా ఎలా పునర్ సర్దుబాటు చేసి మార్చివేశారు? ఈ కొత్త ఏర్పాటు భారత నాగరికతా ప్రస్థాన ప్రశస్తతను ప్రతిబింబిస్తున్నదా? రాజ్యాంగానికి ప్రాతిపదికగా ఉన్న తాత్త్వికత మన మేధో సంప్రదాయాలతో ఏకీభవించేదిగా ఉన్నదా? ఈ రాజ్యాంగం పనిచేస్తున్న తీరు ఈ భావనలను ధ్రువీకరిస్తున్నదా?

ఈ సమంజసమైన, ఉపయుక్తమైన ప్రశ్నలను అడిగినప్పుడు భారత రాజ్యాంగంలోని భారతీయతను మనం చూడగలుగుతాము. మూడు సంవత్సరాల కంటే తక్కువ వ్యవధిలోనే రాజ్యాంగాన్ని రాసి ఉండవచ్చు. అయితే ఒక శతాబ్దికి పైగా సాగుతున్న ఆలోచనల ద్వారా అది రూపుదిద్దుకున్నది. సారాంశంలో రాజ్యాంగం 'ఆధునిక భారతీయ రాజకీయ చింతన' నుంచి రూపుదిద్దుకున్న మౌలిక శాసనం. ఆ సమున్నత ఆలోచనా ప్రవంతి ఏ ఒక్క వాదం లేదా దృక్పథానికి పరిమితమైనది కానందున, భారత్ గురించిన విభిన్న పోటీదాయక దార్శనికతల మధ్య సమతుల్యతను మన రాజ్యాంగం ప్రతిబింబించింది.

# కార్మికుల పెన్షన్ కార్పొరేట్ల పరం!

ఇరవై ఐదు సంవత్సరాల పాటు ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేసి నెలకు ఏభై వేల రూపాయలకు పైగా జీతం పొందిన ఒక కార్మికుడు పదవీ విరమణ తర్వాత కేవలం రెండువేల రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందడం నమ్మశక్యం కాని విషయం. కానీ ఇది వాస్తవం. ఇపిఎస్%-%95 పేరుతో దేశంలో ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం కార్మికుల పొదుపు సొమ్మును హరించి కార్పొరేట్లకు ధారాదత్తం చేసే విధాన ఫలితం.

మన దేశంలో కార్మికులకు ఉన్న హక్కులను ఒకటొకటిగా హరిస్తున్న వేళ విచిత్రంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులు కోరకుండానే వారికి ఒక పెన్షన్ పథకాన్ని చాలా ఉదారంగా ప్రవేశపెట్టింది. కార్మికులు వద్దన్నా వినలేదు. కనీసం ఇందులో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఇమ్మన్నా ఇవ్వలేదు. కార్మికులపై ఎందుకింత ప్రేమ అని కొద్దిగా పరిశీలిస్తే 1991 నుంచి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాలలో భాగమే ఈ పెన్షన్ పథకం అని సులువుగానే అర్థమవుతుంది.

1995లో నాటి పివి నరసింహారావు ప్రభుత్వం అప్పటివరకు అమలులో ఉన్న ఉద్యోగుల భవిష్య నిధి (పిఎఫ్) చట్టం 1952ను సవరించి, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ ఇపిఎస్-95 పేరున ఒక కొత్త చట్టాన్ని చేసింది. ఈ పెన్షన్ చట్టం ప్రకారం అప్పటివరకు కార్మికుల భవిష్యనిధిలో ఉన్న యాజమాన్యం వాటా భాగం 8.33శాతం, ప్రభుత్వ వాటా 1.16 శాతం ఈ పెన్షన్ నిధికి మళ్లించబడుతుంది. ఈ నిధి నుండి ప్రతినెల పిఎఫ్ డిపార్టుమెంట్ పెన్షన్లు చెల్లిస్తుంది.

ఈ పథకం వల్ల కార్మికులకు వచ్చే సంక్షేమం కంటే కార్మికులు పొదుపు సొమ్మును కోల్పోవడమే అధికంగా ఉంటుందని ఆనాడే కొన్ని కార్మిక సంఘాలు ముఖ్యంగా సిఐటియు వంటి కేంద్ర సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కొన్ని యూనియన్లు దీనిపై దేశంలోని వివిధ రాష్ట్ర హైకోర్టులలో కేసులు కూడా వేశాయి. ఈ కేసులపై కొన్ని హైకోర్టులు ఈ పథకం అమలుపై స్టే ఉత్తర్వులు కూడా ఇచ్చాయి. ఈ కేసులన్నీ చివరకు సుప్రీంకోర్టుకు చేరాయి. దీనిని తరచూ సమీక్షిస్తూ ఉంటామని, పథకాన్ని మరింత పటిష్టపరుస్తామనే అనేక హామీలు ప్రభుత్వం ఇవ్వడంతో సుప్రీంకోర్టు ఈ పథకం అమలుకు అనుమతించింది. ఈ విధంగా కార్మికుల ఆమోదం లేకపోయినా, వివిధ యూనియన్లు ప్రతిఘటించినా ఈ పథకం 1995 నుండి అమలులోకి వచ్చింది.

ఈ పెన్షన్ పథకం ప్రత్యేకత ఏమిటంటే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఎల్ఐసి, బ్యాంకు ఉద్యోగులకు, ఇతర సంస్థలలో ఉన్న పెన్షన్ పథకాలలోని ఒక్క అనుకూల అంశం కూడా ఇందులో లేకపోవడమే. వీటికి భిన్నంగా ప్రతికూలంగా ఉండే అనేక అంశాలు ఈ పథకంలో ఉన్నాయి.

ఉదాహరణకు మిగిలిన అన్ని పెన్షన్ పథకాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం ఉండగా ఈ పథకంలో అది లేదు. అన్ని పెన్షన్ పథకాల్లోనూ పదవీ విరమణ సమయంలో పెన్షన్‌లోని కొంత మొత్తాన్ని కమ్యూట్ చేసుకుని, ఒకేసారి పెద్ద మొత్తాన్ని తీసుకునే అవకాశం ఉండగా, ఈ పెన్షన్ పథకంలో మాత్రం ఆ సదుపాయం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆఖరి నెల జీతం ఆధారంగా పెన్షన్ లెక్కిస్తే, ఈ పథకంలో మాత్రం కార్మికుని ఆఖరి అరవై నెలల జీతం సగటు





తీసుకుని దాని ఆధారంగా పెన్షన్ లెక్కిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 సంవత్సరాల సర్వీసు పూర్తయితే పూర్తి పెన్షన్ పొందడానికి అర్హత రాగా, ఇక్కడ మాత్రం 33 సంవత్సరాల సర్వీసుకు గాని ఆ అర్హత రాదు. ఇలాంటి అనేక లోపాల వల్ల పెన్షన్ చాలా తక్కువగా ఉంటోంది.

పెన్షన్ పొందే జీతం పరిమితిని కూడా మొదట రూ.6,500గా నిర్ణయించారు. తరువాత దానిని రూ.15,000కు పెంచారు. పూర్తి జీతంపై హయ్యర్ పెన్షన్ అనుమతించాలని, సుప్రీంకోర్టు 2022 నవంబరులో తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచినా నేటికీ అమలు కాలేదు సరికదా ఈ పేరున పదిహేడున్నర లక్షల మంది పెన్షనర్ల నుండి రూ.1,86,920 కోట్లు వసూలు చేసి, ఆ సొమ్మును ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఇది పచ్చి దగా.

విచిత్రమేమిటంటే అనేక మందికి 100, 150, 200 రూపాయలు పెన్షన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో చివరకు ప్రభుత్వం కనీస పెన్షన్‌ను వెయ్యి రూపాయలకు 2017లో పెంచింది. దీనివల్ల 36.4 లక్షల మంది లాభపడ్డారని ఘనంగా ప్రకటించుకుంది. కానీ దీన్ని బట్టే తెలుస్తున్నదేమిటంటే అంత మందికి అప్పటి వరకు వెయ్యి రూపాయల లోపే పెన్షన్ ఉందని. దీనికి ప్రభుత్వం సిగ్గు పడవలసింది పోయి, తిరిగి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమే. ఇప్పటికీ వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తున్నవారు కూడా ఉన్నారు. అత్యధికమందికి వచ్చే పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్ కంటే కూడా తక్కువగా ఉంటోంది.

2024లో ఈ పథకం ద్వారా 78.5 లక్షల మందికి పెన్షన్ చెల్లించారు. ఇందులో 46.6 శాతం మందికి వెయ్యి, అంతకంటే తక్కువబీ 85 శాతం మందికి రూ.2,500 లోపు మాత్రమే పెన్షన్ వస్తోందని వీరి గణాంకాలు తెలుపుతున్నాయి. ఐదు వేల రూపాయలకు పైగా పెన్షన్ పొందుతున్నవారు కేవలం 29,608 మందిబీ అంటే మొత్తం పెన్షన్ దారులలో కేవలం 0.37శాతం మంది. సగటు పెన్షన్ కేవలం రూ.1578 మాత్రమే. ఫలితంగా అనేకమంది పెన్షనర్లు కడు పేదరికంలో మగ్గుతున్నారు.

అందువల్లే దీని కార్పస్ ఫండ్ 2018లో 4లక్షల 37వేల కోట్ల రూపాయల నుంచి 2024 నాటికి 8లక్షల 88వేల కోట్లకు అంటే ఆరేళ్ల కాలంలో ఏకంగా రెట్టింపుకు పైగా పెరిగింది. ఈ సొమ్మును ప్రభుత్వం మిగిలిన పిఎఫ్ నిధులతో పాటు, వివిధ సంస్థలలో పెట్టుబడులుగా పెడుతోంది. ఇలా కార్మికుల పొదుపు కార్పొరేట్ల పాలవుతోంది. కార్మికుల ఖాతా నుంచి ఈ పెన్షన్ నిధికి మళ్లిస్తున్న సొమ్ము ఎంత, దానిపై వచ్చే వడ్డీ ఎంత, కార్మికునికి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్ ఎంత, అనే ఈ మూడు అంశాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఇప్పుడు ఈ పెన్షన్ పొందే జీతం యొక్క గరిష్ఠ పరిమితి రూ.15వేలుగా ఉంది. అంటే కార్మికునికి రూ.15వేల జీతం నుండి ప్రతినెల 8.33శాతం చొప్పున పెన్షన్ ఫండ్‌కు అయ్యే జమ, ప్రభుత్వ వాటా 1.16శాతం కలిస్తే, ప్రతి నెల రూ.1420 చొప్పున 25 ఏళ్ల సర్వీసులో మొత్తం రూ.4,26,000. దీనిపై ప్రస్తుతం పిఎఫ్‌పై ఉన్న వడ్డీ రేటు 8.25 శాతం ఆధారంగా 25 ఏళ్ల చివరకు వచ్చే వడ్డీ రూ.10,25,725. అంటే%-% అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.14,51,725 అవుతుంది. దీనిపై ఇప్పుడు సీనియర్ సిటిజన్లకు బ్యాంకులలో ఉన్న వడ్డీ రేటు 8.4 శాతం రేటు చొప్పున నెలకు రూ.10,162 వడ్డీ వస్తుంది. కానీ నేడు ఇదే కార్మికుడికి ఈ పథకం ద్వారా వచ్చే గరిష్ఠ పెన్షన్ నెలకు కేవలం రూ.5,785 మాత్రమే. దీనర్థం ఏమిటంటే కార్మికుని పొదుపు సొమ్ముపై వచ్చే వడ్డీ కంటే కూడా తక్కువగా పెన్షన్ ఉంది. మరి అసలు పొదుపు సొమ్ము అంతా స్వాహా అవడం కాదా ఇది. దీనితో పాటు నాడు సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదు. సరికదా నాడున్న సౌకర్యాలనే కొన్నిటిని ఎత్తివేశారు. అందువల్ల దీన్ని కార్మికుల సంక్షేమం అనడం కంటే, కార్పొరేట్ల సంక్షేమ పథకం అనడం సబబుగా ఉంటుంది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పెద్దలు దీనిని సవరిస్తామని హామీ అయితే ఇచ్చారు కానీ, మూడోసారి అధికారం లోనికి వచ్చినా, ఇంకా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. కార్మికుల పొదుపు సొమ్ము అయిన పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే నయా ఉదారవాద విధానాలను మరింత స్పీడుగా అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న. దేశానికి అనేక విధాలుగా సేవలందించిన, ఈ సీనియర్ సిటిజన్ల పొదుపును దోచుకోవడమే కాక, వారి న్యాయమైన డిమాండ్లను సైతం నిర్లక్ష్యం చేయడం క్షంతవ్యం కాదు. ఈ పని చేయకుండా సీనియర్ సిటిజన్లకు ఏదో చేసేశామని గొప్పలు చెప్పుకోవడం సభ్యత అంతకంటే కాదు.

# అంతర్రాష్ట్ర జల వివాదాలపై దృష్టి పెట్టాలి!





జగన్మోహన్‌రెడ్డి తన అయిదేళ్ల పరిపాలన కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా అటకెక్కించడమే కాకుండా అంతర్రాష్ట్ర జల వివాదాలను జటిలం చేసి వెళ్లారు. అటు కర్ణాటక ఇటు తెలంగాణతో నెలకొన్న పరిష్కారం కాని వివాదాలు దురదృష్టం కొద్దీ కరవు పీడిత ప్రాంతమైన రాయలసీమనే చుట్టుముడుతున్నాయి.ప్రస్తుతం విచారణ జరుపుతున్న కృష్ణ ట్రిబ్యునల్‌లో సమర్థవంతంగా వాదించేందుకు, అనువైన చర్యలు చేపట్టేందుకు తోడు అంతర్రాష్ట్ర జల వివాదాంశాలపై ఉన్నత స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించడం ఎంతైనా అవసరం. తుంగభద్ర జలాశయం పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పోయిందని కర్ణాటక ప్రభుత్వం ఎగువ భాగంలో వరసబెట్టి రిజర్వాయర్లు నిర్మాణానికి తలపడుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడిక ఏర్పడి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడం వాస్తవమైనా దానివల్ల ఒక్క కర్ణాటకే కాకుండా ఆంధ్రప్రదేశ్ వాటాలో కూడా కోత పడుతోంది. ఆంధ్రప్రదేశ్ వాటా 72 టీఎంసీలకు గాను 40 టీఎంసీలు కూడా రావడం లేదు.

జగన్ హయాంలోనే 2022లో 29 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం కావడమే కాకుండా, జాతీయ హోదా కూడా లభ్యమైంది. అప్పర్ భద్ర నిర్మాణానికి వ్యతిరేకంగా అప్పట్లో రాయలసీమలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. కాని ముఖ్యమంత్రిగా జగన్ నిమ్మకు నీరెత్తినట్లు ఉండి పోయారు. కాగా 2020లోనే గంగావతి తాలూకాలో నావళి వద్ద 31 టీఎంసీలతో మరొక ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. ఈ ప్రాజెక్టు కూడా తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందనే పేరుతోనే ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఇటీవల జరిగిన తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక ప్రవేశపెట్టి ఆమోదించమని కోరింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువకు ఆమోదం కోరినట్లు వార్తలు వచ్చాయి. నావళి ప్రాజెక్టు కూడా నిర్మిస్తే తుంగభద్ర జలాశయం ఎగువ భాగంలో 60 టీఎంసీల సామర్థ్యంతో కర్ణాటక రెండు రిజర్వాయర్లను అదనంగా నిర్మించుకొంటుంది. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఉన్న కేసు ఇప్పుడు విచారణకు వచ్చింది. ఈ కేసు విచారణ సందర్భంగా సమర్థవంతంగా వాదించేందుకు అనుభవమున్న లాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించవలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ ఎగువ సమాంతర కాలువ వరద జలాల ఆధారంగా కోరబడినా ప్రయోజనం లేదు. కర్ణాటక పైభాగం నుంచి వచ్చే వరద కిందకు రాకుండా ఆ రాష్ట్రం రిజర్వాయర్లు నింపుకొంటుంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నావళి ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకించాలి. చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న సాగునీటి రంగ సమీక్ష సమావేశాల్లో ఇంజనీరింగ్ అధికారులు అంతర్రాష్ట్ర జల వివాదాల్లో మున్ముందు వచ్చే ఇబ్బందులను వివరంగా నివేదించవలసి ఉంది.జగన్ నిర్వాకంతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. కృష్ణ నదీ జలాల వినియోగ చరిత్ర తిరగేస్తే కృష్ణ నదీ పరీవాహక ప్రాంతంలో ఏ రాష్ట్రమూ నదీ జలాలను వినియోగించని రోజుల్లో 1895-1928 సంవత్సరాల్లోనే ప్రప్రథమంగా రాయలసీమలోని కేసీ కెనాల్ రైతులు తమ పొలాలకు తుంగభద్ర నీళ్లు పారించారు. అంతటి చరిత్ర గల కేసీ కెనాల్‌కు కృష్ణ జలాలు ఉపయోగించకూడదని, తిరిగి పంపిణీకి కొత్త ట్రిబ్యునల్ కావాలని తెలంగాణ డిమాండ్ చేస్తే, 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో జగన్ మూగనోము పట్టారు. 2020 సెప్టెంబర్‌లో కేంద్ర మంత్రి షెకావత్ అధ్యక్షతన జరిగిన అదే అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి జలాల్లో కూడా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాటా తేల్చేందుకు కొత్త ట్రిబ్యునల్ నియామకంపై తీర్మానం చేశారు. కాని తర్వాత కాలంలో గోదావరి జలాలపై ట్రిబ్యునల్ గురించి జగన్ ఏ మాత్రం పట్టించుకోలేదు.ఈ అంశంలో తెలంగాణ అడ్డగోలుగా వాదిస్తోంది. గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 1480 టీఎంసీల్లో తమ వాటా 957.85 టీఎంసీలని, ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 530 టీఎంసీలేనని తెగేసి చెబుతోంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా ప్రయత్నం చేస్తే కేంద్ర ప్రభుత్వం గోదావరి ట్రిబ్యునల్ కూడా వేసే అవకాశం ఉంది. కాని కూటమి ప్రభుత్వం గోదావరి జలాలు వాటా తేల్చేందుకు కొత్త ట్రిబ్యునల్ కోరడం లేదు. ఈ విషయంలో ట్రిబ్యునల్ ఆవశ్యకతను ఇంజనీరింగ్ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లవలసి ఉంది.వీటన్నింటికీ మించి వేసవిలో గొంతెండిపోయే రాయలసీమకు కనీసం తాగునీటిని కూడా ఉంచకుండా తెలంగాణ విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేసింది. ఈ ఏడాది వరద ముంచెత్తి 1600 టీఎంసీలు శ్రీశైలం జలాశయం చేరాయి. గేట్లు మూడుమార్లు ఎత్తి వందలాది టీఎంసీలు కిందకు వదిలారు. జలాశయం నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను డిసెంబర్ 22వ తేదీకి కేవలం 114.24 టీఎంసీలు మాత్రమే రిజర్వాయర్‌లో ఉన్నాయి. డిసెంబర్ ఒకటవ తేదీ వరకు తెలంగాణ మొండిగా విద్యుదుత్పత్తి చేస్తూ రోజూ 35వేల క్యూసెక్కులు కిందకు వదిలేసింది. ఈ రోజుకు 33,285 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి. కృష్ణ యాజమాన్య బోర్డు పోస్టాఫీసు మాదిరిగా వ్యవహరిస్తోంది. విషాదమేమంటే మొన్న జూలై నుంచి నవంబర్ ఆఖరు వరకు కృష్ణ బ్యారేజీ నుంచి 845 టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయి.

ఈ నేపథ్యంలో వేసవిలో తాగునీటికి కటకటలాడవలసి వస్తే రాయలసీమ ప్రజల మనోభావాలు ఎలా ఉంటాయో ఎవరైనా ఊహించగలరు.మరోవైపు ఏకపక్షంగా టీడీపీకి పట్టం గట్టిన ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ప్రజలు వంశధార, నాగావళి నదుల అనుసంధానికి ఎదురుచూస్తున్నారు. జగన్ ఈ అనుసంధానం విషయంలో కూడా మోయలేని భారం పెట్టి పోయారు. జగన్ హయాంలో 2021లోనే వంశధార ట్రిబ్యునల్... ఆంధ్రప్రదేశ్ నేరడి వద్ద బ్యారేజీ నిర్మించుకొని, కాట్రగడ వద్ద సైడ్‌వేర్ నిర్మించుకోవచ్చని తుది తీర్పు ఇచ్చింది. 2017లో ముసాయిదా తీర్పు వచ్చాక 2019లో ఒడిషా సుప్రీంకోర్టు కెక్కినందున ట్రిబ్యునల్ తీర్పును కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ చేయలేదు. జగన్ తన అయిదేళ్ల కాలంలో ఒడిషాతో సంప్రదింపులు జరపలేదు. ఇప్పుడు ఒడిషాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని ఒడిషా ముఖ్యమంత్రితో సంప్రతింపులు జరిపితే తప్పకుండా అంగీకరించవచ్చు.

# జీవితమే సందేశం

భక్తి

పూర్వం ఒక ధనికుడి దగ్గర ఒక సామాన్యుడు పని చేస్తూ ఉండేవాడు. రోజూ అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి తెచ్చేవాడు. బావిలో నీళ్ళు తోడేవాడు. ఆ ఇంట్లో వారు చెప్పిన ఇతర పనులన్నీ చేసేవాడు. యజమాని పెట్టిన తిండి తినేవాడు. ఇచ్చిన వస్త్రాలు ధరించేవాడు. ఏదో ఒక మూల నిద్రపోతూ ఉండేవాడు. అయితే అతనిలో జ్ఞానపిపాస ఉండేది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండే వాడు. అలా ఒక రోజు అతను ఆలోచిస్తూ, ఆలోచిస్తూ తాదాత్మ్యస్థితిలోకి వెళ్ళిపోయాడు. అకస్మాత్తుగా అతనికి జ్ఞానోదయం కలిగింది. అతని హృదయంలో ప్రేమ, ఆనందం ఉప్పొంగాయి. క్రమంగా అతని ప్రవర్తనలో మార్పు వచ్చింది. అతణ్ణి చూసినవారికి ఏదో తేజస్సు కనిపించేది. క్రమంగా జనం ఆయన పట్ల ఆకర్షితులయ్యారు. అతణ్ణి అనేక విషయాల గురించి అడిగేవారు. అతను ఏదో చెప్పి తప్పించు కొనేవాడు. కానీ అతను గొప్పవాడనే ప్రచారం చుట్టు పక్కల ప్రాంతాల్లో వ్యాపించింది. గురువుగా అతణ్ణి భావించేవారు. అలాగే పిలిచేవారు.ఈ గురువు గురించి తెలుసుకున్న ఒక వ్యక్తి... తన సందేహాలను చర్చించడం కోసం దూరప్రాంతం నుంచి ఆ గ్రామానికి బయలుదేరాడు. ఊరు బయటే అతను కనిపించడంతో... పలకరించాడు. కొద్దిసేపు మాట్లాడిన తరువాత... అతనికి జ్ఞానోదయం కలిగిందని స్పష్టమయింది. "మీరు జ్ఞాని అయ్యారు కదా! అంతకు ముందు మీరేం చేసేవారు?" అని ప్రశ్నించాడు.అప్పుడు ఆ గురువు నవ్వి "మా యజమాని కోసం కట్టెలు కొట్టి తెచ్చేవాణ్ణి. బావికి వెళ్ళి నీరు తోడి తెచ్చేవాణ్ణి" అని సమాధానం ఇచ్చాడు.

"ఇప్పుడు మీరు జ్ఞాని కదా! ఇప్పుడేం చేస్తున్నారు?" అని అడిగాడు ఆ వ్యక్తి.

"ఇప్పుడూ అదే పని చేస్తున్నాను అన్నాడు గురువు.

"మరి తేడా ఏముంది? మీరు జ్ఞాని కావడం వల్ల ప్రయోజనం ఏముంది?" అని ప్రశ్నించాడు ఆ వ్యక్తి.


అప్పుడు గురువు "ఎంతో తేడా ఉంది. అంతకు ముందు కట్టెలు కొట్టి తెచ్చినా, బావి నుంచి నీరు మోసుకువచ్చినా యజమాని మీద కోపంతో ఎప్పుడూ ఏదో గొణుక్కొంటూ ఉండేవాణ్ణి. ఆ పనులన్నీ తిట్టుకుంటూ చేసేవాణ్ణి. పనిపట్ల విసుగు, యజమానిపట్ల ద్వేషం ఉండేవి. తినే తిండి నచ్చేది కాదు. కంటికి నిద్ర పట్టేది కాదు. మనసుకు ప్రశాంతత అసలే ఉండేదికాదు. కానీ ఇప్పుడు ఆ పనులన్నీ నాకు ఎంతో ఆనందదాయకమైన, ఆహ్లాదమైన కార్యాలు. వాటిలో అందం, ఆనందం ఇంతా అంతా అని చెప్పలేను. ఇప్పుడు నా దృష్టిలో ఆ యజమాని... నా శ్రేయోభిలాషి, నా సంరక్షకుడు. అతని పట్ల నాకు అమితమైన కృతజ్ఞతాభావం ఏర్పడింది. ఎందుకంటే నాకు కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర ప్రసాదిస్తున్నాడు. సరే! ఇప్పటికే ఆలస్యమయింది. నా యజమాని నాకోసం ఎదురుచూస్తూ ఉంటాడు. వెళ్ళొస్తాను" అని ప్రశాంతవదనంతో, మెరిసేకళ్ళతో చెబుతూ వెళ్ళిపోయాడు.ఈ కథను ఒక సందర్భంలో ఓషో (రజనీశ్) ఉదహరించారు. శిష్యులతో సేవలు చేయించుకొనే గురువుల గురించి మాత్రమే విన్న మనకు ఇతరులకు సేవలు చేయడానికి ఉబలాటపడే గురువుల గురించి తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

## శాకాలు... పోషకాల నిధులు



"మూల పత్ర కరీరాగ్ర ఫల కాండాధిరూఢకా త్వక్ పుష్పం కవకంచేతి శాకం దశవిధం స్మృతమ్" అంటాడు భోజన కుతూహల రచయిత రఘునాథ సూరి. ఆహారంలో శాకాలది ప్రధానమైన భాగస్వామ్యమని దీని అర్థం. దుంప కూరలు, ఆకు కూరలు, చిగుర్లు, పండ్లు, కాయలు, కాడలు, మొలకలు, బెరళ్లు, పూలు, పుట్టగొడుగులు... వీటిని మనం తరచూ తింటూ ఉంటే ఆరోగ్యంగా ఉండగలుగుతాం. ఇప్పుడు మనం వీటిగురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం. శాకాలలో చాలా పోషకపదార్థాలు ఉంటాయి. ఇవి రూపం మారినప్పుడు వాటిలో పోషక విలువలు కూడా మారిపోతూ ఉంటాయి. ఉదాహరణకు ?ఒక గింజను నానబెట్టి వుంచితే మొలకలొస్తాయి. ఈ మొలకల నుంచి కూరగాయలు పండుతాయి. మొలకలలో పోషక విలువలు.. కూరగాయల్లో పోషక విలువలు వేర్వేరుగా ఉంటాయి. అయితే ఈ శాకాలను తినే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ఒకే రకం కూరగాయని విడవకుండా తింటే అస్థిభేదక (ఎముకలు దెబ్బతినటం). నేత్రశక్తి నాశక (కంటి చూపు మందగించటం), రక్తశుక్రనాశక (రక్త కణాల్ని, పురుషుల్లో జీవకణాల్ని నశింపచేయటం), ప్లక్షయం (మేధశక్తిని హరిస్తుంది), ఫాలిత్యకారక (జుట్టు నెరిసిపోతుంది), స్మరణ శక్తి నాశక (పక శక్తిని నశింప చేస్తుంది) అని భావప్రకాశ అనే ఆయుర్వేద గ్రంథం వివరించింది. కాబట్టి ప్రతి రోజూ ఒకే రకం కూరగాయలు కాకుండా ఒక రోజు దుంపకూర, ఒకరోజు ఆకు కూర, ఒకరోజు కాయగూర ఇలా ఆరు రకాల్నీ మార్చిమార్చి తినాలనేది ఆయుర్వేద నిపుణుల చెబుతూ ఉంటారు. దీనికి తగిన విధంగానే మన ఆహార ప్రణాళిక కూడా ఉండాలి. అంతే కాకుండా శరీర తత్వానికి ఏది మంచిదో దానినే తినాలి. లేకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముంది.

# మేం ఎవరికీ తీసిపోం



ఆమెది పుట్టుకతో వెంట తెచ్చుకున్న అంధత్వం కాదు. బడి ఈడు వరకూ మెరుగ్గా ఉన్న కంటిచూపు క్రమేపీ తగ్గుతూ, అంతిమంగా అంధత్వానికి దారి తీసింది. కానీ ఆ పరిస్థితికి కుంగిపోకుండా గాయనిగా ఎదుగుతూనే, సివిల్ సర్వెంట్‌గా ప్రజలకు సేవలందించాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది హైదరాబాద్‌కు చెందిన 23 ఏళ్ల పోరాల మౌనిక. ఆమె పంచుకున్న ఆసక్తికరమైన విశేషాలు...

"భగవంతుడు మన దగ్గరి నుంచి దేన్నైనా తీసేస్తే, అంతకు మించిన ఉత్తమమైనదేదో తిరిగిస్తాడని అర్థం. కాబట్టి ఆ బెస్ట్ కోసమే మనం ప్రయత్నించాలి. దాన్నే మన లక్ష్యం చేసుకోవాలి. పుట్టుకతోనే అంధత్వాన్ని వెంటబెట్టుకు రావడం వేరు. క్రమేపీ చూపు కోల్పోయి అంధత్వానికి చేరుకోవడం వేరు. నా విషయంలో అదే జరిగింది. అయినా నేనెప్పుడూ కుంగిపోలేదు. మరింత మెరుగ్గా, చూపున్న పిల్లల కంటే సమర్థంగా, ఉన్నతంగా ఎదగడం కోసం నాలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవడం చిన్నప్పటి నుంచే మొదలుపెట్టాను. పుట్టుకతో నా కంటి చూపు అందరు పిల్లల్లాగే మెరుగ్గానే ఉండేది. బడికి కూడా వెళ్తూ ఉండేదాన్ని. కానీ క్రమేపీ చూపు తగ్గుతూ ఉండడంతో, అమ్మా నాన్నా నన్ను స్థానికంగా కంటి వైద్యులకు చూపించారు. ఎల్వీ ప్రసాద్, సరోజినీ దేవి కంటి ఆస్పత్తులకు కూడా తీసుకువెళ్లారు. చూపు మెరుగు కోసం చేసిన మొదటి సర్జరీ విఫలమైపోయింది. విదేశీ వైద్యులు చేసిన రెండో సర్జరీ ఫలితాన్నిచ్చి పదో తరగతి వరకూ కొంతమేరకు చూడగలుగుతూ, నా పనులు నేను చేసుకోగలిగేదాన్ని. అలాగని నేను సాధారణ బడుల్లో చదువుకోలేదు. యుకెజి వరకూ సాధారణ బడిలో చదివినా, పుస్తకాలు చదవడం వల్ల, కంటిచూపు ఇంకా వేగంగా తగ్గిపోయే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పడంతో ఒకటో తరగతి నుంచి బ్రెయిలీలో చదువు కొనసాగించాను. పదో తరగతి నుంచి చూపు మరింత దిగజారుతూ, అంతిమంగా అంధత్వానికి దారి తీసింది. నాకున్నది గ్లాకోమా సమస్య కాబట్టి పెరిగే వయసుతో పాటు చూపు తగ్గి అంతిమంగా అంధత్వం వచ్చేస్తుందనే విషయాన్ని నేను అర్థం చేసుకుని మానసికంగా సిద్ధపడిపోయాను. అలా ఇంటర్ వరకూ బ్రెయిలీలోనే చదివి, డిగ్రీలో అడుగు పెట్టిన తర్వాత ఉస్మానియా వెబ్‌సైట్ ఆధారంగా చదువును కొనసాగించాను. ప్రస్తుతం ఎమ్‌బిఎ సెకండ్ ఇయర్ చదువుతున్నాను.

**అమ్మానాన్నల ప్రోత్సాహంతో...**

ఒకటో తరగతిలో మొదటిసారిగా బ్లైండ్ స్కూల్‌కు వెళున్నప్పుడు, అమ్మ నన్ను చూసి విపరీతంగా ఏడ్చింది. అప్పటివరకూ సాధారణ బడికి వెళ్లిన నేను అంధులైన పిల్లలతో కలిసి అంధ పాఠశాలకు వెళ్లడం అమ్మ తట్టుకోలేకపోయింది. నేను కూడా అంధ పిల్లల్లా ఉన్న చోటికే పరిమితమైపోతానేమోనని అమ్మ భయపడింది. కానీ ఎదుగుతున్నకొద్దీ అవన్నీ అర్థం లేని భయాలని ఆమె గ్రహించింది. ఒకవేళ ఎప్పుడైనా కాస్త వెనకబడినట్టు కనిపిస్తే, 'సాధారణ పిల్లల్లాగే నువ్వు కూడా అన్నీ చేయగలుగుతావు' అంటూ అమ్మానాన్నలు నన్ను ప్రోత్సహిస్తూ ఉండేవారు. వాళ్లు నన్నెప్పుడూ ఒక అంధురాలిగా పరిగణించలేదు.

**క్రికెటర్‌గా, కబడ్డీ ప్లేయర్‌గా...**

అంధత్వం ఉంది కాబట్టి నేను నా బాల్యాన్ని ఎంజాయ్ చేయలేకపోయానని అనుకుంటే పొరపాటు. నేను అంధులైన పిల్లలతోనే కలిసి పెరిగాను. మేమందరం సాధారణ పిల్లలతో సమానంగా చురుగ్గా అన్ని క్రీడల్లో పాల్గొనేవాళ్లం. ప్రత్యేకించి నేను క్రికెట్ బాగా ఆడేదాన్ని. తెలంగాణా బ్లైండ్ విమెన్ టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఉండేదాన్ని. నేను జాతీయ కబడ్డీ ప్లేయర్‌ను కూడా! అంధులమైనంత మాత్రాన మేం సాధారణ పిల్లలకు ఏమాత్రం తీసిపోము. నిజానికి వాళ్లకంటే ఇంకాస్త మెరుగ్గా ఆడతామనే అనుకోవచ్చు. ఎందుకంటే చూపున్న వాళ్లు చెవులను అంతగా ఉపయోగించరు. అంధులు విషయాలను త్వరగా గ్రహిస్తారు అని అంటూ ఉంటారు. కానీ నిజానికి ఐక్యూ అందరికీ సమానంగానే ఉంటుంది. అయితే మాకు కళ్లు కనిపించవు కాబట్టి వినికిడి శక్తి మీద ఎక్కువగా ఆధారపడతాం. వినికిడి పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటాం! వినికిడి శక్తితో పరిసరాలు, పనులు, నైపుణ్యాల మీద పట్టు పెంచుకోగలుగుతాం!"

యువతకు చదువుతో పాటు వినోదం కూడా తప్పనిసరి. అయితే ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినోదాన్ని ఎంచుకున్నా, దానికీ పరిమితి ఉండాలి. ఎంత చదివినా, ఎంత ఎదిగినా వినోదం పరిమితంగానే ఉండాలి. అప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం! మాది ఖమ్మం. నా చదువు కోసం చిన్నప్పుడే హైదరాబాద్ వచ్చేసి, ఇక్కడే స్థిరపడిపోయాం. నాన్న కొండలరావు, కారు నడుపుతారు. అమ్మ మాధవి, గృహిణి. సంగీతంలో అమ్మ నన్ను ప్రోత్సహిస్తే, నాన్న నన్ను చదువులో ప్రోత్సహించారు. నా కాళ్ల మీద నేను నిలబడి, ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రంగా బతకాలన్నది అమ్మానాన్నల ఆకాంక్ష. ఎదుటివాళ్లకు సహాయపడేలా ఎదగాలనీ, చేయి చాపే పరిస్థితి ఉండకూడదనీ నాన్న అంటూ ఉంటారు. ప్రస్తుతం నేను సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎదగాలన్నది నా లక్ష్యం. పాటలు పాడే అభిరుచి చిన్నతనంలోనే ఏర్పడింది. నా ఆసక్తిని గ్రహించిన అమ్మ నన్ను వెంటబెట్టుకుని మ్యూజిక్ క్లాస్‌లకు తీసుకువెళ్తూ ఉండేది. ప్రతిమ శశిధర్, కొమందూరి రామాచారి దగ్గర సంగీతం నేర్చుకున్నాను. 2022లో తెలుగు ఇండియన్ ఐడిల్ సీజన్ వన్‌లో పాల్గొని, థియేటర్ లెవల్ వరకూ చేరుకోగలిగాను. ప్రస్తుతం ప్రతి రోజూ సంగీతం సాధన చేస్తూ ఉంటాను.

## తోబుట్టువులకు అమ్మగా మారి...



ఈమె పేరు రమణమ్మ. చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోతే... కుటుంబ బాధ్యతల్ని మీదేసుకుంది. చోడవరం వికాస మహిళా పొదుపు బ్యాంకులో చిరుద్యోగిగా చేరింది. కట్‌చేస్తే... ఆమె ఇప్పుడా బ్యాంకుకి మేనేజర్. ఓవైపు ఉద్యోగం, మరోవైపు తోబుట్టువులూ, ఇంకోవైపు సాటి మహిళలకోసం కష్టపడుతోన్న రమణమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. అప్పుడు రమణమ్మకు పదిహేనేళ్లుంటాయంతే. తల్లీతండ్రీ మూడు నెలల తేడాలో చనిపోయారు. దాంతో పది, ఐదేళ్ల వయసున్న ఇద్దరు తమ్ముళ్లూ, నెలల వయసున్న చెల్లి బాధ్యత ఆమెపై పడింది. బంధువులు జాలి చూపించారే తప్ప ఆసరా ఇవ్వలేదు. దాంతో ఓ వైపు చదువుకుంటూనే కూలికి వెళ్లింది. ఆ డబ్బుల్ని పొదుపుగా వాడుతూ, వాళ్లనీ చదివించాలనుకుంది. ఆ తరువాత డిగ్రీలో చేరింది. ఓ వైపు కాలేజీకి వెళ్తూనే, మరోవైపు కూలి పనికి వెళ్లేది. బీకాం పూర్తయ్యాక చోడవరంలో వికాస పరస్పర సహాయ సహకార పొదుపు సంఘంలో 500 రూపాయల జీతానికి ఫీల్డ్ ఆర్గనైజర్‌గా చేరింది. అంటే ఈ సంఘం పరిధిలోని 12 గ్రామాలకు సైకిల్‌పై తిరిగి మహిళల నుంచీ పొదుపూ, రుణాలు వసూళ్లు చేయాలి. 'రోజంతా సైకిల్‌పై ఎలా తిరుగుతావు' అని చాలామంది అన్నా పట్టించుకోలేదు. 'నా తోబుట్టువులకు మంచి జీవితం ఇవ్వాలంటే నేను ఏదైనా చేయాలి. అందుకే ఎంత కష్టమైనా సరే... చేరిపోయా' అంటుంది రమణమ్మ. ఆ పిల్లల్నీ చూడాలి... ఆ ఉద్యోగం చేస్తూనే మిగిలినవాళ్లనీ చదివించింది. పెద్ద తమ్ముడికి పెళ్లిచేసిన కొన్నాళ్లకే అతని భార్య చనిపోయింది. రెండేళ్లకు అతనూ హృద్రోగంతో చనిపోయాడు. ఇప్పుడు వాళ్ల ఇద్దరు పిల్లల బాధ్యత కూడా రమణమ్మదే. చిన్న తమ్ముడికి చెవులు వినిపించకపోయినా... ఎమ్మెస్సీ, బీఈడీ చేసి, ప్రస్తుతం ఓ ప్రైవేటు బధిర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. చెల్లి అమ్మాజీని బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయించింది. ప్రస్తుతం ఆమె హుకూంపేట పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్‌గా చేస్తోంది. 'మా చెల్లికి పెళ్లి చేశా. జీవితంలో ఎన్నో ఒడిదొడుకుల్ని ఎదుర్కొన్నా. నా పనిని గుర్తించి బ్యాంకు నిర్వాహకులు ఫీల్డ్ వర్క్ నుంచి, ఫీల్డ్ కోఆర్డినేటర్‌గా పదోన్నతి కల్పించారు. పనిచేస్తూనే దూరవిద్యలో ఎమ్మెస్సీ పూర్తిచేశా. టైపు, కంప్యూటర్‌లో శిక్షణ కూడా తీసుకున్నా...' అంటుంది రమణమ్మ. ఇప్పుడామె ఆ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తోంది. 21 కోట్లకు పెరిగిన టర్నోవరు... 'నేను వికాస మహిళా పొదుపు బ్యాంకులో చేరినప్పుడు పొదుపు వేలల్లోనే ఉండేది. ఇప్పుడది 21 కోట్లరూపాయల టర్నోవరుకు చేరుకుంది. మేం ఉపాధి కోరుకునే మహిళలకు రుణాలు ఇస్తాం. మా పనితీరు జాతీయ బ్యాంకులూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులెందరో మెచ్చుకున్నారు. ఇప్పటివరకూ వేలాదిమంది మహిళలకు రుణాలందించి ఉపాధి కల్పించాం. మేనేజరుగా కేవలం రుణాలు మాత్రమే కాకుండా, ఇక్కడికొచ్చే మహిళలకు పలు అంశాల్లో అవగాహన అందిస్తుంటా...' అంటుంది రమణమ్మ.

# స్త్రీ శక్తి.. మరో అడుగు

శిక్షణలో ఉమెన్ వారియర్స్

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్) స్త్రీసాధికారత, శక్తియుక్తులకు సంబంధించి మూడు చారిత్రక అద్భుతాలకు వేదిక అయింది.

**కొన్ని నెలలు వెనక్కి వెళితే...**

నక్సల్స్‌ను ఎదుర్కోవడం కోసం ఏర్పాటు చేసిన 'కోబ్రా కమాండో'లో మహిళల ప్రాతినిధ్యం లేదు. అయితే 34 మంది మహిళలతో 'కోబ్రా' దళాన్ని ఏర్పాటు చేసి మహిళలు లేని లోటును పూరించారు. 'కోబ్రా'కు ఎంపికైన వారియర్స్ మూడు నెలల పాటు అడవుల్లో కఠినమైన శిక్షణ తీసుకున్నారు. గుర్‌గ్రామ్ కదార్‌పూర్‌లో కోబ్రా వుమెన్ వారియర్స్ ప్రదర్శించిన యుద్ధవిన్యాసాలు అబ్బురపరిచాయి.

వారి మాటల్లోని ఆత్మవిశ్వాసం ఆకట్టుకుంది. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి అభినందనలు తెలియజేస్తూ 'హిస్టరీ ఇన్ మేకింగ్' అని ట్వీట్ చేసింది సీఆర్పీఎఫ్. 2012లో వరల్డ్ ఫస్ట్ 'ఆల్ ఉమెన్ పారామిలటరీ పైప్‌బ్యాండ్'ను ఏర్పాటు చేసింది సీఆర్‌పీఎఫ్.

**ఇక తాజా విషయానికి వస్తే...**

సీఆర్పీఎఫ్ జడ్‌ప్లస్ కేటగిరి కోసం విధులు నిర్వహించడానికి ఎంపికైన 32 మంది ఉమెన్ వారియర్స్ వివిధ విభాగాల్లో పదివారాల పాటు శిక్షణ పొందారు. ఈ నెలలోనే కొత్త బాధ్యతల్లోకి వెళ్లనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్... మొదలైన వారికి రక్షణగా నిలవనున్నారు. రాబోయే అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో వీఐపీ రాజకీయ నాయకుల రక్షణ బాధ్యతల్లో పాలుపంచుకోనున్నారు. గతంలో జడ్‌ప్లస్ కమాండో విభాగంలో పురుషులు మాత్రమే ఉండేవారు. తాజా అడుగుతో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది సీఆర్పీఎఫ్.



## ఒబెసిటీ.. అధిక బరువే కాదు అంతకు మించి

ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న సమస్య ఒబసిటీ. వ్యక్తుల ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లోపించడం వంటి అనేక కారణాలతో ఇప్పుడు ఇదొక జీవనశైలికి సంబంధించిన అంశంగా మారింది. అందరూ దీనిని కేవలం అధిక బరువుతోనే కొలుస్తుంటారు. అయితే ఇది అంతకు మించిన తీవ్రమైన పరిస్థితిగా పరిగణించి పూర్తి స్థాయి చికిత్స చేయాలి అంటున్నారు కేర్ ఆసుపత్రికి చెందిన డా.బిపిన్ సేథీ. రోజువారీ జీవనం మీద ఒబెసిటీ ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. హృద్రోగం, డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్, కీళ్ల నొప్పులు.. ఇంకా అనేక ఇతర తీవ్రమైన అనారోగ్యాలతో పాటు కొన్ని రకాల కేన్సర్‌లకూ కారణమవుతుంది. కేవలం శారీరకమైనవే కాకుండా డిప్రెషన్, న్యూనతాభావం తదితర మానసిక సమస్యలకూ ఇది దోహదం చేస్తుంది.

**సరైన కారణం గుర్తించాలి**

ఒబెసిటీ విషయంలో వ్యక్తిగత బాధ్యతా రాహిత్యం, విల్‌పవర్ లోపించడం.. వంటివి చూపిస్తూ బాధితులపైనే పూర్తిగా నెపం వేస్తుంటారు. అలాగే కేవలం ఎక్కువ తినడం, వ్యాయామం లేకపోవడం వంటివి మాత్రమే ఒబెసిటీకి కారణం కావనేది అర్థం చేసుకోవాలి. దీనికి జన్యుపరమైన సమస్యలతో పాటు పరిసరాలు, వాతావరణం, ప్రవర్తన... ఇవన్నీ కూడా కారణాల్లో ఉండొచ్చు.. ఒబెసిటీ కారణాల గురించి మనకు తక్కువ అవగాహన ఉంది. హార్మోనల్ కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఏదేమైనా దీనిని సరైన రీతిలో అర్థం చేసుకునే దశలోనే మనం ఉన్నాం. కాబట్టి త్వరపడి ఏదోఒక కారణాన్ని నిర్ధారించుకుని చికిత్స సరికాదు.

**చికిత్సకు నిర్ణీత వ్యవధి**

ఒబెసిటీ బాధితులు కూడా తామేదో హార్మోనల్ సమస్య అని భావిస్తూ సరైన క్రమపద్ధతిలో కాకుండా త్వరితంగా సమస్య నుంచి బయటపడే మార్గాలు వెతుకుతుంటారు. అది సరైంది కాదు ఈ సమస్య నుంచి కోలుకోవడానికి జీవిత కాలపు ఆరోగ్య నిపుణుల అవసరం ఉంటుంది. వ్యక్తులకు సంబంధించిన డైట్ మాత్రమే కాకుండా తినే ఆహారం, అలాగే వ్యాయామాలను పరిశీలించాల్సి ఉంది. నెగిటివ్ కేలరీ బ్యాలెన్స్‌తో పాటు ఇదొక దీర్ఘకాలికం కొనసాగాల్సిన ప్రక్రియ, అంతే తప్ప శరవేగంగా ఫలితాలను ఆశించడం, వెంటనే బరువు తగ్గాలని కోరుకోవడం, పెళ్లి వంటి వేడుకల కోసం హడావుడిగా సర్జరీ ప్లాన్స్ ఎంచుకోవడం వల్ల సరైన ఫలితం రాదు.

**తీవ్రతకు తగ్గ చికిత్స**

వ్యక్తిగత ఒబెసిటీ తీవ్రతపై ఆధారపడి దీనికి చికిత్స ఉండాలి. అలాగే వ్యక్తిగత ఆరోగ్య ప్రమాదాలు, మానసిక ప్రవర్తన శైలులు, మెటబాలిక్ క్యారెక్టరిస్టిక్స్‌లతో పాటు గతంలోని అధిక బరువు తగ్గించుకునే యత్నాలు వాటి ఫలితాలు కూడా దీనిలో పరిగణనలోకి తీసుకోవాలి. వ్యక్తిగత చికిత్సా పద్ధతులు అనుసరిస్తూ మల్టీ లెవల్ ఒబెసిటీ మేనేజ్‌మెంట్ నెట్‌వర్క్‌తో సమన్వయంతో పనిచేస్తే లక్ష్యం చేరుకోవడానికి వీలవుతుంది. ఒబెసిటీ మేనేజ్‌మెంట్‌లో నైపుణ్యం కలిగిన బృందం పనిచేయాలి. చికిత్సలో భాగంగా అన్ని రకాల ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. రోగి జీవనశైలికి, ప్రాధామ్యాలకు నప్పేలా దీనిని డిజైన్ చేస్తారు. మందుల వాడకాన్ని సమీక్షించడం, మార్పు చేర్పులు, పోషకాల సహకారం, శారీరక కార్యకలాపాలు పెంచడం, కౌన్సిలింగ్, రోగికి నప్పేదైతే బేరియాట్రిక్ సర్జరీ.. వంటివన్నీ ఇందులో భాగంగా ఉంటాయి. పలువురు భావిస్తున్నట్టు ఇది ఒంటరిగా పోరాడే పరిస్థితి కాదు. వైద్య నిపుణుల పర్యవేక్షణ సహకారం అవసరం.

# వృద్ధాప్య లక్షణాలకు చెక్ !

వయసు పెరుగుతున్నా కొద్దీ సహజసిద్ధంగా వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తుంటాయి. అయితే కొంతమంది వయసులో ఉండగానే ఈ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఇంట్లోనే ఈ ఏజింగ్ లక్షణాలకు చెక్ చెప్పొచ్చు.



-కొద్దిగా నిమ్మరసాన్ని తీసుకొని ముఖంపై ఏజింగ్ లక్షణాలు కనిపిస్తున్న దగ్గర రాయాలి. కొద్దిసేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ చిట్కా పాటిస్తున్నప్పుడు ఎండకు వెళ్లకూడదు.

-ఆపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఏజ్ స్పాట్స్ వద్ద కొంచెం ఎక్కువగా రాయాలి. 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి.

-ఏజింగ్ లక్ష ణాలను తగ్గించడానికి ఆముదం మంచిగా పనిచేస్తుంది. కొద్దిగా ఆముదాన్ని ముఖానికి రాసి, మర్దనా చేయాలి. తర్వాత రోజూ వాడే సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. పాలను ముఖానికి పట్టించి, మర్దన చేస్తే.. సున్నితంగా మారుతుంది. మృతకణాలను తొలిగించడంలో పాలు మేలు చేస్తాయి. పాలలో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మ రక్షణకు ఉపయోగపడుతుంది. తాజా టమోట ముక్కలతో ముఖాన్ని మర్దన చేయాలి. రసం ముఖానికి పట్టేంత వరకూ ఆగాలి. తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. పసుపులో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి.. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఇలా ప్రతిరోజూ చేస్తుంటే ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.

# బిజినెస్



## ఇన్ఫీ మాజీ సీఈఓ విశాల్ సిక్కాతో ప్రధాని మోదీ భేటీ.. ఏం చర్చించారంటే..!



**ముంబై - నవభూమి:**ఇండో అమెరికన్ పారిశ్రామికవేత్త, ఇన్ఫోసిస్ మాజీ సీఈఓ విశాల్ సిక్కా శనివారం ప్రధాని నరేంద్రమోదీతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో దిగిన ఫోటోను సోషల్ మీడియావేదిక ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల భారత్ మీద చూపే ప్రభావంపై ప్రధాని మోదీతో చర్చించినట్లు చెప్పారు. 'ప్రధాని నరేంద్రమోదీతో భేటీ కావడం గర్వకారణం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, దానివల్ల భారత్‌పై ప్రభావంపై మోదీ విస్తృత స్థాయి చర్చలు జరిపాం. ఈ భేటీ తర్వాత టెక్నాలజీపై ప్రధాని మోదీకి గల అసాధారణ పరిజ్ఞానం నన్ను అబ్బుర పరిచింది. ప్రజాస్వామ్య విలువలతోపాటు దాన్ని ఉపయోగంతో ప్రతి ఒక్కరి అభ్యున్నతికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నాం' అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.విశాల్ సిక్కా గతంలో 2014 నుంచి 2017 వరకూ ఇన్ఫోసిస్ సీఈఓ కం మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చే శా ర ు .
ఇన్ఫోసిస్ సీఈఓగా నియమితులైన తొలి నాన్ ఫౌండర్ విశాల్ సిక్కా. అయితే కంపెనీ బోర్డు డైరెక్టర్లు, ఫౌండర్లకు మధ్య విభేదాలు తలెత్తడంతో 2017లో రాజీనామా చేశారు. ఆయన తన సొంత ఏఐ బేస్డ్ స్టార్టప్ వైనాయి సిస్టమ్స్‌తోపాటు పలు వెంచర్లలో భాగస్వామిగా ఉన్నారు. 2002 నుంచి 2014 ఆగస్టు వరకూ జర్మనీ టెక్నాలజీ మేజర్ 'ఎస్ఏపీ'లో సుదీర్ఘకాలం పని చేశారు. 12 ఏండ్ల కాలంలో సంస్థ సీటీవో, ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడిగా ఉన్నారు.

## కరిగిపోతున్న విదేశీ నిల్వలు



**ముంబై - నవభూమి:** విదేశీ నిల్వలు క్రమంగా కరిగిపోతున్నాయి. గత నెల చివరినాటికి భారత్‌లో విదేశీ మారకం నిల్వలు 4.112 బిలియన్ డాలర్లు తరిగిపోయి 640.279 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 8.478 బిలియన్ డాలర్లు తగ్గి 644.391 బిలియన్ డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలోవున్న ఆస్తుల విలువ 4.641 బిలియన్ డాలర్లు తగ్గి 551.921 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కానీ, పసిడి రిజర్వులు మాత్రం 541 మిలియన్ డాలర్లు ఎగబాకి 66.268 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## హైదరాబాద్‌లో ఆ ప్రాంతంవైపే అందరి దృష్టి.. హైటెక్ సిటీ, మాదాపూర్‌కు దగ్గర్లోనే.. తక్కువ ధరలకే ఫ్లాట్లు!



**ముంబై - నవభూమి:**రియల్ ఎస్టేట్ పరంగా చూస్తే హైదరాబాద్ నగరం ఎప్పుడో దిగ్గజ నగరాల సరసన చేరిందని చెప్పొచ్చు. పలుమార్లు ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్ని దాటి ఇక్కడ ధరలు పలుకుతున్నాయి. హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందుతున్న వేళ.. ఇప్పుడు కోకాపేట ప్రాంతంలో ఫ్లాట్ల కంటే సగం ధరలకే మరో ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయి. ఇదెక్కడో చూద్దాం.: హైదరాబాద్‌లో ఐటీ అంటే హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ ప్రాంతాలే గుర్తుకొస్తాయి. దాదాపు 80 శాతం వరకు ఇక్కడి ప్రాంతాల్లోనే పనిచేస్తుంటారు. ఈ ప్రాంతాలకు 10 కిలోమీటర్ల పరిధిలో నివాసం ఉండాలంటే.. కోకాపేట ప్రాంతం చూస్తే.. అక్కడ చదరపు అడుగు ధర దాదాపుగా రూ. 12 నుంచి రూ. 14 వేల వరకు ఉంటోంది. మిగతా ప్రాంతాలన్నీ దాదాపు ఇప్పటికే రద్దీగా మారాయి. దీంతో చాలా మంది ఇప్పుడు బాలా నగర్ ప్రాంతం వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు బాలా నగర్ అంటే భూగర్భ జలాలు కలుషితం అయ్యాయని.. పారిశ్రామిక వాడ అని.. గాలి కూడా కలుషితం అయిందని అనుకునేవారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఇక్కడ ఇప్పుడు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, నైఫర్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్నాయి.ఒకప్పుడు ఇక్కడ ఉండే ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ వంటి కంపెనీలు వేలాది మందికి ఉపాధి కల్పించినప్పటికీ.. చాలా కాలం కిందటే అది మూతపడింది. ఇంకా ఈ కంపెనీకి చెందిన దాదాపు 100 ఎకరాల భూముల్లో పచ్చదనం విస్తరించింది. ఈ క్రమంలోనే బాలానగర్ ప్రాంతం వైపు కూడా లగ్జరీ నిర్మాణాలు మొదలయ్యాయి.కోకాపేట సహా ఇతర ప్రాంతాల్లో లభించే సదుపాయాలన్నీ కూడా ఇక్కడ లభిస్తున్నాయి. ఇంకా.. కోకాపేటలో చదరపు అడుగు ధర ప్రస్తుతం రూ. 12-14 వేల వరకు పలుకుతుండగా.. ఇక్కడ దాదాపు రూ. 6 వేల నుంచి 7 వేల వరకే అందుబాటులో ఉంది. అంటే కోకాపేట ధరల్లో సగం ధరలకే ఇక్కడ లగ్జరీ ఫ్లాట్లు లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.గగ ఇంకా బాలానగర్ ప్రాంతం.. హైటెక్ సిటీకి దాదాపు 12-13 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఫ్లై ఓవర్స్, అండర్ పాస్‌లు వంటి మౌలిక సదుపాయాలు వచ్చిన నేపథ్యంలో అరగంటలోపే బాలానగర్ నుంచి హైటెక్ సిటీ చేరుకోవచ్చు. ఇక్కడ మంచి పెద్ద పెద్ద స్కూళ్లు, ఇంజినీరింగ్ కాలేజీలు కూడా ఉండటంతో పిల్లల చదువుల గురించి కూడా ఏమాత్రం కంగారు పడనక్కర్లేదు. మల్టీప్లెక్సులు, మాల్స్ కూడా ఉండటంతో విహారం, వినోదానికి అడ్డంకుల్లేవు.గగ ఇక కొండాపూర్, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో లగ్జరీ ఫ్లాట్స్ కావాలంటే ఎంత కాదన్నా కనీసం రూ. 6- 7 కోట్ల వరకు పెట్టాల్సి ఉంటుంది. బాలా నగర్‌లో అయితే లగ్జరీ ఫ్లాట్ కోసం 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే ఫ్లాట్ అన్ని సౌకర్యాలతో కలిపి రూ. కోటిన్నర నుంచి రూ. 2 కోట్ల లోపే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఇతర ప్రాంతాల్లో పనిచేసినా.. హైదరాబాద్ వచ్చి స్థిరపడాలనుకునే వారికి కూడా బాలానగర్ బెస్ట్ ఆప్షన్ రియల్ ఎస్టేట్ నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

## వీఐ వార్షిక ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ డాటా



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా(వీఐ) తన కస్టమర్లకు శుభవార్తను అందించింది. వార్షిక రీచార్జి ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ప్లాన్ల కింద అన్‌లిమిటెడ్ డాటాను అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం వరకు అందుకోవచ్చునని తెలిపింది. రూ. 3,599, రూ.3,699, రూ.3,799 ప్రీ-పెయిడ్ ప్లాన్లలో అర్ధరాత్రి 12 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు అన్‌లిమిటెడ్ డాటాతోపాటు మిగతా సమయంలో రోజువారి 2జీబీ డాటాను కూడా పొందవచ్చునని తెలిపింది. ఈ ప్రత్యేక ప్యాక్‌లు మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కేరళ, బెంగాల్, పంజాబ్, హార్యానా సర్కిళ్లలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, సమీప భవిష్యత్తులో మిగతా సర్కిళ్లలో కూడా ఈ ప్లాన్‌ను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## వచ్చే వారం ఐపీఓల జాతర.. 6 లిస్టింగ్‌లు, 7 సబ్‌స్క్రిప్షన్లు..



**ముంబై - నవభూమి:**కొత్త సంవత్సరం మొదటి వారంలోనే స్టాక్ మార్కెట్లలో ఐపీఓల జాతర మొదలైంది. వచ్చే వారంలో మార్కెట్ నుంచి నిధులను సమీకరించేందుకు పలు సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఒకటి, రెండు కాదు.. ఏకంగా ఏడు సంస్థలు పబ్లిక్ ఇష్యూకు రాబోతున్నాయి. అలాగే ఆరు సంస్థలు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ కాబోతున్నాయి. పబ్లిక్ ఇష్యూకు రాబోతున్న ఏడింటిలో మూడు మెయిన్ బోర్డ్ నుంచి కాగా, మరో నాలుగు ఎస్ఎమ్ఈ విభాగం నుంచి రాబోతున్నాయి. వాటి వివరాలు తెలుసుకుందాం

**స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ..**
స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ జనవరి 6న ప్రారంభమై 8న ముగిస్తుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు గ్యాస్ లైనింగ్ పరికరాలు, సంక్లిష్ట పరికరాలను తయారు చేసి అందిస్తుంది. ఈ సంస్థ మార్కెట్ నుంచి 410.05 కోట్ల రూపాయలను సమీకరించబోతోంది. ఒక్కో షేర్ ధరల శ్రేణి రూ.133-రూ.140గా ఉండబోతోంది.

**క్యాపిటల్ ఇన్‌ఫ్రా..**
క్యాపిటల్ ఇన్‌ఫ్రా ఐపీఓ జనవరి 7న మొదలై 9న ముగుస్తుంది. ఇన్‌ఫ్రా రంగంలో పని చేస్తున్న ఈ కంపెనీ 1578 కోట్ల రూపాయల నిధులను సమీకరించేందుకు సిద్ధమవుతోంది. ఒక్కో షేర్ ధరల శ్రేణి రూ.99-రూ.100గా సంస్థ నిర్ణయించింది.

**క్వాడ్రంట్ ఫ్యూచర్..**
క్వాడ్రంట్ ఫ్యూచర్ ఐపీఓ జనవరి 7న మొదలై 9న ముగుస్తుంది. భారత రైల్వేలకు చెందిన కవచ్ ప్రాజెక్ట్ కింద అధునాతన సిగ్నలింగ్, కంట్రోల్ వ్యవస్థ కోసం ఈ సంస్థ పరిశోధనలు సాగిస్తోంది. ఈ సంస్థ మార్కెట్ నుంచి రూ.290 కోట్ల సమీకరణను లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కో షేర్ ధరల శ్రేణి రూ.275-290 మధ్య నిర్ణయించారు.పై మూడు మెయిన్ బోర్డ్ నుంచి పబ్లిక్ ఇష్యూకు వస్తుండగా, ఎస్ఎమ్ఈ విభాగం నుంచి ఇండోబెల్ ఇన్సులేషన్ లిమిటెడ్ (ఒక్కో షేర్ ధర రూ.46), బీఆర్ గోయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (షేర్ ధరల శ్రేణి రూ.128-135), డెల్టా ఆటోక్రాప్ లిమిటెడ్, అవాక్స్ అపెరల్స్ అండే ఆర్నమెంట్ లిమిటెడ్ (ఒక్కో షేర్ రూ.70) సంస్థలు పబ్లిక్ ఇష్యూకు వస్తున్నాయి. అలాగే వచ్చే వారం మెయిన్ బోర్డ్ నుంచి ఇండో ఫార్మ్ ఎక్విప్‌మెంట్ షేర్లు జనవరి 7న మార్కెట్లో లిస్ట్ కాబోతున్నాయి. ఇక, ఎస్ఎమ్ఈ విభాగం నుంచి టెక్నికెమ్ ఆర్గానిక్ లిమిటెడ్ (జనవరి 7), లియో డ్రైఫ్రూట్స్ అండ్ స్పైసెస్ (జనవరి 8), పరమేశ్వర్ మెటల్ (జనవరి 9), ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్ క్లీన్‌రూమ్ (జనవరి 10) వచ్చే వారం ఎంట్రీ ఇవ్వబోతున్నాయి.

## స్టాక్ మార్కెట్లలో అదరగొట్టిన డీమార్ట్. 11 శాతం లాభంతో ముగిసిన షేర్..!



**ముంబై - నవభూమి:** డీ-మార్ట్ పేరుతో రిటైల్ చైన్ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్కెట్స్ శుక్రవారం స్టాక్ మార్కెట్లలో అదరగొట్టింది. 2024 డిసెంబర్ నెలతో ముగిసిన త్రైమాసికంలో స్టాండలోన్ ఆదాయం 17.5 శాతం సాధించినట్లు రిపోర్ట్ చేయడంతో డీ-మార్ట్ షేర్ 11 శాతానికి పైగా పెరిగింది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో డీ-మార్ట్ షేర్ రూ.4,023.25ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్ లో 15.12 శాతం వృద్ధితో రూ.4,165 వరకూ దూసుకెళ్లింది. మరోవైపు ఎన్ఎస్ఈలోనూ 11 శాతం లబ్ధి పొంది రూ.4,011.90 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 15.36శాతం పుంజుకుని రూ.4,165.90 వరకూ దూసుకెళ్లింది. బీఎస్ఈలో డీ-మార్ట్ షేర్లు 6.82 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 92.84 లక్షల షేర్లు ట్రేడయ్యాయి. 2024 డిసెంబర్ నెలాఖరుతో ముగిసిన త్రైమాసికంలో డీ-మార్ట్ 17.5 శాతం వృద్ధితో రూ.15,565.23 కోట్ల స్టాండలోన్ రెవెన్యూ సంపాదించింది. ఏడాది క్రితం 2023 డిసెంబర్ త్రైమాసికంలో రూ.13,247.33 కోట్ల ఆదాయం సముపార్జించింది. దేశవ్యాప్తంగా 387 డీ-మార్ట్ షేర్లు ఉన్నాయని అవెన్యూ సూపర్ మార్ట్స్ శుక్రవారం బీఎస్ఈ ఫైలింగ్‌లో తెలిపింది. డీ-మార్ట్‌లో బేసిక్, గృహ వినియోగ వస్తువులు, పర్సనల్ కేర్ వస్తువులు విక్రయిస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ-ఎన్సీఆర్, తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో డీ-మార్ట్ స్టోర్లు విస్తరించి ఉన్నాయి. దీనికి రాధాకిషన్ దమానీ కుటుంబం ప్రమోటర్‌గా ఉంది.

## ఎస్బీఐ సరికొత్త డిపాజిట్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** డిపాజిట్‌దారులను ఆకర్షించేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రెండు సరికొత్త డిపాజిట్ పథకాలను పరిచయం చేసింది. హర్ ఘర్ లఖ్‌పతి, ప్యాట్రాన్స్ పేరిట వీటిని ప్రారంభించినట్లు శుక్రవారం బ్యాంక్ ప్రకటించింది. ఖాతాదారుల ఆర్థిక అవసరాలు ఇంకా సౌకర్యవంతంగా తీరేలా, మరింత విలువతో ఈ నయా స్కీములను రూపొందించింది.ఇదో ప్రీ-కాలిక్యులేటెడ్ రికరింగ్ డిపాజిట్ పథకం. లక్ష రూపాయలు, ఆపై మొత్తాలను కస్టమర్లకు అందించేలా ఈ స్కీమును డిజైన్ చేసినట్టు ఓ ప్రకటనలో ఎస్బీఐ స్పష్టం చేసింది. ఈ డిపాజిట్‌తో కస్టమర్ల ఆర్థిక లక్ష్యాలు సులభంగా తీరుతాయని, ఆర్థిక ప్రణాళిక-పొదుపు మరింత ప్రభావవంతంగా ఉంటాయన్నది. ఎఫ్‌డీపై అమల్లో ఉన్న వడ్డీరేట్లే దీనికీ ఉంటాయి. ప్రస్తుతం ఏడాదికిపైగా కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై 6.80 శాతం, రెండేండ్లకుపైగా కాలపరిమితి ఎఫ్‌డీపై 7 శాతం, 3-5 ఏండ్ల ఎఫ్‌డీలపై 6.75 శాతం, 5-10 ఏండ్ల ఎఫ్‌డీలపై 6.5 శాతం వడ్డీరేట్లున్నాయి. రికరింగ్ డిపాజిట్ల కనీస కాలపరిమితి సంవత్సరం. గరిష్ఠం 10 ఏండ్లు.

**ప్యాట్రాన్స్:** 80 ఏండ్లు, ఆపై వయసు కలిగినవారి కోసం ఈ పథకాన్ని ఎస్బీఐ ప్రత్యేకంగా తీసుకొచ్చింది. ఇందులో సీనియర్ సిటిజన్లకు మరింత వడ్డీరేటు లభిస్తుంది. అదనంగా మరో 10 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు వర్తిస్తుంది. ప్రస్తుత, కొత్త టర్మ్ డిపాజిట్ కస్టమర్లకు ఈ పథకం అందుబాటులో ఉంటుందని ఎస్బీఐ తెలియజేసింది. ముఖ్యంగా ఎప్పట్నుంచో బ్యాంక్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్న వృద్ధులకు లాభం చేకూర్చాలనే దీన్ని రూపొందించామని పేర్కొన్నది. కాగా, డిపాజిట్లలో ఎస్బీఐ మార్కెట్ వాటా 23 శాతంగా ఉన్నది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రకటించిన ఈ రెండు డిపాజిట్లతో మార్కెట్‌లో మరింత వాటాను అందిపుచ్చుకుంటామన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఎన్ఆర్ఈ, ఎన్ఆర్‌వో ఖాతాలను తెరిచేందుకు ఎన్నారైల కోసం ఓ ట్యాబ్ ఆధారిత ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ఆన్-బోర్డింగ్ ప్రక్రియను ఎస్బీఐ ప్రకటించింది. దేశంలోని అన్ని ఎస్బీఐ శాఖల్లో, ఎంపిక చేసిన కొన్ని విదేశీ కార్యాలయాల్లో ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది.

## ఐఐటీహెచ్‌తో జట్టుకట్టిన సింగరేణి

### గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తెలంగాణ: భట్టి



**సంగారెడ్డి-నవభూమి:** తెలంగాణను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీలో శుక్రవారం ఇండియా-ఆస్ట్రేలియా క్రిటికల్ మినరల్స్ హబ్ రెండురోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఖనిజ అన్వేషణ, టెక్నాలజీ బదలాయింపులపై సింగరేణి, ఐఐటీ హైదరాబాద్(ఐఐటీ-హెచ్) మధ్య అధికారిక ఒప్పంద కూడా జరిగింది. ఇందుకు సంబంధించి భట్టి విక్రమార్క సమక్షంలో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. 2030 నాటికి తెలంగాణలో 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. క్లిష్టమైన ఖనిజాల వెలికితీత కోసం ఇండియా-ఆస్ట్రేలియా కలిసి పనిచేయనుండటం సంతోషంగా ఉన్నదని, రెండు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఖనిజాల వెలికితీతకు స్థిరమైన మైనింగ్ పద్ధతులను కొనుగోనాలని ఆయన సూచించారు. తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా ఖనిజాల వెలికితీతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

## రాష్ట్రంలో బ్లాక్ చైన్ సిటీ నిర్మాణం

### రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే విషయంపై సంబంధిత వర్గాలు, నిపుణులతో సంప్రదింపులు ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో సెంటిలియన్ నెట్‌వర్క్స్ అండ్ హెచ్‌సీ రోబోటిక్స్ కొత్త క్యాంపస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్న ఏఐ యూనివర్సిటీకి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ప్రారంభిస్తామని వివరించారు.

## నాలుగో రోజు పెరిగిన బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరాయంటే..



**ముంబై - నవభూమి:**కొత్త సంవత్సరం మొదలైనప్పటి నుంచి బంగారం(, వెండి ధరలు నిరంతరంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే వీటి ధరలు వరుసగా నాలుగో రోజు కూడా పెరిగాయి. ఇక నేడు (డిసెంబర్ 4న) శనివారం ఉదయం 6.30 గంటల నాటికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 79,360గా ఉంది. మరోవైపు 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 72,760కు చేరుకుంది. ఇక వెండి ధరల గురించి మాట్లాడితే ఈ రోజు వెండి ధరల్లో స్వల్ప మార్పు జరిగింది. నేడు కిలో వెండి ధర 92,600 రూపాయలు. కాగా ఇది నిన్న రూ.92,500గా ఉంది. అయితే రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

దేశంలోని ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ గోల్డ్ రేట్, 24 క్యారెట్ గోల్డ్ రేట్ (రూపాయల్లో)
చెన్నైలో రూ. 72,610 రూ. 79,210
ముంబైలో రూ. 72,610 రూ. 79,210
ఢిల్లీలో రూ. 72,760 రూ. 79,360
కోల్‌కతాలో రూ. 72,610 రూ. 79,210
బెంగళూరులో రూ. 72,610 రూ. 79,210
హైదరాబాద్‌లో రూ. 72,610 రూ. 79,210
విజయవాడలో రూ. 72,610 రూ. 79,210
కేరళలో రూ. 72,610 రూ. 79,210
పూణేలో రూ. 72,610 రూ. 79,210
వడోదరలో రూ. 72,610 రూ. 79,210

హాల్‌మార్క్ ఉన్నవి కొంటున్నారా లేదా
బంగారాన్ని కొనుగోలు చేసేటప్పుడు, ప్రజలు దాని నాణ్యతను గుర్తుంచుకోవాలి. కస్టమర్‌లు హాల్‌మార్క్ గుర్తును చూసిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలి. హాల్‌మార్క్ అనేది బంగారంపై ప్రభుత్వ హామీ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్‌మార్క్‌ని నిర్ణయిస్తుంది.

**బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలా?**
బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్కులు ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని రాసి ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారంలో 9% రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను కలపడం ద్వారా ఆభరణాలను తయారు చేస్తారు.

## ఉబర్ క్యాబ్ డ్రైవర్ వల్ల ఫ్లైట్ మిస్.. రూ.54 వేలు చెల్లించాలని ఆదేశం..



**ముంబై - నవభూమి:**ప్రస్తుతం మహానగరాల్లో ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్లాలన్నా చాలా మంది ఓలా, ఉబర్ వంటి ఆన్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ సేవలను వాడుకుంటున్నారు. మొబైల్‌లో యాప్ ద్వారా బుక్ చేస్తే నిమిషాల వ్యవధిలో వచ్చే క్యాబ్‌లు నిర్దిష్ట సమయానికే గమ్య స్థానానికి చేర్చుతాయి. అయితే కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులపాలవుతున్నారు. ఢిల్లీ కి చెందిన ఓ వ్యక్తి అలాంటి సమస్యనే ఎదుర్కొన్నాడు. దాంతో సదరు సంస్థపై న్యాయపోరాటానికి దిగాడు. మూడేళ్ల పోరాటం తర్వాత అతడికి అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది.ఢిల్లీకి చెందిన ఓ వైద్యుడు తెల్లవారుఝామున మూడు గంటలకు ఉబర్ క్యాబ్‌ను బుక్ చేసుకున్నాడు. బుక్ అయిన క్యాబ్ ఎంతకీ రాలేదు. కాల్ చేస్తే సదరు క్యాబ్ డ్రైవర్ రాలేదు. ఉబర్ ఇండియా కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసినా ఎలాంటి స్పందనా లేదు. దీంతో అప్పటికప్పుడు వేరే ట్యాక్సీ మాట్లాడుకుని ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. అయితే అప్పటికే అతడు ఎక్కాల్సిన విమానం వెళ్లిపోయింది. దీంతో ఆ తర్వాత విమానానికి టికెట్ బుక్ చేసుకుని వెళ్లాడు. తాను సకాలంలో విమానం అందుకోలేకపోవడానికి కారణమైన ఉబర్ ఇండియాపై జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు.
ఈ కేసు మీద మూడేళ్ల పాటు కోర్టులో విచారణ జరిగింది. ఉబర్ ఇండియా సేవా లోపం కారణంగానే వినియోగదారుడికి సమస్య ఎదురైందని కోర్టు అంగీకరించింది. విమానాన్ని అందుకోలేకపోవడమే కాకుండా, అధిక ధరకు మరో టిక్కెట్టు కొనుక్కోవాల్సి వచ్చిందని, దీనికి ఉబర్ ఇండియా సేవా లోపం కారణమని కోర్టు ఓ అభిప్రాయానికి వచ్చింది. దాంతో అదనపు టిక్కెట్టు ధర రూ.20 వేలు, మానసిక ఒత్తిడి ఎదుర్కొన్నందుకు రూ.30 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఆ డబ్బులను 45 రోజుల్లోగా చెల్లించాలని సూచించింది. ఆ గడువు లోగా చెల్లించలేకపోతే రూ.6 శాతం వడ్డీతో కట్టాల్సి ఉంటుందని పేర్కొంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
7 హైదరాబాద్ శనివారం 04 | జనవరి | 2025



## బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు.. ఆరుగురు సజీవదహనం



తమిళనాడు విరుదునగర్ జిల్లా చతుర్ సమీపంలోని పొమ్మియాపురంలో సాయినాథ్ బాణసంచా ఫ్యాక్టరీలో ఈరోజు (జనవరి 4న) భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈరోజు ఉదయం బాణాసంచా తయారీకి రసాయనాలు కలుపుతుండగా 9.40 గంటల సమయంలో రాపిడి కారణంగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ పేలుడు కారణంగా నాలుగు గదులు నేలమట్టమయ్యాయి. ఆ గదుల్లో ఉన్న ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే కాలిపోయారు. పేలుడు సమాచారం అందుకున్న శివకాశి, చతుర్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే పనిలో నిమగ్నమయ్యాయి.
నలుగురిపై కేసు నమోదు..వాచక్కరపట్టి పోలీస్ స్టేషన్ పరిధిలోని పొమ్మియాపురం గ్రామంలో సాయినాథ్ ఫైర్ వర్క్స్ పేరుతో బాలాజీ అనే వ్యక్తి పటాకుల ఫ్యాక్టరీని నడుపుతున్నాడు. ఇదిలా ఉండగా.. నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సరైన భద్రత లేకుండా కార్మికులను పనిలో పెట్టుకోవడం వంటి 5 సెక్షన్ల కింద ఫ్యాక్టరీ యజమానులు బాలాజీ, శశిపాలన్, మేనేజర్ దాస్, ఫోర్‌మెన్ ప్రకాష్ సహా నలుగురిపై వచ్చకర పట్టి పోలీసులు కేసు నమోదు చేశారు. పటాకుల తయారీకి సంబంధించిన ముడిసరుకులను ఉంచిన గదిలోనే పేలుడు సంభవించినట్లు విచారణలో తేలింది. ఆ సమయంలో పలువురు పటాకుల తయారీలో నిమగ్నమై ఉండగా.. ఆ గదుల్లో పనిచేస్తున్న 6 మంది కూలీలు మృతి చెందారు.

## ఆర్మీ వాహనం లోయలో పడి ఇద్దరు జవాన్లు మృతి



**శ్రీనగర్–నవభూమి:** నార్త్ కశ్మీర్‌లోని బండిపొర జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆర్మీ వాహనం ప్రమాదవశాత్తూ లోయలో పడి ఇద్దరు జవాన్లు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం ఉదయం సైనికులతో వెళ్తున్న వాహనం ఎస్‌కే పయీన్ ప్రాంతంలో మలుపు తిరుగుతుండగా రోడ్డుపై నుంచి జారి కిందనే ఉన్న లోయలో పడింది. రోడ్డు జారుడుగా ఉండటంతో వాహనం అదుపుతప్పి ప్రమాదం చోటుచేసుకుందని, స్థానికులు, సహాయక బృందాలు వెంటనే అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారని అధికారులు తెలిపారు. గాయపడిన వారిని వాహనం నుంచి బయటకు తీసి జిల్లా ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ఆసుపత్రికి తరలిస్తుండగా ఇద్దరు జవాన్లు మృతి చెందినట్టు చెప్పారు. తీవ్రంగా గాయపడిన వారిని అడ్వాన్స్ మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం శ్రీనగర్ ఆసుపత్రికి తరలించామన్నారు. ప్రమాద ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

## కేజ్రీవాల్ మరో కీలక హామీ



**న్యూఢిల్లీ–నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీమధ్య రాజకీయాలు వేడెక్కుతున్నాయి. బీజేపీ కేవలం ప్రతికూల విమ ర్శలు, ఇతరులను అవమానించడం ద్వారా మాత్రమే ఎన్నికల్లో గెలవాలనుకుం టోందని, ఆప్ మాత్రం పదేళ్లు చేసిన పనుల ఆధారంగా ఓట్లు కోరుతోందని ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ వాసులు తప్పుడు నీటి బిల్లులు వస్తే వాటిని కట్టవద్దని, ఆప్ ప్రభుత్వం 2025లో తిరిగి అధికారంలోకి రాగానే ఆ బిల్లులను రద్దు చేస్తుందని ఆయన మరో కీలక హామీ ఇచ్చారు.
"గత పదేళ్లుగా మా ప్రభుత్వం ఢిల్లీలో ఉచిత నీటిని అందిస్తోంది. 12 లక్షలకు పైగా కుటుంబాలకు జీరో వాటర్ బిల్లులు వస్తున్నాయి. అయితే నేను జైలుకు వెళ్లాక ఏమి జరిగిందో నాకు తెలియదు. వాళ్లు ఏదో తప్పు చేశారు. ప్రజలకు వేలు, లక్షల్లో ప్రతినెలా నీటి బిల్లులు వస్తున్నాయి. తప్పుడు బిల్లులు వస్తున్నాయని అనుకుంటున్న వాళ్లు నీటి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని నేను బహిరంగంగా, అధికారికంగా ప్రకటిస్తున్నాను. ఓపికతో వేచిచూడండి. ఎన్నికల తర్వాత ఆప్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తప్పుడు బిల్లులన్నింటినీ రద్దు చేస్తుంది. ప్రజలందరికీ ఇది నా హామీ.. ఇందుకు నేను గ్యారెంటీ" అని కేజ్రీవాల్ తెలిపారు.

**కాంగ్రెస్–బీజేపీ పొత్తు పెట్టుకుంటే మేలు**

కాంగ్రెస్ పార్టీపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పిస్తూ, ఆ పార్టీ ప్రజలకు దూరమైందని, ప్రజాసమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కొరవడిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ప్రజావిశ్వాసం కోల్పోయినందున వారు కూటమిగా ఏర్పడాలని సూచించారు. కాంగ్రెస్ ఊసే ప్రజలు ఎత్తడం లేదన్నారు. ఢిల్లీలో బీజేపీ విపత్తులో ఉందని, ఆ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థి కానీ, ఎజెండా కానీ, ఒక విజన్ కానీ లేవని విమర్శించారు.


## ఖర్గే రాజీనామా చేసే వరకు పోరాటం..

**బెంగళూరు–నవభూమి** కాంట్రాక్టర్ సచిన్ పంచాళ ఆత్మహత్య వెనుక మంత్రి ప్రియాంక ఖర్గేపాత్ర ఉందనే అనుమానం ఉందని నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డేరి వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ డెత్‌నోట్‌లో మంత్రి ప్రియాంక ఖర్గే పీఏ రాజు కపనూర పేరు స్పష్టంగా పేర్కొన్నారని అయినా కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మంత్రి పోలీసుశాఖపై ఒత్తిడి తెచ్చి తన పీఏకు రక్షణగా నిలిచారన్నారు. తద్వారా కాంట్రాక్టర్ ఆత్మహత్యకు మంత్రి ప్రియాంక ఖర్గే, కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రేపు మంత్రి ఖర్గే గుల్బర్గాలోని ఇంటిని ముట్టడించి నిరసన చేపట్టేందుకు పార్టీ సిద్ధమైందన్నారు. ఈ అంశంపై నిరసనకు వచ్చేవారికి కాఫీ, బిస్కట్ ఇస్తామంటూ మంత్రి ఖర్గే నిర్లక్ష్యంగా వ్యాఖ్యానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి రాజీనామా చేసేంతవరకు బీజేపీ పోరాటం ఆగదన్నారు. బెంగళూరు గ్రామీణ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటే అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. వాల్మీకి కార్పొరేషన్‌లో అవినీతి, ముడా ఇళ్లస్థలాల్లో అక్రమాలు, వక్ఫ్‌బోర్డు వ్యవహారం, బాలింతల మృతి ఇలా వరుసగా వైఫల్యాలు వెలుగులోకి వచ్చాయన్నారు. అవినీతి ప్రభుత్వం తొలగేంతవరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. మీడియా సమావేశంలో నగరసభ సభ్యుడు బంతి వెంకటేశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అణు' శక్తిమంతుడు ఇక లేరు!

**న్యూఢిల్లీ–నవభూమి:** భారత అణు కార్యక్రమ రూపశిల్పి రాజగోపాల చిదంబరం (88) మరణించారు. ముంబైలోని జస్‌లోక్ ఆస్పత్రిలో అనారోగ్యంతో ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిని భారత్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (బీఏఈ) సంస్థ ధ్రువీకరించింది. భారత్ జరిపిన రెండు అణు పరీక్షల్లోనూ అణుశాస్త్రవేత్తగా ఆయన పాలుపంచుకోవడం విశేషం. రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో 1974లో ఒకటి, మరో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సారథ్యంలో 1998లో మరొకటి జరపడం అప్పట్లో సంచలనం రేపింది. దేశంలో అణ్వాయుధ కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడంలోనూ చిదంబరం పాత్ర ఉంది. కేంద్ర ప్రభుత్వానికి శాస్త్రీయ ముఖ్య సలహాదారుగాను, పలు సంస్థలకు సారథిగాను 17 ఏళ్లు చిదంబరం సేవలు అందించారు. తమిళనాడులో 1936లో రాజగోపాల చిదంబరం జన్మించారు.

# ఈవీలకు సబ్సిడీలు అవసరం లేదు.. వారే స్వయంగా చెప్పారు



**న్యూఢిల్లీ–నవభూమి:** ఎలక్ట్రిక్ వాహనాల రంగం భారత్‌లో సిద్ధంగా ఉందని, కొత్త సబ్సిడీలు అవసరం లేదని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. బ్యాటరీ ఖర్చులు తగ్గడంతో, ఈవీ వాడకం ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉందని ఆయన చెప్పారు. ఇంకా ఏం చెప్పారనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.
దేశంలో ఎలక్ట్రిక్ వాహనాలకు కొత్త సబ్సిడీ లేదా ప్రోత్సాహకాలు అవసరం లేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈరోజు తెలిపారు. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగం ఇప్పటికే సిద్ధమైందన్నారు. ఈ క్రమంలో కొత్త ప్రోత్సాహకాలు అవసరం లేదన్నారు. ఎందుకంటే మొత్తం వ్యవస్థను వేగవంతం చేయడానికి ఇప్పటికే ఉన్న ప్రోత్సాహకాలు సరిపోతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. పెట్రోల్–డీజిల్ ఇంజిన్‌లతో కూడిన వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని ఎలక్ట్రిక్ మొబిలిటీ చూపుతుందని గోయల్ ప్రస్తావించారు.

**ప్రస్తుత రాయితీ..**

బ్యాటరీ ఖర్చులు కూడా తగ్గాయని, బ్యాటరీ మార్పిడి సదుపాయంతో ఎలక్ట్రిక్ వాహనాన్ని సొంతం చేసుకోవడం వల్ల ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం అనేక ఆటోమొబైల్ కంపెనీలు, స్టార్టప్‌లతో కూడా మాట్లాడింది. చర్చల సందర్భంగా పరిశ్రమలో పాల్గొన్నవారు సబ్సిడీ అవసరాన్ని ఏకగ్రీవంగా తిరస్కరించారని గోయల్ అన్నారు. ప్రస్తుత రాయితీ విధానం ముగిసిన తర్వాత ఎవరికీ రాయితీ అవసరం లేదని వారందరూ ఒకే అభిప్రాయంతో ఉన్నారని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. చాలా మంది యువత రాకతో స్టార్టప్ రంగంలో ఉత్సాహం కనిపిస్తోందని గోయల్ చెప్పారు.

**ఇష్టపడే గమ్యస్థానం**

స్టార్టప్‌లు సమస్యలకు కొత్త పరిష్కారాలను తీసుకువస్తున్నాయి. అదే సమయంలో వారు ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తున్నారు. ప్రస్తుతం 110 కంటే ఎక్కువ యునికార్న్‌లతో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ ఉంది. క్విక్ కామర్స్ స్టార్టప్ సెక్టార్ యునికార్న్ జెప్టో తన హెూల్డింగ్ కంపెనీని సింగపూర్ నుంచి భారతదేశానికి తిరిగి తీసుకువస్తోంది. ఇలా అనేక ఇతర కంపెనీలు కూడా అదే పని చేయబోతున్నాయి. దీనిపై గోయల్ మాట్లాడుతూ ఇది మంచి సంకేతమని, భవిష్యత్తులో, స్టార్టప్‌లకు భారతదేశం ఇష్టపడే గమ్యస్థానంగా మారుతుందన్నారు.

**చట్టాలను పాటించాలి**

స్టార్టప్‌లకు ప్రభుత్వం సహాయం మరియు మద్దతు ఇస్తోందని గోయల్ చెప్పారు. 43 శాతం స్టార్టప్‌లలో కనీసం ఒక మహిళా సహ వ్యవస్థాపకులు లేదా డైరెక్టర్లు ఉన్నారని, దీని కారణంగా స్టార్టప్‌లలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందని ఆయన అన్నారు. అయితే ఆయా సంస్థలు చట్టాలను పూర్తిగా పాటించేలా చూసుకోవాలని సూచించారు. ఎలాంటి చట్టాన్ని ఉల్లంఘించకూడదన్నారు. దీనికి ముందు కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఉత్పత్తి వ్యయం చాలా తగ్గింది. ప్రజలు ఇప్పుడు వాహనాలను కొనుగోలు చేయడం ప్రారంభించినందున సబ్సిడీ డిమాండ్ ఇకపై సమర్థించబడదన్నారు.

### ప్రముఖ జర్నలిస్ట్, యూట్యూబర్ దారుణ హత్య..

# సెప్టిక్ ట్యాంక్‌లో శవం..



**న్యూఢిల్లీ–నవభూమి:** ఛత్తీస్‌గఢ్ బీజాపూర్‌కు చెందిన యువ జర్నలిస్ట్, యూట్యూబర్ ముఖేష్ చంద్రకర్ దారుణ హత్యకు గురయ్యాడు. జనవరి 1వ తేదీ రాత్రిన ఇంటి నుంచి అదృశ్యమైన చంద్రకర్.. బీజాపుర్‌లోని కాంట్రాక్టర్ సురేష్ చంద్రకర్ ఇంటి ఆవరణలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో శవమై తేలాడు. సోదరుడు యుకేష్ చంద్రకర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు అసలు నిజం వెలికితీశారు. కాంట్రాక్టర్ సురేష్‌కు సంబంధించిన స్థలంలోనే ముఖేష్ చంద్రకర్ మృతదేహం లభ్యం కావడంతో అతడినే ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్నారు పోలీసులు. ఈ హత్యకు సంబంధించి ముగ్గురి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం ముఖేష్ చంద్రకర్ కనిపించకుండా పోవడంతో సోదరుడు యుకేష్ చంద్రకర్ మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తర్వాత ముఖేష్ మొబైల్ నంబర్‌ను ట్రాక్ చేసి కాంట్రాక్టర్ సురేష్ చంద్రకర్‌కు చెందిన స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడే ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పరిశీలించగా ముఖేష్ మృతదేహం లభ్యమైంది. ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి పేర్లు మాత్రం వెల్లడించలేదు.

**ముఖేష్ చంద్రకర్ ఎవరు?**

33 ఏళ్ల ముఖేష్ చంద్రకర్ ఎన్‌డిటివి సహా అనేక వార్తా ఛానెల్‌లకు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేశారు. 2021 ఏప్రిల్‌లో బీజాపూర్‌లోని తకల్‌గూడ నక్సల్స్ ఆకస్మిక దాడిలో కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను మావోయిస్టుల చెర నుంచి విడిపించడంలో పాత్ర పోషించారు. 'బస్తర్ జంక్షన్' పేరిట ముఖేష్ నిర్వహిస్తున్న యూట్యూబ్ ఛానెల్‌కు 1.59 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇటీవల జిల్లాలో రోడ్డు నిర్మాణ పనుల్లో అవకతవకలు జరిగాయని ఇచ్చిన నివేదిక వల్లే హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

**చంద్రకర్ హత్యపై నిరసనలు**

హత్యకు పాల్పడిన కాంట్రాక్టర్‌తో పాటు ఇతరులకు మరణశిక్ష విధించాలని జర్నలిస్టులు రాస్తారోకో నిర్వహించారు. అతడికి సంబంధించిన సెక్యూరిటీ వివరాలను తొలగించి బ్యాంకు ఖాతాలకు సీజ్ వేయాలని డిమాండ్ చేశారు. పోలీసు సూపరింటెండెంట్‌ను సస్పెండ్ లేదా బదిలీ చేయాలని కోరారు.
యువ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ హత్యపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో నేరాలకు, నేరస్థులకు చోటు లేదని, ముఖేష్‌ను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జర్నలిస్ట్‌ను చంపిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని సీఎం సాయి అన్నారు.

## ప్రభుత్వ వ్యతిరేకత ఉంది.. కాంగ్రెస్సే ప్రత్యామ్నాయం



**న్యూఢిల్లీ–నవభూమి** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయం కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీ అభ్యర్థి అల్కా లంబా అన్నారు. ఆప్, బీజేపీలు ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కొంటున్నందున ఢిల్లీలోని వాతావరణ కాలుష్యం, నేరాలు, పాలన వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం కాంగ్రెస్‌కే ఉందని చెప్పారు. ఢిల్లీలోని కాలుష్యంతో పోరాడే రోడ్‌మ్యాప్ తమ పార్టీ వద్ద ఉందని శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. కల్కాజీ నియోకవర్గం నుంచి ముఖ్యమంత్రి అతిషిపై అల్కా లంబా పోటీ చేస్తున్నారు. "కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో ప్రయోజనాలు చేకూర్చింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాం. 2000 నుంచి 2500 ఆర్థిక సాయం నేరుగా బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తున్నాం" అని అల్కాలంబా తెలిపారు. కాంగ్రెస్ 140 సంవత్సరాల పార్టీ అని, అటు అధికారంలోనూ ఇటు ప్రతిపక్షంలోనూ కూడా ఉందని తెలిపారు. షీలాదీక్షిత్ (మాజీ సీఎం) ఫ్లైఓవర్లు నిర్మించి ఉండకపోతే ఢిల్లీలో ప్రతిచోటా ట్రాఫిక్ జామ్‌లే ఉండేవని అన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో వృద్ధులు, పిల్లలు విషవాయువులు పీల్చాల్సి వస్తోందని, అంటువ్యాధుల భయం కూడా కనిపిస్తోందని, కాలుష్య నివారణకు తమ వద్ద సమగ్ర రోడ్ మ్యాప్ ఉందని చెప్పారు.

**శాశ్వత పరిష్కారం కావాలి**

ఒక వేవ్‌లా 2015, 2020లో ఆప్‌కి ఢిల్లీలో సీట్లు వచ్చాయని, దాని ఫలితం ఇవాళ ఢిల్లీ కాలుష్యం బారినపడిందని అల్కాలంబా అన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం కావాలన్నారు. ఢిల్లీ నేరాల రాజధానిగా మారిందని, దానికి కూడా శాశ్వత పరిష్కారం అవసరమని చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రిని తాత్కాలిక ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ చెప్పడాన్ని అల్కా లంబా తప్పుపట్టారు. రాజ్యాంగ పదవిలో ఉన్న మహిళ పట్ల చూపాల్సిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.
"నేను ఎన్నికల్లో పోటీ చేయడం ఇది ఐదోసారి. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో సిట్టింగ్ సీఎంను టెంపరరీ సీఎం అని సంబోధించడం నేను ఎప్పుడూ చూడలేదు. అందులోనూ ఒక మాజీ సీఎం ఈ విధంగా మాట్లాడటం మహిళల గౌరవాన్ని కించపరచడమే అవుతుంది" అని అన్నారు. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ఎన్నికల తేదీని ఈసీ త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.

## మణిపూర్‌లో తాజా అల్లర్లు.. బాధ్యత నుంచి మోదీ తప్పించుకోలేరన్న ఖర్గే



**న్యూఢిల్లీ–నవభూమి** మణిపూర్ నిరంతరం హింసాత్మక ఘటనలతో రగులుతుండటం వెనుక బీజేపీకి స్వప్రయోజనాలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజధర్మాన్ని పాటించనందున రాజ్యాంగపరమైన తప్పిదం నుంచి ఆయన తప్పించుకోలేరని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. "సరిహద్దు రాష్ట్రం నిరంతరం రగులుతూ ఉండేలా చేయడంలో బీజేపీకి ఏవో స్వప్రయోజనాలు ఉన్నాయి. బీజేపీ మ్యాచ్‌స్టిక్‌తో మణిపూర్ రగులుతోంది" అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఖర్గే ఆరోపించారు. మణిపూర్‌లో తాజా హింసాత్మక ఘటనకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను కూడా ఆయన షేర్ చేశారు. "నరేంద్ర మోదీ జీ.. మీరు చివరిసారిగా ఓట్లు అడిగేందుకు 2022 జనవరిలో మణిపూర్ వెళ్లారు. 2023 మేలో హింసాత్మక ఘటనలు మొదలయ్యాయి. 600 రోజుల గడిచిపోయాయి. రాష్ట్రంలో ఒక్కో గ్రామం తుడిచిపెట్టుకు పోతోందని శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా మీడియా కథనాల్లో వెల్లడవుతోంది. మీ అసమర్థ ముఖ్యమంత్రి రాష్ట్రంలో హింసాకాండకు క్షమించమని అడుగుతుంటారు. మీరు రాష్ట్రానికి రాకపోవడాన్ని మాత్రం ఆయన దాటవేస్తుంటారు" అని ఖర్గే అన్నారు. మణిపూర్ విషయంలో బీజేపీ స్వప్రయోజనాలు చూసుకుంటోందని పదేపదే తాము బాధ్యతాయుతంగా చెబుతూ ఉన్నామని ఖర్గే తెలిపారు. మణిపూర్ హింసాకాండలో 250 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోగా, 60,000 మంది నిరాశ్రయులయ్యారని, 20 నెలలుగా వారు తాత్కాలిక శిబిరాల్లోనే జీవనం సాగిస్తున్నారని అన్నారు. మణిపూర్‌లో శాంతి, యథాపూర్వ పరిస్థితి నెలకొనేలా చూడటం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసినట్టు తెలిపారు.
"మణిపూర్‌లో ఇండియా కూటమి సైతం డిసెంబర్ 6న మీకు (ప్రధానికి) మూడు విజ్ఞప్తులు చేసింది. 2024 ముగిసేలోపు మణిపూర్‌ను సందర్శించాలని కోరాం. కానీ మీరు ఆపని చేయలేదు. అఖిల పక్ష నేతలతో ఢిల్లీలోని మీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయమని రిక్వెస్ట్ చేశాం. అది కూడా చేయలేదు. మణిపూర్ అంశాన్ని నేరుగా మీరే చూసుకోవాలని కోరాం. ఆ పని కూడా చేసినట్టు కనిపించడం లేదు. మా విజ్ఞప్తుల్లో ఒక్కటైనా పట్టించుకోకుంటే మీరు రాజధర్మాన్ని పాటించనట్టే అవుతుంది. రాజ్యాంగ తప్పిదం నుంచి మీరు తప్పించుకోలేరు" అని ఖర్గే ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

**మణిపూర్‌లో తాజా హింస**


మణిపూర్‌లోని ఇంఫాల్ ఈస్ట్ జిల్లా కాంగ్పోక్పిలో శుక్రవారంనాడు కొందరు ఎస్పీ కార్యాలయంలో మూకమ్మడి దాడికి దిగారు. సైబల్ గ్రామం నుంచి కేంద్ర బలగాలను ఉపసంహరించడంలో ఎస్పీ కార్యాలయం విఫలమైందని ఆరోపిస్తూ జరిపిన ఈ దాడిలో ఎస్పీ గాయపడ్డారు. భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువైపులా పలువురు గాయపడ్డారు. సైబల్ గ్రామంలోని మహిళలపై డిసెంబర్ 31న భద్రతా బలగాలు లాఠీచార్జి చేశారని కుకీ సంస్థలు ఆరోపిస్తున్నాయి.

## ఢిల్లీ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల..



**న్యూఢిల్లీ–నవభూమి** వచ్చే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ 29 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో బీజేపీ న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పర్వేష్ వర్మను బరిలోకి దింపింది. ఆప్ అభ్యర్థి అరవింద్ కేజ్రీవాల్‌పై పర్వేష్ వర్మ పోటీ చేయనున్నారు. ఈ స్థానంలో సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. మరోవైపు దుష్యంత్ గౌతమ్ కరోల్ బాగ్ నుంచి, మంజిందర్ సింగ్ సిర్సా రాజౌరీ గార్డెన్ నుంచి, కైలాష్ గెహ్లాట్ బిజ్వాసన్ నుంచి పోటీ చేయనున్నారు. కరోల్ బాగ్ నుంచి దుష్యంత్ గౌతమ్, రాజౌరీ గార్డెన్ నుంచి మంజిందర్ సింగ్ సిర్సా, బిజ్వాసన్ నుంచి కైలాష్ గెహ్లాట్, గాంధీ నగర్ నుంచి అరవిందర్ సింగ్ లవ్లీ సహా పలువురికి టిక్కెట్లు ఇవ్వబడ్డాయి.

## కడుపుకోత.. పశువులకు మేత



**బళ్లారి(బెంగళూరు): నవభూమి** రెండు నెలల క్రితం కిలో రూ.50..60 పలికిన టమోటా ధర... అమాంతం పడిపోవడంతో రైతులకు ఆవేదనే మిగిలింది. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి సాగు చేసిన టమోటాకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్ళలేక చెత్తకుప్పలో పడేసిన దృశ్యం బళ్ళారి ఏపీఎంసి మార్కెట్(లో గురువారం చోటు చేసుకుంది. బళ్లారి( చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు పొరుగున్న ఉన్న అనంతపురం( జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో టమోటా పంట భారీగా సాగు చేయడంతో టమోటా భారీగా బళ్ళారి ఏపీఎంసీకి చేరుకుంటోంది. 20కిలోల బాక్సు టమోటా ధర గత నెల రూ 400 నుంచి రూ 500 పలుకగా నేడు బాక్సు ధర రూ.50కు పడిపోయింది. దీంతో కనీసం పెట్టుబడి కూడా చేతికి రాదని టమోటా రైతు కన్నీరు పెడుతున్నారు. చెత్తకుప్పలో పడేసిన టమోటా పశువులకు మేతగా మారిన దృశ్యాలు కనిపించాయి.

## నటి ఖుష్బూ అరెస్ట్.. విషయం ఏంటంటే..



**న్యూఢిల్లీ–నవభూమి** అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై డీఎంకే ప్రభుత్వం నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తుందంటూ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమారతి నేతృత్వంలో బీజేపీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు, ప్రముఖ నటి ఖుష్బూ ఆధ్వర్యంలో మదురైలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. మదురై నుంచి చెన్నై వరకు ర్యాలీ చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసుల అనుమతి లేకుండా ఈ నిరసన జరుపటంతో ఖుష్బూ సహా అందరినీ అరెస్టు చేశారు. మహిళా మోర్చా కార్యకర్తలు ఓ భారీ వ్యాన్‌లో బయలుదేరటానికి సిద్ధమయ్యారు. ఆ వ్యాన్ యాత్రకు ఖుష్బూ జెండా ఊపి ప్రారంభించారు. అనుమతి లేకుండా జరిగిన ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసు బలగాలు తీవ్రంగా ప్రయత్నించాయి. మహిళా కానిస్టేబుళ్లు ఆందోళనలో పాల్గొన్న ఖుష్బూ, ఇతర మహిళా నాయకులు, కార్యకర్తలు సుమారు 500 మందిని అరెస్టు చేసి వ్యాన్లలో తరలించారు. స్టాలిన్ క్షమాపణ చెప్పాలి...ఆందోళనలో పాల్గొన్న బీజేపీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు ఖుష్బూ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని చోట్లా మహిళలకు భద్రతలేకుండా పోయిందని, విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్( క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్టాలిన్ సారీ చెప్పేంత దాకా తమ పోరాటం ఆగదని కూడా ఆమె హెచ్చరించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
ఆదివారం
05 । జనవరి । 2025

## ‘దళపతి 69’ సినిమా ‘భగవంత్ కేసరి’ రీమేక్ కాదు.. దర్శకుడు క్లారిటీ



గతేడాది గోట్ ‘ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్’ సినిమాతో హిట్ అందుకున్న తమిళ అగ్ర నటుడు దళపతి విజయ్ ప్రస్తుతం హెచ్. వినోద్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. దళపతి 69 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో పూజ హెగ్దే కథానాయికగా నటిస్తుండగా.. ప్రేమలు బ్యూటీ మమితా బైజు కీలక పాత్రలో నటించబోతుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా ఒక వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. టాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్న బాలకృష్ణ భగవంత్ కేసరి సినిమాను దళపతి 69గా రీమేక్ చేస్తున్నట్లు.. ఇప్పటికే దీనికి సంబంధించిన తమిళం హక్కులను కూడా మేకర్స్ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఈ వార్తలపై దర్శకుడు హెచ్. వినోద్ క్లారిటీ ఇచ్చాడు. ఈ సినిమా భగవంత్ కేసరి రీమేక్ కాదని.. ఇది ఒక ఒరిజినల్ కథ అని.. విజయ్‌కి ఈ చిత్రం పక్కా మాస్ కమర్షియల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ అవుతుందని తెలిపాడు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ మూవీని నిర్మించనుంది. ఈ సినిమాను అక్టోబర్ 2025న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.





# స్పీడ్ తగ్గిస్తానంటోన్న మీనాక్షి!

మీనాక్షి చౌదరి కెరీర్ జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో అమ్మడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెండ్ భామగా మారుతోంది. మీనాక్షి చౌదరి కెరీర్ జెట్ స్పీడ్ తో పరుగులు పెడుతోన్న సంగతి తెలిసిందే. వరుస విజయాలతో అమ్మడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెండ్ భామగా మారుతోంది. ఈ ఏడాది గుంటూరు కారం-, లక్కీ భాస్కర్ తో భారీ విజయాలు అందుకుంది. దళపతి విజయ్ తో ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ లో స్క్రీన్ షేర్ చేసుకుంది. పాన్ ఇండియాలో రిలీజ్ అయిన వరుణ్ తేజ్ మట్కాలోనూ నటించింది. మెకానిక్ రాకీ-తోనూ మురిపించింది. ఇలా ఏడాదంతా అమ్మడు సినిమాలతో సందడి చేసింది. ఇక కొత్త ఏడాదిలో సంక్రాంతి కానుకగా -సంక్రాంతి కి వస్తున్నాం అంటూ ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతున్న చిత్రమిది. ఇందులో అమ్మడు వెంకటేష్ కి ప్రియురాలి పాత్రలో అలరించనుంది. అయితే ఇదే ఏడాది అమ్మడు కొన్ని మార్పులకు ఛాన్స్ ఇచ్చింది. ఇకపై సినిమాలు ఎడెపెడా చేయనని...నంబర్ కోసం కాకుండా మంచి కథలు మాత్రమే ఎంచుకుని పనిచేస్తానని తెలిపింది. రామ్ చరణ్ 2024 ఒకే ఏడాది అన్ని సినిమాలు రిలీజ్ అవుతాయని ఎప్పుడూ అనుకోలేదని..అదంతా దానంతటదే జరిగిపో యిందని చెప్పుకొచ్చింది. ఇప్పటి వరకూ ఎక్కువగా సినిమాలకే సమయం కేటాయించానని, ఇకపై కుటుంబం కోసం, తన కోసం ఎక్కువగా సమయం కేటాయించాలకుంటున్నట్లు తెలిపింది. మీనాక్షి కెరీర్ ఐదేళ్ల క్రితమే మొదలైంది. తొలి సినిమా ఇచట వాహనములు నిలుపరాదులో నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. అప్పుడే త్రివిక్రమ్ ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత హిట్ ది సెకెండ్ కేస్ తో మరో హిట్ పడింది. ఖిలాడీతో వైఫల్యం ఎదురైనా మీనాక్షి జోరును ఆ ఫ్లాప్ ఆపలేకపోయింది. అప్పటి నుంచి వరుసగా సినిమాలు చేసుకుంటూ బిజీ అయింది. ప్రస్తుతం నవీన్ పోలిశెట్టితో -అనగనగా ఒక రాజులో నటిస్తోంది. అలాగే మరో రెండు చిత్రాలు కూడా ఆన్ సెట్స్ లో ఉన్నాయి.




# వాళ్లంతా ఒక్కటైతే...బాలయ్య ఒక్కడే అలా!



సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, బాలకృష్ణ ఒక జనరేషన్ హీరోలు. అప్పట్లో ఆ నలుగురు హీరోల మధ్య నువ్వా? నేనా? అన్న రేంజ్ లో పోటీ ఉండేది. వాళ్ల సినిమాలు రిలీజ్ అవుతున్నాయంటే అభిమానుల మధ్య వైరాలు కూడా అలాగే తెరపైకి వచ్చేవి. నాగార్జున నాగేశ్వరరావు వారసత్వంతో ఎంట్రీ ఇస్తే, బాలకృష్ణ ఎన్టీఆర్ వారసత్వంతో తెరంగేట్రం చేసారు. ఇక వెంకటేష్ తండ్రి మూవీ మొఘల్ రామానాయుడు పెద్ద నిర్మాత కావడంతో ఎంట్రీ ఈజీ అయింది. రామ్ చరణ్ ఇలా ఈ ముగ్గురికి ఇండస్ట్రీ అంటే చిన్న వయసు నుంచే అలవాటుంది. నాగార్జున-వెంకటేష్ కుటుంబాల మధ్య బంధుత్వం కూడా ఉంది. ఈ ముగ్గుర్ని స్టార్ కిడ్స్...గోల్డెన్ స్పూర్ హీరోలుగా పేర్కొంటారు. ఇక చిరజీవి ప్రయాణం వీళ్లకు ఎంతో భిన్నమైనది అన్నది తెలిసిందే. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నటుడాయన. అలాంటప్పుడు చిరంజీవి ఒక్కడే ఒకవైపు ఉంటే ఆ ముగ్గురు ఒక్కటిగా ఉండటానికి అవకాశం ఉంటుంది అని అంతా అనుకుంటారు. కానీ ఇక్కడ సీన్ వేరు అని సీనియర్ నటి మీనా మాటల్ని బట్టి తెలుస్తోంది. మీనా ఆ నలుగురు హీరోలతో ఎన్నో సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే. వాళ్లతో మీనాకు మంచి స్నేహం కూడా ఉంది. అయితే నలుగురు సెట్స్ లో ఉండే తీరు వేరుగా ఉంటుందని మీనా అంటున్నారు. చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ ఎంతో క్వైట్ గా ఉంటారుట. మాట్లాడటం చాలా తక్కువగా ఉంటుందట. అవసరమైతే మాట్లాడుతారు తప్ప అనవసరంగా మాట్లాడరని తెలిపారు. %సూశ్రీంశీ =ఝుఖ% - ‘డాకు మహారాజ్’ ట్రైలర్ రిలీజ్ టైం లాక్ కానీ బాలకృష్ణ అలా కాదు అట. తనతో పాటు అందర్నీ మాట్లాడించే తరహా వ్యక్తి అన్నారు. చాలా సరదాగానూ ఉంటారన్నారు. అలాగని మిగిలిన ముగ్గురు సరదాగా ఉండరని కాదు వాళ్లు కూడా బాగా పరిచయమైతే? సరదాగా ఉంటారని..కానీ వాళ్లతో పోలిస్తే బాలయ్య ఇంకా ఫాస్ట్ గా ఉంటారన్నారు. అయితే ఇప్పుడా ముగ్గురిలో ఇద్దరు చిరు-వెంకటేష్ లు బాలయ్య లాగే యమా యాక్టివ్ గా ఉంటోన్న సంగతి తెలిసిందే. ఆఫ్ ది స్క్రీన్ లోనూ హీరోయిన్లు అందరితో సరదాగా జోకులేస్తూ మాట్లాడుతున్నారు.

## బ్రాహ్మణికి మణిరత్నం ఆఫర్.. బాలకృష్ణ ఏమన్నారంటే?



చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, రజనీకాంత్ వంటి అగ్ర కథానాయకులు దశాబ్ధాలుగా వినోదపరిశ్రమను శాసిస్తూనే ఉన్నారు. కానీ ఈ కుటుంబాల నుంచి కథానాయికలుగా ప్రయత్నించిన వారు ఎవరూ లేరు. మెగా కుటుంబం నుంచి నిహారిక మాత్రమే కథానాయికగా ట్రై చేసారు. అయితే రజనీకాంత్ కుమార్తెలు దర్శకులుగా, నిర్మాతలుగా కొనసాగుతున్నారు. చిరంజీవి పెద్ద కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మాత. అయితే నందమూరి బాలకృష్ణ కుమార్తెలు ఉన్నత విద్యావంతులుగా సంస్థానాలను నడిపించే స్థాయికి ఎదిగారు. సినీరంగంతో పరోక్షంగా మాత్రమే సంబంధాలను కొనసాగిస్తున్నారు. బాలయ్య పెద్ద కుమార్తె బ్రాహ్మణి హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సంగతి తెలిసిందే. అయితే బాలకృష్ణ వారసురాలు బ్రాహ్మణిని కథానాయికను చేసేందుకు ప్రముఖ దర్శకుడు మణిరత్నం ప్రయత్నించారు అనే విషయం ఇంతకాలానికి బయటకు తెలిసింది. అది కూడా ఆహా- ఓటీటీ టాక్ షో ద్వారా బయటి ప్రపంచానికి వెల్లడైంది. అన్ స్టాపబుల్ విత్ ఎన్బీకే టాక్ షో హోస్ట్ గా ఉన్న బాలయ్య స్వయంగా ఈ విషయాన్ని రివీల్ చేసారు. సీజన్ 4 ఎనిమిదో ఎపిసోడ్‌లో దర్శకుడు బాబీ, మ్యూజిక్ కంపోజర్ థమన్, నిర్మాత నాగ వంశీ అతిథులుగా కనిపించారు. ఎపిసోడ్ సందర్భంగా.. బాలకృష్ణ తన పెద్ద కుమార్తె బ్రాహ్మణి సినీ అవకాశాల గురించి వెల్లడించారు. థమన్ అడిగిన ఓ ప్రశ్నకు బాలకృష్ణ స్పందిస్తూ.. తన కూతుళ్లిద్దరినీ ఎంతో శ్రద్ధగా, ఆప్యాయంగా పెంచానని బాలయ్య పేర్కొన్నాడు. ప్రఖ్యాత దర్శకుడు మణిరత్నం ఒకప్పుడు బ్రాహ్మణికి తన సినిమాలో హీరోయిన్‌గా నటించమని ఆఫర్ చేశారని వెల్లడించారు. ఈ ఆఫర్‌ని బ్రాహ్మణి దృష్టికి తీసుకెళ్లగా.. నటనపై ఆసక్తి లేకపోవడంతో చివరికి ఆఫర్‌ను తిరస్కరించారని అన్నారు. బాలకృష్ణ తన చిన్న కుమార్తె తేజస్విని అద్దం ముందు నటించేదని, ఆమె నటనలో వృత్తిని కొనసాగించగలదనే నమ్మకం కలిగిందని బాలకృష్ణ పేర్కొన్నారు. తేజస్విని ప్రస్తుతం టాక్ షో కోసం క్రియేటివ్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. కుమార్తెలు ఇద్దరూ తమ తమ రంగాల్లో రాణించడం మా కుటుంబానికి గర్వకారణం.. వాళ్లు నా కూతుళ్లని గర్వంగా చెప్పుకునే స్థాయికి చేరుకోవడం కంటే నాకు ఇంకేం కావాలి అని బాలయ్య ఆనందం వ్యక్తం చేసారు.

## ప్రభాస్ 2025లో మూడు సినిమాలతో వస్తాడా?



2023లో ఆదిపురుష్, సలార్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ప్రభాస్ 2024లో మాత్రం ‘కల్కి 2898 ఏడీ’ సినిమాతో మాత్రమే వచ్చాడు. ప్రతి ఏడాది రెండు సినిమాలను విడుదల చేయాలని ప్రభాస్ చాలా గట్టి ప్రయత్నాలు చేస్తున్నా ఏవో కారణాల వల్ల సాధ్యం కావడం లేదు. ఆయన నుంచి ఈ ఏడాదిలో ఎన్ని సినిమాలు వస్తాయి అనేది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ‘రాజాసాబ్’ సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుందట. టాకీ పార్ట్ దాదాపు పూర్తి అయ్యింది, నాలుగు పాటల చిత్రీకరణ మాత్రమే బ్యాలన్స్ ఉందని తెలుస్తోంది. ఏప్రిల్‌లో సినిమా అనుకున్నా కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. రాజాసాబ్ సినిమాను ఏప్రిల్ నుంచి తప్పించినా కచ్చితంగా సమ్మర్‌లోనే విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభాస్, మారుతి కాంబో సినిమా రాజాసాబ్ 2025 సమ్మర్‌కి దాదాపుగా కన్ఫర్మ్ అయ్యింది. ఇదే ఏడాదిలో ప్రభాస్ నుంచి మరో రెండు సినిమాలు రాబోతున్నాయి. అందులో ఒకటి ఆయన గెస్ట్ అప్పియరెన్స్ ఇచ్చిన ‘కన్నప్ప’. మంచు విష్ణు హీరోగా రూపొందుతున్న కన్నప్ప సినిమాలో ప్రభాస్ నటించడంతో అంచనాలు పెరిగాయి. ఎంత సమయం ప్రభాస్ ఆ సినిమాలో నటిస్తాడు అనేది క్లారిటీ లేదు. కానీ ప్రభాస్ ఫ్యాన్స్ కన్నప్ప సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కన్నప్ప సైతం ఈ ఏడాది సమ్మర్‌లోనే విడుదల కాబోతుంది. రాజాసాబ్‌తో సమాంతరంగా సీతారామం సినిమా దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో సినిమాను ప్రభాస్ చేస్తున్నాడు. ఆర్మీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు ఫౌజీ అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. టైటిల్‌ను అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ షూటింగ్ పూర్తి చేసిన హను రాఘవపూడి సినిమాను సమ్మర్ వరకు పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. యుద్ధం - ప్రేమ బ్యాక్ డ్రాప్‌లో సినిమా ఉంటుందట. భారీ యుద్ధ సన్నివేశాలు ఉన్నా సినిమాను చాలా స్పీడ్‌గా పూర్తి చేయాలని దర్శకుడు హను రాఘవపూడి ప్లాన్ చేస్తున్నారు. అనుకున్నది అనుకున్నట్లుగా జరిగితే 2025లోనే ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో రూపొందుతున్న ఫౌజీ సినిమా వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదే కనుక జరిగితే 2025లో ప్రభాస్ నటించిన మూడు సినిమాలు విడుదల అయినట్లు అవుతుంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి అరుదైన ఘటన జరగలేదు. కెరీర్ ఆరంభం నుంచి ప్రభాస్ నటించిన సినిమాలు ఒకే ఏడాది మూడు విడుదలైన సందర్భాలు లేవు. కనుక 2025 సంవత్సరం ఆయనకు స్పెషల్‌గా నిలుస్తుంది అంటూ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# అంజలి కెరీర్‌కి ఇది ప్లస్సా మైనస్సా?



కెరీర్ ప్రారంభంలో కంటెంట్ ఉన్న అనువాద సినిమాలతో మెప్పించింది తెలుగమ్మాయి అంజలి. తమిళంలో పెద్ద నటిగా నిరూపించి తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టింది. షాపింగ్ మాల్, జర్నీ లాంటి రియలిస్టిక్ ఎప్రోచ్ ఉన్న సినిమాలతో తమిళంలో హిట్లు కొట్టి వాటి అనువాదాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఆ సినిమాల్లో అంజలి నటనకు మంచి అభిమానులేర్పడ్డారు. ఆ తర్వాత సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టులాంటి పెద్ద సినిమాలో డీసెంట్ పాత్రలో నటించి మెప్పించింది. గీతాంజలి లాంటి నాయికా ప్రధాన చిత్రంతోను అంజలి నటనకు మంచి పేరొచ్చింది. కానీ ఈ సినిమా సీక్వెల్ గీతాంజలి మళ్లీ వచ్చింది ఆశించిన ఫలితాన్నివ్వలేదు. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలో బోల్డ్ పాత్రలో నటించినా అది కూడా కలిసి రాలేదు. ఇప్పుడు శంకర్ దర్శకత్వంలోని గేమ్ ఛేంజర్‌పైనే అంజలి చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమా తన ఫేట్ మారుస్తుందని భావిస్తోంది. సినిమాలో రామ్ చరణ్ తండ్రి పాత్ర ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్‌లో అంజలి కనిపిస్తుంది. ఐఏఎస్ అధికారికి తండ్రి అయిన అప్పన్న (చరణ్) కు భార్యగా అంజలి కనిపిస్తుంది. ప్రస్తుత పొలిటికల్ సిస్టమ్‌తో పోరాడే సిన్సియర్ ఐఏఎస్ అధికారి తల్లిగా అంజలి నటించింది. ఒక భార్యగా, తల్లిగా నటించేందుకు స్కోప్ ఉన్న పాత్రలో అవకాశం దక్కిందని అంజలి ఉబ్బితబ్బిబ్బవుతోంది. శంకర్ లాంటి పెద్ద దర్శకుడు తన కెరీర్ గేమ్ ని ఛేంజ్ చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తోంది. అయితే చియాన్ విక్రమ్ -అపరిచితుడు- సినిమాలో నటించేప్పుడు సదా కెరీర్ రేంజ్ అమాంతం మారిపోతుందని అంతా భావించారు. ఆ చిత్రంలో సదా పాత్రను శంకర్ బాగానే ఎలివేట్ చేసారు.. కానీ ఆ తర్వాత అనుకున్నదేమీ జరగలేదు. ఇప్పుడు అంజలికి అలా కాకూడదనే అభిమానులు ఆశిస్తున్నారు. గేమ్ ఛేంజర్ సినిమాలో కియరా అద్వాణీ గ్లామరస్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. డబుల్ ధమాకా! ఆసక్తికరంగా ఈ సంక్రాంతి బరిలో అంజలి నటించిన రెండు సినిమాలు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. తమిళంలో విశాల్ - అంజలి నటించిన మదగజరాజా దాదాపు 13 ఏళ్ల తరవాత విడుదలవుతోంది. ఈ సినిమా సడెన్ గా సంక్రాంతి బరిలోకి వచ్చింది. అయితే విశాల్ లాంటి మాస్ హీరో సినిమా కాబట్టి దీనిపై కొంత ఆసక్తి నెలకొంది. గేమ్ ఛేంజర్ ఇతర తమిళ సినిమాలతోను సంక్రాంతి బరిలో పోటీపడనుంది. తళా అజిత్ విదాముయార్చి వాయిదా పడటంతో గేమ్ ఛేంజర్‌కి, ఇతర సినిమాలకు అడ్వాంటేజ్‌గా మారింది.

## భారత్‌లో అయితే భూకంపం వచ్చేది..!



**సిడ్నీ- నవభూమి:** భారత్- ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో ఇరుజట్లు ఒకే రోజు 15 వికెట్లు కోల్పోయాయి. దీనిపై భారత మాజీ దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ ప్రశ్నలు సంధించారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు ఎప్పుడూ భారత్‌లో పిచ్, పరిస్థితులపై మాట్లాడుతారని.. తాము మాత్రం దేని గురించి ఫిర్యాదు చేయలేదని గవాస్కర్ చురకలంటించారు.

**తొలి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు డౌన్**

సిడ్నీలో శుక్రవారం మ్యాచ్ మొదలు కాగా.. తొలిరోజు వికెట్ నష్టానికి ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా.. రెండోరోజు తొమ్మిది వికెట్లను కోల్పోయింది. అయితే సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ లో భారత బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌట్ చేశారు. దాంతో టీమిండియా నాలుగు పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా సైతం.. బ్యాటింగ్‌లో తడబడింది. రిషబ్ పంత్ తప్ప మరెవరూ భారీ స్కోర్ చేయలేకపోయారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఆరు వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. ప్రస్తుతం టీమిండియా 145 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఇక రెండోరోజు రెండు జట్లు కలిసి మొత్తం 15 వికెట్లు కోల్పోయాయి. భారత్‌లో 15 వికెట్ల పడితే భూకంపం వచ్చేది..


సిడ్నీ మ్యాచ్ రెండోరోజు 15 వికెట్లు పడడంపై మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్ తీవ్రంగానే స్పందించారు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మాజీ ఆటగాళ్లకు సూటిగా పలు ప్రశ్నలు సంధించారు. మ్యాచ్ సమయంలో కామెంటరీ బాక్స్‌లో ఉన్న సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెటర్లు ఎప్పుడూ భారత్‌లోని పిచ్‌లు, పరిస్థితులపై మాట్లాడుతుంటారని గుర్తు చేశారు. తాము పంచాయితీలకు పోవడం లేదని.. ఇలాంటి విషయాలపై ఎప్పుడూ ఫిర్యాదు చేయడం చూసి ఉండరని గవాస్కర్ పేర్కొన్నారు.

## సామ్ కాన్‌స్టస్-బుమ్రా వివాదంపై స్పందించిన రోహిత్ శర్మ..!



**సిడ్నీ- నవభూమి:** సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదో టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు సామ్ కాన్‌స్టాస్, ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వివాదంపై రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ స్పందించాడు. ఏ కారణం లేకుండా ఆటగాళ్లు గొడవకు దిగడం తగదని చెప్పాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన నాల్గో టెస్టులో బుమ్రా-కాన్‌స్టాస్ మధ్య పోటీ కనిపించింది. ఆస్ట్రేలియా యువ బ్యాట్స్‌మెన్ కాన్‌స్టాస్.. బుమ్రా బౌలింగ్‌కు కాస్త దూకుడు ప్రదర్శించాడు. రెండో ఇన్నింగ్స్‌లో బుమ్రా బౌలింగ్‌లోనే కాన్‌స్టాస్ అవుట్ అయ్యాడు. ఐదో టెస్టు తొలిరోజు ఆటముగిసేందుకు చివరి ఓవర్‌లో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ సమయంలో బుమ్రా తన మూడో ఓవర్‌లో ఐదు బంతిని వేయడానికి రన్ అప్ తీసుకుంటుండగా.. బ్యాట్స్‌మెన్ ఖవాజా బ్యాటింగ్‌కు సిద్ధంగా లేకపోవడంతో బుమ్రా అసంతృప్తి వ్యక్తం చేశాడు. మరో ఎండ్‌లో ఉన్న కాన్‌స్టాస్ బుమ్రా వైపు చూస్తూ ఏదో గొణుగుతూ కనిపించాడు. దాంతో బుమ్రా ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతని వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా.. అంపైర్ జోక్యం చేసుకొని కాన్‌స్టాస్‌ను బుమ్రా వద్దకు రాకుండా అడ్డుకున్నాడు. దాన్ని చూసిన ప్రేక్షకులు పెద్ద ఎత్తున కేకలు వేశారు. దాంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

## మరో స్టార్ జంట విడాకులు..? ఇన్‌స్టాలో ఒకరినొకరు అన్‌ఫాలో..!



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత క్రికెట్ టీమ్‌లో మరో జంట విడాకులకు సిద్ధమె_నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో రీల్స్‌తో ఫ్యాన్స్‌ను అలరిస్తున్న భారత స్టార్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ జంట విడాకులు తీసుకోబోతోందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రూమర్స్ నేపథ్యంలో తాజాగా ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అంతేకాదు ధనశ్రీతో ఉన్న ఫొటోలను కూడా చాహల్ తొలగించాడు. మరోవైపు ఈ జంట విడిపోవడానికి నిర్ణయించుకున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే విడాకులు తీసుకోబోతున్నారంటూ తెలిపాయి. అందుకు ఖచ్చితమైన కారణాలు మాత్రం చెప్పలేదు. విడాకులు అధికారికం కావడానికి మరికొంత సమయం పట్టొచ్చని పేర్కొన్నారు. చాహల్.. దంత వైద్యురాలైన ధనశ్రీ 2020 డిసెంబర్ 22న పెండ్లి చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇటీవలే ధనశ్రీ తన పేరు నుంచి ‘చాహల్’ నేమ్‌ను తీసేయడంతో ఈ జంట విడాకులు తీసుకోబోతోందంటూ పుకార్లు వ్యాపించాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**